

# శోధన

మాలతి దేచిరాజు

# శోధన



అర్థరాత్రి స్వాతంత్ర్యాన్ని, మహాత్ముడి మాటలను,
ఆడదాని స్వేచ్ఛను శోధిస్తూ, పరిశోధిస్తోంటే ఆ శోధన ఓ క్షిపణిగా మారితే,
ఆ అపరాధ పరిశోధనే...శోధన అయితే?

మాలతి దేచిరాజు

**జె.వి. పబ్లికేషన్స్**

హైదరాబాద్

# Sodhana

By

**Malathi Dechiraju**

First Published: February, 2017

© Author

Price: Rs. 100/-

Published by:
**J.V. Publications**
Hyderabad - 500 029
jyothivalaboju@gmail.com

DTP & Type Setting:
**K. Ravi Prabha**,
Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

*Books available at:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

e-book: kinige.com



# శోధన

స్పీడ్‌గా వెళుతున్న కారులో నుంచి అద్దం దించి ఏదో కవర్‌ని రోడ్ మీద పడేశాడు ఓ కడుపు నిండిన ధనికుడు. కవరు కిందపడటంతోనే కొన్ని బిర్యాని మెతుకులు చెల్లాచెదురు కావడం, కారు వెనక టైర్ ఆ కవర్‌ని క్రాస్ చేయడం క్షణాల్లో జరిగిపోయింది.

ఆ కవర్‌లో కె.ఎఫ్.సి బాక్స్ ఉంది, అందులోనుండి చికెన్ వాసన గుప్పుమంటూ తగిలింది కాబోలు ఎక్కడో ఓ మూల పడుకున్న నాలుగు కుక్కలు

పోటీలు పడుతూ పరిగెత్తుకు వచ్చి దేనికి అందింది అది తీసుకొని పరిగెత్తాయి. ఆ పెనుగులాటలో కుక్కల పంటిగాటుతో సరిపెట్టి అక్కడే వదిలేసిన కవర్ తరుముతున్న గాలికి భయపడుతున్నట్లు మధ్య రోడ్ నుంచి సిగ్నల్ లైట్‌కి ఎడమ వైపుకి ఎగిరింది.

అప్పుడే ఆఫీస్ మెట్లు దిగి రోడ్డు మీద కాలుపెట్టిన హరిణి కాలి ముందు నుంచే ఆ కవరు ఎగురుకుంటూ వెళ్ళిపోయింది. హరిణి నడుచుకుంటూ తన సెల్ ఫోన్‌లో టైమ్ చూసుకుంది. 10.45 p.m అయింది. అది చూడగానే ఆమె అడుగులు వేగం అందుకున్నాయి.

“రేయ్ అన్నీ లోపల పెట్టేశావా?” అన్నాడు రెండు వేళ్ళ మధ్య పెన్ను, కుడిచేతిలో వెలుగుతున్న లైటర్‌తో అంకెలు కూడుతూ కేష్ కౌంటర్ దగ్గర కూర్చున్న వెల్‌కం బేకరీ ఓనర్.

“పెట్టేసాను సార్” అంటూనే కౌంటర్ దగ్గరకి వచ్చాడు శీను.

ఎదురుగా గుమ్మం దగ్గర ఎవరో ఉండటం చూసి “ఏం కావాలి మేడమ్?” అన్నాడు శీను.

“అర్జెంట్‌గా ఒక బర్త్ డే కేక్ కావాలి” హ్యాండ్ బ్యాగ్‌లో నుండి డబ్బులు తీస్తూ అన్నది హరిణి.

“సారీ మేడమ్ ఫుల్ కేక్స్ అన్నీ అయిపోయాయి. తయారుచేసి ఇచ్చే టైమ్ కూడా లేదు” అన్నాడు పుస్తకం మీద పెన్నుపాళిని ఆడిస్తూ ఓనర్.

“సార్ ప్లీజ్ సార్, దారిలో ఎక్కడా బేకరీలు లేవు. అన్ని షాపులు మూసేసి ఉన్నాయి. నాకిప్పుడు కేక్ చాలా అవసరం, ప్లీజ్” అంటూ ఇంకా ఆమె బతిమిలాడుతూ ఉండగానే ఓనర్ ఆమె మాటలకి అడ్డుపడి “సారీ మేడమ్! ఇప్పటికే 11 గంటలు అయింది, ఇంకాసేపు ఉంటే పోలీసులు వస్తారు నేనేమీ చేయలేను” అంటూ మళ్ళీ తన లెక్కలు చూసుకోసాగాడు.

“సార్ సార్! రేపు మా నాన్న పుట్టిన రోజు. నా మొదటి జీతంతో కేక్ కొని మా నాన్నతో సెలబ్రేట్ చేసుకోవాలని ఆశపడుతున్నా” అంటూ దీనంగా బతిమాలుతోంది ఆమె.

అంతలో శీను కల్పించుకొని, “సార్, చేసేద్దాం లెండి. పాపం ఇంతలా బ్రతిమిలాడుతోంది కదా! అయినా మీ లెక్కలు అవీ పూర్తి అయ్యేసరికి ఇంకో

అరగంటైనా పడుతుంది కదా! ఈ లోపు రెడీ చేసి తెచ్చేస్తాను ఎలాగో రేపు ఉదయం ఆర్డర్ కోసం అన్నీ మిక్స్ చేసి రెడీగానే ఉన్నాయిగా, ఎక్కువ సేపు పట్టదు" అన్నాడు.

అది విన్న హరిణి ఆశగా మరోసారి ఓనర్‌ని బ్రతిమిలాడింది.

ఏం అనుకున్నాడో ఏమో ఆ ఓనర్ "ఓకే మేడమ్! మీరలా కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న స్టూల్ చూపించాడు.

"థాంక్స్" అంటూ కూర్చోబోతూ ఏదో గుర్తుకువచ్చినట్లు గబగబా బ్యాగ్‌లో నుండి ఒక కాగితం పెన్ను తీసుకొని రాసి శీను చేతికి ఇచ్చింది "కేక్ మీద రాస్తారు కదూ" అంటూ.

అది తీసుకొని "సరే" అంటూ లోపలికి నడిచాడు శీను.

బేకరీలో ఉన్న గడియారంలో సెకన్ ముల్లు నాల్గవ నెంబర్ దగ్గర ఉన్న పెద్ద ముల్లు నుండి 11వ నెంబర్ దగ్గరున్న చిన్న ముల్లు వైపు కదులుతోంది.

"ఇదిగోండి మేడమ్" అంటూ పేక్ చేసిన కేక్ బాక్స్ కవర్‌లో పెట్టి హరిణికి అందించాడు శీను. "థాంక్యూ" అని డబ్బులు తీస్తూ కౌంటర్ దగ్గరకి వచ్చి "ఎంత అయిందండి" అని అడిగింది హరిణి.

"250/- మేడమ్" అన్నాడు ఓనర్.

హరిణి 3 వంద రూపాయల నోట్లు తీసి అతనికి ఇచ్చింది.

అది అందుకున్న ఓనర్ 50 రూపాయల నోట్ తిరిగి ఆమె చేతికి ఇచ్చాడు.

"థాంక్యూ" అని చెపుతూనే బయటకి నడవబోతూ ఏదో మర్చిపోయినట్లు ఆగి వెనక్కి వచ్చి ఓనర్ తనకిచ్చిన 50 రూపాయల నోట్ అక్కడే నిలుచున్న శీను చేతికి ఇస్తూ "వన్స్ ఎగైన్ థాంక్యూ" అంది.

శీను చిరునవ్వుతోనే ఆమెకి కృతజ్ఞతలు చెప్పాడు.

"ఒక్క పదినిమిషాలు ఆగండి మేడమ్.. షాప్ కట్టేసి మావాడు మీకు తోడుగా వస్తాడు. బాగా లేటైంది. ఈ టైమ్‌లో ఒక్కరే వెళ్ళడం అంత మంచిది కాదు" అన్నాడు బేకరీ ఓనర్, షాప్ బయటకి అడుగుపెడుతున్న హరిణితో.

"ఫర్లేదండి. టైమ్ లేదు ఏ ఆటోనో, టాక్సీనో పట్టుకొని వెళ్తాలెండి" అని

హడావిడిగా అక్కడనుండి కదిలింది ఆమె. ఓనర్ మాటల్లో అంతరార్థం అర్థం కానట్లు.

❖ ❖ ❖

సింహం వంటి చిన్నోడే వేటకొచ్చాడే... రేడియోలో వస్తున్న ఆ సినిమా పాట వింటూ డ్రైవ్ చేస్తున్నాడు కాబ్ డ్రైవర్.

వెనక సీట్‌లో కూర్చున్న పాసింజర్ అదే పాటని హమ్ చేస్తున్నాడు.

ఫ్రంట్ మిర్రర్ నుండి ఎవరో కారు ఆపమన్నట్లుగా కనిపించింది వారికి.

డ్రైవర్ ఆ చేయి చూపుతున్న మనిషి దగ్గరకు వచ్చి కారు ఆపి లెఫ్ట్ డోర్ నుండి చూస్తూ "ఎక్కడికి వెళ్ళాలి మేడమ్?" అనడిగాడు.

"హిమాయత్ నగర్" అంది హరిణి కాస్త వంగి డ్రైవర్‌తో.

"ఎక్కండి మేడమ్!"

"సార్, మీరు కొద్దిగా ముందు సీట్‌లో కూర్చుంటారా? లేడీస్ కదా!" అనడంతో ముందు సీట్‌కి షిఫ్ట్ అయ్యాడు వెనక సీట్‌లో కూర్చున్న పాసింజరు.

హరిణి వెనక సీట్‌లో కూర్చోగానే కాబ్ కదిలింది.

ఖైరతాబాద్ జంక్షన్ దగ్గర కాబ్ ఆగింది "ఎక్కడికి సార్?" అన్నాడు డ్రైవర్ కారు ఆపిన వ్యక్తితో.

"అబిడ్స్" అన్న అతని మాటలతో తన ఆలోచనలనుండి బయటకి వచ్చింది హరిణి. కానీ అంతగా ఏం పట్టనట్లు అతని వైపు చూసింది. అతను వెనక డోర్ తీసి లోపలికి ఎక్కుతుండగా చూసి పక్కకి జరిగింది హరిణి.

కాబ్ ఖైరతాబాద్ నుంచి ఐమాక్స్‌కి వెళ్ళే ఫ్లైఓవర్ వైపు కదిలింది.

సరిగ్గా ఫ్లైఓవర్ మధ్యలో కాబ్ ఉండగా హరిణికి ఏదో తట్టినట్లు... "అవునూ, హిమాయత్‌నగర్ వైపు కదా మనం వెళుతున్నాం. మరి ఈయన అబిడ్స్ అంటే ఎక్కించుకున్నారేంటి?" అన్నది కాస్త సందేహంగా.

"పాప బాగా షార్ప్ రోయ్" అన్నాడు ముందు సీట్లో కూర్చున్న ప్యాసింజర్.

ఒక్కసారిగా హరిణి నివ్వెరపోయింది. కళ్ళు పెద్దవి చేసింది. "కారు ఆపు... ఆపు" అంటూ డ్రైవర్ చొక్కా పట్టుకొని ఊపుతోంటే, ఆమె పక్కన కూర్చున్న

మరో ప్యాసింజర్ హరిణి చెంప మీద ఛెళ్ళున చాచి కొట్టి ఆమెని అదుపు చేయడానికి తన ఆధీనంలోకి తీసుకున్నాడు.

''ప్లీజ్ నన్ను వదిలేయండి... నన్ను ఏమీ చేయకండి'' అంటూ ప్రాధేయపడుతూ ఆక్రందనలు పెడుతోంది హరిణి.

'ఆ... అక్కడేదో చేసి..ఇక్కడేదో నొక్కి' అంటూ వస్తున్న రేడియో పాటని యమా హుషారుగా హమ్ చేస్తున్నాడు ముందు సీట్‌లో కూర్చున్న అతను.

డ్రైవర్ స్పీడ్ పెంచడంతో కారు వాయువేగంతో దూసుకుపోతోంది.

పెనుగులాడుతూ, ప్రాధేయపడుతూ, ఆక్రందనలు చేస్తూ అలసిపోతోంది హరిణి... కనికరంలేని విషనాగుల వికృత హాస్యాల ముందు అవి నిశీధిలో అరణ్యరోదనలే అవుతున్నాయి

నిర్మానుష్యపు సర్వీస్ రోడ్డు మీద ఆగి ఉన్న కాబ్ ఊగుతోంది. భారంగా వస్తున్న చిన్నపాటి మూలుగులు చుట్టూ ఉన్న పచ్చని చెట్ల కొమ్మలకి అంటి ఉన్న ఆకులకు 'నన్ను కాపాడండి' అని వినిపిస్తోంది కాబోలు గాలి తాకిడికి అటూ ఇటూ విరుచుకుపడేంత వేగంగా ఊగుతున్నాయి.

జరిగే ఘోరాన్ని కళ్ళారా చూడలేక, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో నిండు వెన్నెల సైతం మబ్బులచాటుకు వెళ్ళిపోయింది.

"ఏరా! మీ ఇద్దరిదీ అయిపోయిందా?" అడిగాడు అప్పుడే అక్కడికి వచ్చిన వీళ్ళల్లాంటి మరో దుర్మార్గుడు.

"ఊ" అని ఒకేసారి అన్నారిద్దరూ.

ఇంతలో కారులోనుండి ఒళ్ళు విరుచుకుంటూ బయటకి వచ్చాడు అంతవరకు కారు నడిపిన కామాంధుడు.

"ఒళ్ళు విరిచింది చాలు కానీ జరుగు జరుగు" అన్నాడు వంటికున్న చొక్కాని ఆత్రంగా విప్పేస్తూ కొత్తగా వచ్చినవాడు.

"రేయ్ చచ్చిపోయిందిరా" అన్న మాటతో లోపలికి వెళుతున్న వాడు కాస్తా ఆగి...

"ఆ... ఇది నా గర్ల్ ఫ్రెండ్ మరి బతికుంటే కోపరేషన్ ఇవ్వడానికి. ఎల్లు బే" అంటూ లోపలికి వెళ్ళాడు.

కాబ్ ఇంకాసేపు ఊగింది అదే తన పని అన్నట్లు.

తర్వాత యధావిధిగా కాబ్ తన ప్రయాణం మొదలుపెట్టింది.

తెల్లగా ఉన్న జీబ్రా క్రాసింగ్‌పై ఒక్కసారిగా దబ్బుమని పడింది హరిణి శరీరం.

కాబ్ డోర్ వేసేశాడు వెనక కూర్చున్నవాడు.

❖ ❖ ❖

సూర్యుడు అప్పుడే ఒళ్ళు విరుచుకుంటూ తూరుపు తలుపు తీసుకొని వస్తున్నాడు. ఎర్రగా ఉన్న కాళ్ళపై ఈగలు ఏవో వెతుకుతున్నట్లు తిరుగుతున్నాయి. కాలంకన్నా వేగంగా హరిణి శవం దగ్గర జనం గుమిగూడారు. పూర్తిగా తెల్లవారేసరికల్లా ఈ విషయం పోలీస్ దగ్గరనుండి పొలిటీషియన్స్ వరకూ యావత్ రాష్ట్రం పాకింది. ఏ ఛానల్ చూసినా ఇదే ఉదంతం.

టీవీ చానెళ్ల న్యూస్‌లో యధావిధిగా వస్తున్న ప్రకటనల నడుమ హఠాత్తుగా బ్రేకింగ్ న్యూస్... ఎంతో ఉత్సాహంగా కేప్షన్స్ పెట్టి మరీ చెప్తున్నారు.

హరిణి తండ్రి కాఫీ కప్పుతో వచ్చి టీవి ఆన్ చేశాడు. అప్పుడు టీవీలో

యాంకర్: అక్కడే ఉన్న మా ప్రతినిధిని అడిగి మరిన్ని విషయాలు తెలుసుకుందాం!

"చెప్పండి సంధ్యా! దీని గురించి పోలీసులు ఏమంటున్నారు?"

"అక్కడ ఉన్న ప్రజలు ఎలా స్పందిస్తున్నారు?"

"మీ దగ్గర ఉన్న ఇన్ఫర్మేషన్ ఏంటీ?"

అంటున్న ఆ యాంకర్ మాటలకి 'దేవుడా! మళ్ళీ ఏదో జరిగినట్లుంది. చిన్నపిల్లలకి చాక్లెట్ దొరికినట్లు ఈ టీవీ వాళ్ళకి ఏదో న్యూస్ దొరికినట్లుంది. ఇంక పొద్దుటినుండి రాత్రి దాకా వాయించేస్తారు' అనుకుంటూనే టీవీ వార్తలను చూస్తున్నాడు ముకుందరావు.

రిపోర్టర్: భాగ్యనగరంలో మరో కీచక పర్వం. అర్ధరాత్రి భాగ్యనగరంలో జరిగిన మరో ఉన్మాదం. కొందరు దుండగులు ఒక ఆడపిల్లను సామూహికంగా అత్యాచారం చేసి, తరవాత దారుణంగా హత్య చేసి, నడిరోడ్డుమీద వదిలేసి వెళ్ళిన ఉదంతం.

"ఆడది అర్ధరాత్రి ఒంటరిగా నడిచినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అన్నాడు మహాత్ముడు. అదే ఆడది పట్టపగలైనా బయటకి వెళితే ఇంటికి క్షేమంగా తిరిగివస్తే చాలనుకుంటున్నారు ఈనాటి తల్లితండ్రులు."

"ఏవండీ! హరిణి ఇంకా ఇంటికి రాలేదు రోజూ ఈపాటికే వచ్చేస్తుంది. పైగా రాత్రి మీ పుట్టిన రోజని ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకొని వచ్చేస్తా అని కూడా చెప్పింది" అంటూ వచ్చింది భార్య లక్ష్మి.

"నాకు కూడా అలా అనే చెప్పిందిలే. అయినా కొత్తగా చేరిన జాబ్, పెద్ద కంపెనీ అంత ఈజీగా పర్మిషన్ దొరకదు కదా! పైగా ఇంకా నాకు ఈ పుట్టిన రోజులు, కేకు అంటూ ఏంటీ తల్లీ? వద్దు అని కూడా చెప్పాను, అయినా కంగారు పడకు వచ్చేస్తుందిలే" అన్నాడు ఎంతో నమ్మకంగా ఆ తండ్రి.

"కాదండి! నాకెందుకో మన అమ్మాయి గురించే చెప్తున్నారనిపిస్తోంది ఈ టీవీ వాళ్ళు" అంటుండగానే డోర్ బెల్ మోగింది "నేను తీస్తా ఉండు" అంటూ వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా పోలీసులు.

"మీ అమ్మాయి ఇంట్లో ఉందా?" అని అడుగుతూ.

"లేదండీ! ఆమె కోసమే ఎదురుచూస్తున్నాం. ఆఫీస్ నుండి ఇంకా రాలేదు అయినా మీరెందుకు ఇవన్నీ అడుగుతున్నారు?"

"ఈ గాజులు, వాచీ మీ అమ్మాయివేనా?"

ఆత్రంగా పరిగెత్తుకు వచ్చింది తల్లి. పోలీసుల చేతుల్లో ఉన్న వస్తువులు చూస్తూనే జరిగిందేమిటో అర్థం అయిపోయింది ఆ తల్లితండ్రులకి.. ఒక్క సారిగా కుప్పకూలిపోయారు అక్కడే.

❖ ❖ ❖

సంఘటన జరిగిన మరునాడే ఒక ప్రముఖ టీవీ ఛానల్లో మహిళా భద్రత – చేపట్టాల్సిన చర్యలు అన్న అంశంపై ఏర్పాటు చేసిన చర్చకి హరిణి తండ్రిని కూడా ఆహ్వానించారు ఆ ఛానల్ యాజమాన్యంవారు.

కూతురుని పోగొట్టుకున్న బాధ కంటే మానవత్వం లేని మనుష్యుల మధ్య, ఆడపిల్లలకి భద్రత కల్పించలేని సమాజంలో బ్రతుకుతున్నందుకు కుమిలిపోతున్న

ఓ తండ్రి అతను. ఆనాటి చర్చకి హోమ్ మినిష్టర్, ప్రతిపక్ష నాయకుడు వస్తూ ఉండటం చేత ఆ ఛానల్ అధినేత స్వయంగా యాంకర్ స్థానాన్ని తీసుకున్నారు.

"గుడ్ మార్నింగ్! నిన్న మనం ఒక దారుణాన్ని, అమాయకురాలైన హరిణి మీద జరిగిన అత్యాచారం, హత్య. ఇది ఈ నెలలో జరిగిన 3వ దారుణం. ఈ విషయం మీద చర్చించడానికి మనం ఏర్పాటుచేసిన ఈ చర్చావేదికకి మన హోమ్‌మినిస్టర్ ధనంజయరావుగారు, ప్రతిపక్ష అధినేత మురళీకృష్ణగారు, బాధితురాలు హరిణి తండ్రి ముకుందరావుగారు విచ్చేసారు. ఈ సంఘటన గురించి వీరి అభిప్రాయాలను తెలుసుకుందాం.

ముందుగా "హోమ్‌మినిస్టర్‌గారు మన నగరంలో జరుగుతున్న దారుణాల గురించి మీ అభిప్రాయం, మహిళల భద్రత కోసం మీరు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?"

"నిన్న జరిగిన హరిణి ఉదంతం నన్ను కలిచివేసింది. నేను ఈ సంఘటనని తీవ్రంగా ఖండిస్తున్నాను, దీనికి బాధ్యులైన నేరస్తులు ఎంతటివారైనా ఉపేక్షించం. ఇప్పటికే పోలీసు యంత్రాంగం ఈ నేరస్తులను వెతికే ప్రయత్నంలో ఉంది. అతి త్వరలో దోషులను మీ ముందుకు తీసుకు వస్తాం."

"ఇక రెండవది ఆడవాళ్ళ భద్రత గురించి మా ప్రభుత్వం పెద్దపీట వేసింది కాబట్టే మేము అధికారంలోకి వచ్చాక ఆడవాళ్ళ మీద జరుగుతున్న అఘాయిత్యాలు చాలావరకు తగ్గాయని మీరు కూడా గమనించే ఉంటారు" అన్నారు హోమ్ మినిష్టర్.

"భేష్! ఈ నెలలో ఇది 3వ సంఘటన.. మీరు, మీ ప్రభుత్వంవారు నేరాలను చాలా బాగా తగ్గించారండి" వెటకారంగా అన్నాడు ప్రతిపక్ష నాయకుడు.

"ముందు నన్ను మాట్లాడనీయండి. తరవాత మీకు కూడా అవకాశం వస్తుంది, అప్పుడు మాట్లాడుదురు కానీ. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల గురించి ప్రత్యేకంగా ఒక నిఘా వ్యవస్థని కూడా ఏర్పాటుచేసాం.. అర్ధరాత్రి ఉద్యోగాలు చేస్తున్న మహిళల కోసం రవాణా వ్యవస్థని కూడా పెంచాం, పెట్రోలింగ్ వ్యవస్థని మరింత పటిష్టం చేశాం" అన్నారు హోమ్‌మినిస్టర్.

"చేస్తాం, చేస్తున్నాం అంటున్నారు సరే!! ఒకే నెలలో జరిగిన మూడు అత్యాచార ఘటనలు మీ పరిపాలనా వైఫల్యాన్ని చూపించటం లేదా? ఇదేనా

మహిళలకు మీరు కల్పిస్తున్న భద్రత? ఇలా ఇంకెందరు మీ చేతకానితనానికి బలి కావాలి? సామాన్య ప్రజలకి భద్రత కల్పించడం మీ కనీస బాధ్యత కాదా? రోజుకెన్ని దోపిడీలు, మానభంగాలు, హత్యలు జరుగుతున్నాయో టీవీల పుణ్యమా అని చదువురాని పామర్లకి సైతం అర్థం అవుతోంది.. ఇంకా ఎందుకు సార్ ప్రజలని పిచ్చివాళ్ళని చేస్తారు" ఆవేశంగా అంటున్న ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకుంటూ,

"సార్, ఇప్పుడు మనం మహిళల మీద జరుగుతున్న అత్యాచారాల గురించి చర్చించుకుంటున్నాం.. హత్యలు, దోపిడీల గురించి కాదు" అన్నాడు టీవి అధినేత రవిశంకర్.

"ఈ సంఘటన గురించి నిన్న సి ఎం ని కలవడం జరిగింది, కేసుకి సంబంధించిన పూర్వాపరాలను నిశితంగా పరిశీలించాలని, నేరస్తులు ఎంతటి వారైనా శిక్షించక తప్పదని, ఆదేశాలను పోలీసువారికి జారీచేయడం జరిగింది. నిన్నటి సంఘటన ఆధారంగా భద్రతా లోపాలపై చర్చిస్తూ భద్రత ఇంకా పటిష్టం చేయాలని సంకల్పించాం. ఆ వివరాలు త్వరలో ప్రజల ముందుకు వస్తాయి" అన్నారు హోమ్‌మినిస్టర్ .

"ఆ! మీరు వివరాలు మాకు తెలియచేసే లోపూ మనం ఇంకో 20 సార్లు ఇక్కడ కూర్చోవాల్సి వస్తుందేమో చూసుకోండి."

"మీరేదో భద్రత బాగా కల్పించినట్లు మాట్లాడుతారేటి? మీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు క్రైమ్ రేటు ఎంత ఉందో పాత పేపర్స్ ఒక్కసారి తిరగేసి చూసుకోండి ముందు.. ఆ తరవాత వాటిని నేటితో పోల్చి చూసుకోండి. ఆ తర్వాత పబ్లిక్‌లోకి వచ్చి మాట్లాడండి" అన్నారు హోమ్‌మినిస్టర్.

"గతాన్ని తవ్వితే మిగిలేది ఏమీ లేదు, గుంట తప్ప. అయినా ఇప్పుడు నడుస్తోంది మీ ప్రభుత్వం. మీరు ఏం చేస్తున్నారో మాట్లాడుకుంటే చాలు మనం."

"సార్, మీ రెండు ప్రభుత్వాలు, వాటి పని తీరులలో పెద్దగా తేడా ఏమీ లేదు అన్న విషయం ప్రజలందరికీ తెలుసు. వాటి జోలికి పోకుండా ఇలాంటి దారుణాలు ఇంక ముందు జరగకుండా ఏదైనా పటిష్టమైన చట్టాన్ని రూపొందించటానికి ప్రయత్నించండి" అన్నాడు రవిశంకర్.

"చట్టం తీసుకురావడానికి మాకు అసెంబ్లీలో ప్రతిపక్షాలు సహకరించాలి కదండీ. రోజూ ఏదో ఒక గోల, దాంతో అసెంబ్లీ వాయిదా.. ఇంకేం చట్టం తీసుకురాగలం చెప్పండి. ఇలాంటి ప్రతిపక్షం ఉండటం మన ప్రజలు చేసుకున్న దురదృష్టం" అన్నారు హోమ్‌మినిస్టర్.

"ఏం మాట్లాడుతున్నారండి మీరు? ఆ! ఏం మాట్లాడుతున్నారు అంట.. అసెంబ్లీలో ఏ ఒక్క రోజైనా, ఎప్పుడైనా ఇది ప్రజలకి ఉపయోగపడే మంచిపని. దీనికి మనం చట్టం తీసుకు రావాలి. దానికి మీ సహకారం కావాలి అని అడిగారా? ఎంతసేపటికీ మీ స్వార్ధ ప్రయోజనాలకోసం పెట్టిన పథకాలనే ప్రవేశపెట్టాలనుకుంటున్న మీ ప్రయత్నాలని అడ్డుకోక ఏం చేయమంటారు?"

"సార్, ఒకళ్ళని ఒకళ్ళు విమర్శించుకోవడానికి ఇది మీ అసెంబ్లీ కాదండి. ఒక్క నిమిషం ఇప్పటిదాకా మనతోనే ఉన్న హరిణి తండ్రిగారిని అడుగుదాము. ఆయన ఏమంటారో?"

"గౌరవనీయులైన హోమ్‌మినిస్టర్ గారి వాదన, ప్రతిపక్షనాయకుడి వాదన విన్న తరవాత ఆడదాన్ని పూజించే ఈ పవిత్రమైన భారతదేశంలో ఆడదానిగా పుట్టడం అంత దౌర్భాగ్యం ఇంకొకటి లేదు అనిపిస్తోంది. ఒకప్పుడు కట్న కానుకల గురించి ఆడపిల్లని కనడానికి భయపడేవారు. ఇప్పుడున్న పరిస్థితుల వల్ల, దౌర్భాగ్యపు సమాజం వల్ల ఆడపిల్లలను పెంచడానికి భయపడుతున్నారు. దానాలెన్నో ఉన్నాయి వాటిని ఎవ్వరైనా చేయవచ్చు, కానీ కన్యాదానం మాత్రం ఒక్క ఆడపిల్లని కన్న తండ్రి మాత్రమే చేయగలడు. ఇంత గొప్ప వరాన్ని పొందిన మన సమాజమే నేడు దాన్ని మించిన శాపాన్ని ఇస్తోంది. నా కూతురికి పెళ్ళిచేసి ఆనందంగా అత్తవారింటి పంపిద్దాం అనుకున్నా కానీ ఇలా అర్థాంతరంగా కాటికి పంపిస్తా అనుకోలేదు. ఒక ఆడపిల్లని పెంచడానికి తీసుకునే జాగ్రత్తలు ఒక మగాణ్ణి పెంచడానికి తీసుకోరు. ఎంతసేపు వాడి చదువు సంగతి ఆలోచిస్తున్నారు తప్ప వాడి గుణం గురించి ఎవ్వరూ ఆలోచించడం లేదు. ఇప్పుడు టీవీ చూస్తున్న తల్లితండ్రుల్లో ఎంతమందికి తెలుసు ఇంటినుండి బయటకి వెళ్ళిన కొడుకు ఏం చేస్తున్నాడో? నా కూతురికి ఇలాంటి పరిస్థితిని కల్పించింది మీలో ఒకరి కొడుకే" అన్నాడు హరిణి తండ్రి కళ్ళనుండి ధారాపాతంగా కారిపోతున్న కన్నీళ్ళని కెమెరాకి కనబడనీయకుండా దాచుకుంటూ.

"ఇలాంటి వారిని ఏం చేద్దాం అంటారు? మీలాంటి పరిస్థితి ఏ కన్నతండ్రికీ రాకూడదూ అంటే ఏం చేయాలి? ఎలాంటి చట్టాలు తీసుకురావాలి అని అనుకుంటున్నారు?" అడిగాడు రవిశంకర్.

"చాలామంది అంటూ ఉంటారు ఇలాంటివాళ్ళని దుబాయి దేశంలో నడిరోడ్డు మీద నిల్చోపెట్టి మరీ కాల్చి చంపుతారు అని. కానీ నాకు మనదేశం మీద, మన రాజ్యాంగం మీద ఇంకా నమ్మకం ఉంది. నా కూతురిలాగా ఏ ఆడబిడ్డ అర్థాంతరంగా కాటికి చేరుకోకూడదు.. నాలా ఏ తండ్రీ జీవచ్ఛవంలా మిగిలిపోకూడదు.. కానీ నాయకులు ఇలా శాంతిని వీడి పదవులకోసం పోటీలు పడుతూ ఉంటే ప్రజలే తిరగబడి న్యాయానికి, చట్టాలకి అతీతంగా తీర్పులు రాసేస్తారు" అన్నాడు హరిణి తండ్రి.

ఆ కళ్ళల్లో నిస్సహాయత కంటే మరేదో భావాన్ని స్పష్టంగా చూశాడు రవిశంకర్.

"మీ విలువైన సమయాన్ని మా ప్రేక్షకులకోసం కేటాయించినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. ఇలాంటివి మళ్ళీ మళ్ళీ జరగకుండా ఉండాలని కోరుకుందాం" అంటూ ముగించాడు ఆ చర్చా కార్యక్రమాన్ని.

❖ ❖ ❖

సమయం అర్థరాత్రి పన్నెండు కావడానికి ఇంకా అయిదు నిమిషాల వ్యవధి వుంది.

ట్యాంక్‌బండ్ కాసేపు కునుకు తీయాలనుకుంటోంది, హుస్సేన్‌సాగర్ ఎప్పుడు ఎవరు తనలోకి దూకి చస్తారోనన్న భయంతో కదలడం మానేసి నిశ్చలంగా ఉండిపోయింది. ఎప్పటిలానే బుద్ధుడు అర్థరాత్రి నగర శోభను చూస్తున్నాడు.

పన్నెండున్నర...

జనసంచారం తగ్గింది. శీతాకాలం కావడం వల్ల చలి పెత్తనం ఎక్కువై, జనం రద్దీ కూడా తగ్గింది. ట్యాంక్‌బండ్‌కు కూతవేటు దూరంలో, సచివాలయం సాక్షిగా నలుగురు మందుబాబులు తమ కారు దగ్గర నిలుచుని మందు కొడుతూ కైపు నెత్తికి ఎక్కించుకుని తూలుతూ మాట్లాడుకుంటున్నారు.

సరిగ్గా అప్పుడే అక్కడికి పరుగెత్తుకుంటూ వచ్చిందో యువతి.



ఆమె వగరుస్తూ... ఆయాసంతో రొప్పుతూ... ఓ క్షణం అటు ఇటు చూసింది ఇరవై రెండేళ్ళ అందం.. షిఫాన్ చుడీదార్లో చూడముచ్చటగా వుంది. పరుగెత్తుకు రావడం వల్ల అందమైన ఆ మొహంమీద చెమట పట్టింది. ఆ చెమటలో సైతం ఆమె వింత అందంతో మెరిసిపోతోంది.

ఆ నలుగురి దృష్టి ఆమె మీద పడింది.

ఎప్పుడైతే అర్ధరాత్రి ఒంటరిగా, నిర్మానుష్యమైన ప్రదేశంలో అందమైన అమ్మాయి కనిపించిందో, అప్పుడే వాళ్లలో నీచమైన కోరిక బయల్దేరింది. అంతే ఆ నలుగురు ఆమె వైపు వచ్చారు. వస్తూనే నాలుగు వైపులా కార్నర్ చేయాలని ప్రయత్నిస్తుండటం తన కనుచూపుల చివరల నుంచే ఆమె గమనించింది. అంతే ఒక క్షణం ఊపిరి పీల్చి వదిలింది. మరుక్షణం వింటి నుంచి సంధించిన బాణంలా ట్యాంక్‌బండ్ వైపు పరుగుతీసింది. వాళ్ళు ఊహించని సంఘటన అది.

ఒక్కత్తే... పైగా ఆడది అన్న తేలిక అభిప్రాయం ఉన్న ఆ నలుగురూ ఆమె వెంటపడ్డారు. ఆమె పరిగెత్తిన వేగాన్ని పరుగుపందెంలో ప్రదర్శిస్తే పరుగుల రాణి కిరీటం సునాయాసంగా ఆమె స్వంతం అయ్యేది.

పది నిమిషాల వ్యవధిలో ఆమె ట్యాంక్‌బండ్‌ను చేరుకుంది. సరిగ్గా బుద్ధుడి

విగ్రహానికి అభిముఖంగా వున్న బెంచీ మీద కూర్చుంది ఆయాసంతో రొప్పుతూ. మరో అయిదు నిమిషాల తర్వాత ఆ నలుగురు మృగాళ్ళు అక్కడికి చేరుకొని ఆమెను రౌండ్ చేసారు.

అప్పుడు చూసింది తాపీగా వాళ్ళని... వాళ్ళ వైపు చూసి చున్నీతో చెమట తుడుచుకుంటూ కాలి మీద కాలు వేసుకుంటూ "హమ్మయ్య వచ్చేసారా" అని అడిగింది. వాళ్ళు బిత్తరపోయి చూస్తున్నారు, ఆమె తమని చూసి భయపడుతుందని అనుకున్నారు. అరిచి కేకలు పెడుతుందని, "నన్నేం చేయకండి" అంటూ కాళ్ళా వేళ్ళా పడుతుందని అనుకుంటున్నారు. అలాంటిది దర్జాగా కాలుమీద కాలేసుకుని తమతో మాట్లాడుతున్న ఆమెని చూస్తూ నోట మాట లేక నిల్చుండిపోయారు.

"ఏంట్రా! రేప్ చేసేద్దామనే... ఆడది కనిపిస్తే చాలు వెంటపడి పోతారేంట్రా? ఎదవల్లారా.. సర్లే! కష్టపడి వచ్చారుగా! రండి, మీ కోరికెందుకు కాదనాలి. అవునూ! మీలో ఎవరు ముందు వస్తారు?" అంటూ లేచి చున్నీ నడుముకు చుట్టుకుంటూ అంది ఆమె. క్షణంలో ఆమె చేతిలో పెప్పర్ స్ప్రే ప్రత్యక్షమైంది. సివంగిలా రెచ్చిపోయింది. వాళ్లని కొడుతూ, కాళ్లతో తంతూ, వేగంగా పెప్పర్ స్ప్రేతో వాళ్ళ కళ్ళలో స్ప్రే చేసింది.

అదే సమయంలో అక్కడికి కొద్ది దూరంలో ఈ తతంగమంతా రహస్యంగా షూట్ చేయబడుతున్నది.

సరిగ్గా రెండే రెండు నిమిషాల్లో ఆ నలుగురు తగిలిన దెబ్బలకు తాళలేక కేకలు పెడుతూ కళ్ళు నులుముకుంటూ నేల మీద దొర్లుతున్నారు.

ఆమె బుద్ధుడి వైపు తిరిగి "బుద్ధ భగవాన్! వీళ్ళకు ఇప్పటికైనా బుద్ధి వస్తుందా?" అంటూ ప్రశ్నించింది.

తర్వాత ఎదురుగా షూట్ చేస్తోన్న కుర్రాడి వైపు చూసి "శివా ఓకేనా?" అని అడిగింది.

❖ ❖ ❖

సరిగ్గా అదే సమయంలో...

పాతబస్తీలో ఓ మారుమూల ఇరుకు గల్లీలో, నిశ్శబ్దంగా కలకలం రాజుకుంటోంది.

పాతబస్తీ అనగానే గొడవలు, కర్ఫ్యూలు, మత కల్లోలాల భయం మన కళ్ళ ముందు కదులుతుంటుంది. కానీ పాతబస్తీ మతసామరస్యానికి కూడా ప్రతీక అని చెప్పుకోవచ్చు. అక్కడ హిందూ, ముస్లింలు భాయి భాయి అంటూ కలిసే వుంటారు. మనం భయపడే గొడవలు ఉన్మాదులు సృష్టించే వికృత కల్పనే.

పాతబస్తీలోని ఓ ఇరుకుగల్లీలో అమ్మాయిల బలవంతపు నిఖాకు మాఫియా బ్రోకర్లు వ్యూహం పన్నారు. పేద ముస్లింల నిస్సహాయతను కాష్ చేసుకునే ప్రయత్నం చేస్తూ చావుకు అడుగు దూరంలో వున్న ముసలి షేక్‌లకు ముక్కు పచ్చలారని అమ్మాయిలను నిఖా పేరుతో మోసం చేసే ఒక దళారీ వ్యవస్థ. ఆనాడు అక్కడ రహస్యంగా సమావేశం అవ్వాలన్న నిర్ణయం అమలు జరుగుతోంది. కొన్నాళ్ళ క్రితం పోలీసులు, మీడియా ఎలర్ట్ అవ్వడం, కొన్ని స్వచ్ఛంద సంస్థలు సైతం రంగంలోకి దిగడంతో సద్దుమణిగిన వాళ్ళ వ్యాపారాలు మళ్ళీ వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నంలో భాగమే ఆనాటి ఆ సమావేశం.

మూకుమ్మడిగా కొంతమంది పేద అమ్మాయిలను నిఖా పేరుతో నమ్మించి మనదేశం దాటించే దారుణమే ఆనాటి సమావేశానికి ముఖ్య కారణం. దానికి జర్దార్ నాయకత్వం వహిస్తున్నాడు. అందుకే పోలీసుల నుంచి, మీడియా నుంచి వారి నాయకులను కాపాడుకునే ప్రయత్నం చేస్తూ ఆ పరిసర ప్రాంతాల్లో జర్దార్ గూండాలు కాపలాగా వున్నారు.

❖ ❖ ❖

ట్యాంక్‌బండ్ మీద ఆ నలుగురు పోకిరీలు ఘోరమైన స్థితిలో వున్నారు. అవతలి వ్యక్తిని చాలా తక్కువగా అంచనా వేసారు. పాపం ఆమెకి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం వుందని వాళ్లకి తెలియలేదు, తెలుసుకునేసరికే ఆ నలుగురిని ఒక కుప్పలా పడేసింది. ఈలోగా అప్పటి వరకూ వీళ్ళను రహస్యంగా ఫాలో అయి కెమెరాతో షూట్ చేస్తోన్న శివ అనే పాతికేళ్ళ కుర్రాడు చప్పట్లు కొడుతూ వచ్చాడు.

“మేడం ఎక్సలెంట్! సినిమాలలో పెద్ద పెద్ద హీరోలు కూడా సింగిల్ టేక్‌లో ఓకే చేయలేరు. మీరు కనీసం స్టంట్ మాస్టర్ కూడా లేకుండా చితక్కొట్టేసారు.” మనస్ఫూర్తిగా అన్నాడు.

కానీ ఆమెకి ఇవన్నీ వినిపించటం లేదు. ఇంకా ఏదో లోటు కనిపిస్తోంది. ఎందుకంటే?

ఆమె ఆలోచన వేరే వుంది. ఒక్క నిమిషంలో తేరుకొని "శివ, మైక్ ఇలా ఇవ్వు"అంది.

శివ మైక్ ఇచ్చాడు.

"కెమెరా స్టార్ట్ చేయ్" చెప్పింది.

"ట్యాంక్‌బండ్ బుద్ధుడి సాక్షిగా మీరిప్పుడు చూస్తోంది అక్షరాలా నిజం, ఇందులో గ్రాఫిక్ షాట్స్ లేవు. ఆడది అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగి వస్తే స్వాతంత్రం వచ్చినట్టే అన్న బాపు మాటలు విని, నమ్మి అవి నిజం కానందుకు సిగ్గుతో ట్యాంక్‌బండ్ పైనుండి దూకి చచ్చిపోదామా? లేక ఇంకా ఎందరో నిర్భయలు బలి అవుతోంటే పట్టనట్లు చట్టం తన పని తానే చేసుకుపోతుంది అనే నాయకులకు వంత పాడుతూ ఉందామా?"

"మన అందరికీ తెలుసు జరుగుతున్నది ఏమిటో? పాపం పోలీసులు కేసులు పెడుతూనే వున్నారు, కోర్టులు శిక్షలు వేస్తూనే వున్నాయి, అయినా చర్విత చరణమే ఈ చరిత్రలు."

"నేను ఈ మృగాళ్ళను బుద్ధుడి పాదాల దగ్గర పడేసి వెళ్తున్నాను. వీళ్ళను పోలీసులకు పట్టిస్తారో? లేక మీరే శిక్ష విధిస్తారో మీ ఇష్టం. యూట్యూబ్‌లో ఈ సజీవ దృశ్యాలు చూస్తూ వినోదిస్తారో? నేను చెప్పిన విషయాలపై ఆలోచిస్తారో? మీ ఇష్టం."

కెమెరా ఆఫ్ అయింది.

అదే సమయంలో ఆ మేటర్ అన్ని పత్రికలకు వెళ్ళిపోయింది.

"అర్ధరాత్రి ఓ మహిళ సాహసం – యూట్యూబ్‌లో ప్రసారం" పేరుతో పతాక శీర్షికలు అచ్చవుతున్నాయి.

రాత్రికి రాత్రే ఆ వీడియో యూట్యూబ్‌లో అప్‌లోడ్ అయిపోయింది.

ఓ సంచలనానికి తెరతీస్తూ వెలుగురేకులు విచ్చుకుంటూ.

❖ ❖ ❖

ఎప్పటిలా కాకుండా ఆ రోజు ఓ సంచలనంతో తెల్లవారింది. అన్ని దినపత్రికల్లోనూ పతాక శీర్షికగా 'అర్ధరాత్రి ఓ మహిళ సాహసం, యూట్యూబ్‌లో ప్రసారం' అన్న వార్త ఒక విధంగా మాస్ డ్రిల్లింగ్‌లా, ఒక స్టింగ్ ఆపరేషన్‌లా

కనిపించింది కాబోలు పొద్దున్నే నెట్ జీవులు మాత్రమే కాదు మిగతావాళ్ళు కూడా ఆ రోజు నెట్ ఓపెన్ చేసారు.. ఆ సంచలన వార్తని కళ్ళారా చూడాలన్న ఆశతోనో, అసలది నిజమో కాదో అన్న సందేహంతోనో! అర్ధరాత్రి తాగుబోతుల ఛేజింగ్, అమ్మాయి సాహసం అన్నీ థ్రిల్లింగ్‌గా అనిపించింది కాబోలు మొదటి పది నిమిషాలలోపే వెయ్యి మంది చూసారు. తర్వాత వీక్షకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. నిమిషాలమీద ఫేస్‌బుక్‌లో సైతం ప్రత్యక్షమైంది యూట్యూబ్ లింక్ 'డోంట్ మిస్ ఇట్' అంటూ.

రెండు రోజుల తర్వాత మరో సంచలనం – యూట్యూబ్‌లో మరో వీడియో అప్‌లోడ్ అయింది. కాని ఈసారి పర్యవసానం మరీ ఘోరంగా ఉంది.

రాత్రినుండి ఉదయం వరకు ఆ వీడియోని చూసినవారు, నెట్ ప్రపంచానికి దూరంగా ఉండే సామాన్య జనం ట్యాంక్‌బండ్ దగ్గరికి పరుగులు తీసారు. అదంతా ఏదో సినిమాలో సంఘటనలా వుంది.

అప్పటికే పోలీసు బాస్ (హోమ్‌మినిస్టర్) నుంచి ఆర్డర్ వచ్చింది కాబోలు పోలీసు యంత్రాంగం యావత్తూ కదిలి వచ్చింది బుద్ధ విగ్రహం దగ్గరికి. అంతకన్నా ముందే మహిళాసంఘాలు సైతం కదిలి వచ్చాయి. విషయం సియం పేషీకి కూడా చేరుకుంది. అప్పటికింకా నిర్భయ ఉదంతం రేపిన కలకలం సమసి పోలేదు. ఇంతలో ఇలా ఒకమ్మాయి చేసిన సాహసం బయటకి రావడంతో జనాల్లో కలిగిన ఆనందం కన్నా, ఆ అమ్మాయి తెచ్చిన తలనొప్పి ప్రభుత్వానికి, పోలీసు శాఖకు ఒక సవాలులా మారింది అనటం మాత్రం అతిశయోక్తి కాదు. ఎందుకంటే జనం ప్రభంజనమై తిరగబడితే ఎంతటి మృగోన్మాదులైనా ఫినిష్ కావాల్సిందే. అప్పుడు శాంతి భద్రతల సమస్య మొదలు కావాల్సిందే మరి.

జనం బోట్ల మీద బుద్ధుడి దగ్గరికి చేరుకుంటున్నారు. కొందరు సాహసం చేస్తూ, ఈదుకుంటూ వెళ్తున్నారు. కొన్ని బోట్లలో టీవీ మీడియా బయల్దేరింది. వాళ్ళ రేటింగ్‌కు ఇంతకన్నా మంచి అవకాశం లేదు. ఇసుక వేస్తే రాలనంత జనం.. బుద్ధ భగవానుడి ముందు చావుబ్రతుకుల్లో ఆ మగోన్మాదులు. అర్ధరాత్రి వేళ ఎంత సాహసం చేయకపోతే ఇంత సంచలం మొదలవుతుంది.

పోలీసులకన్నా ముందే జనం, మహిళా సంఘాలు చేరుకున్నాయి కాబోలు. కట్టలు తెంచుకున్న వారి ఆవేశం క్షణాల్లో ఆ నలుగురినీ హతమార్చేసింది.

నిజం చెప్పాలంటే రాత్రి వాళ్ళు బుద్ధుడి సాక్షిగా టార్చర్ చేయబడ్డారు. ఎందుకంటే నగర శివార్లలో ఓ కాల్ సెంటర్ అమ్మాయిని క్యాబ్‌లో ఎక్కించుకుని ఘోరంగా రేప్ చేసి, కాల్చివేసిన సంఘటనలో ఆ నలుగురు దుండగులు మరో సాఫ్ట్‌వేర్ అమ్మాయిని కిడ్నాప్‌కు ప్రయత్నించారు. ఆ నలుగురి మీద ఎఫ్ఐఆర్ కూడా ఫైల్ అయివుంది.

అసలు రాత్రి ఏం జరిగిందో తెలుసుకోవాలంటే నలభై ఎనిమిది గంటలు వెనక్కి వెళ్ళాల్సిందే!

టూరిజం బోర్డ్‌వాళ్ళు ఏర్పాటు చేసిన బోటు బుద్ధుడి వైపు వెళ్తోంది, అందులో నలుగురు అబ్బాయిల ఎదురుగా కూర్చున్న అమ్మాయి అందంగా కనబడటంతో తినేసేలాగా చూస్తూ వెకిలి నవ్వులు నవ్వుతున్నారు. ఇవేవీ గమనించనట్లే కనిపిస్తూ వారినే నిశితంగా చూస్తోంది ఆ అమ్మాయి. బోటు బుద్ధుడి విగ్రహానికి సమీపంగా వచ్చింది, అందరూ దిగుతున్నారు. చిరుచీకట్లు అలుముకుంటుండగా మిరుమిట్లు కొలుపుతూ మెర్క్యూరీ లైట్ల వెలుగులు ఆ ప్రాంతాన్ని వెన్నెల రాత్రిని మరిపిస్తున్నాయి. వర్కింగ్ డే అవటం వలన బోటులో వచ్చినవారి సంఖ్య చాలా తక్కువ అనే చెప్పవచ్చు. అందరూ బుద్ధుడి అందాలు, అక్కడనుండి కనిపిస్తున్న సిటీ అందాలు చూడటంలో నిమగ్నమై ఉన్నారు. కానీ ఆ నలుగురు అబ్బాయిలు ఆ అమ్మాయి తమని చూడటం లేదనుకుంటూనే ఆమె వెనకెనకే నడుస్తున్నారు. ఆ అమ్మాయి కూడా ఏమీ పట్టనట్లే ఒక్కత్తే ఒక మూలకి వెళ్ళి కూర్చుంది. ఆమెకి కొంత దూరంలో ఎప్పటిలాగే శివ తన కెమెరాతో కూర్చొని ఆ అమ్మాయి వైపు చూస్తున్నాడు. అతని చూపుల్లో అడ్మైరింగ్ వుంది.

ఒకసారి తను ఓ ట్రాఫిక్ పోలీసు నిబంధనలకు విరుద్ధంగా వన్ వేలో వస్తుండగా తన కెమెరాలో ఆ దృశ్యాన్ని బంధించాడు. అది చూసి ఆ పోలీసు, ఇతర పోలీసులను వెంటేసుకు వచ్చి తన మీద దాడి చేస్తోంటే వచ్చి కాపాడింది. అప్పుడు చూశాడు అతను ఆమె విశ్వరూపాన్ని అంతే అప్పటి నుంచి తను ఆమె వెంటే వున్నాడు.

ఎవరు? ఏమిటి? ఎందుకు? లాంటి ప్రశ్నలు ఎప్పుడూ అడగలేదు, ఆమె చెప్పింది చేస్తాడు. రాములోరికి హనుమంతుడిలా.

ఆమె పేరు శోధన అని మాత్రమే తెలుసు అతనికి. అంతకు మించిన వివరాల మీద అతనికి ఆసక్తి లేదు కూడా.

చివరి బోటు ఇదే అని హెచ్చరికలు వినిపిస్తున్నా విననట్లుండిపోయింది ఆమె, ఆమె ఉందని ఆ నలుగురు.

బోటు బుద్ధుడికి దూరంగా వెళ్ళిపోయింది. నెమ్మదిగా ఆ నలుగురూ ఆ అమ్మాయి దగ్గరికి చేరుకున్నారు. శోధన ఆ నలుగురి వైపు చూసింది. ఏదో కీడు శంకించినట్లు వాళ్ళ కాళ్ళలో సన్నగా వణుకు మొదలైంది. ఆమె చూపులో కాఠిన్యం ఆమె ఎవరో అర్థం అయినట్లు చేసింది. కదులుతున్న వాళ్ళ కాళ్ళు ఎవరో బంధించినట్లుగా ఆగిపోయాయి. వణుకుతున్న చేతులెత్తి దండం పెడుతూ "మమ్మల్ని చంపొద్దు, ఏదో బుద్ధి పొరపాటు అయింది, మీరు అనుకోలేదు, ఇలా మరోసారి మీ జోలికి రాము అంటూ" ఆ నలుగురూ ప్రాధేయపడ్డారు.

"అంటే వేరే అమ్మాయి అయితే వెంటపడతారా? అమ్మాయిలేమైనా మీ సొంత ప్రాపర్టీ అనుకున్నారా? మరి మీ ఇంట్లో ఆడవాళ్లు ఎవరి ప్రాపర్టీ రా?" సూటిగా అడిగింది.

వాళ్ళ దగ్గర ఆన్సర్ లేదు.

"ఓకే! ఈ తప్పు క్షమించేస్తున్నాను" అంది కూల్‌గా.

'హమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకున్నారు.

"మరి మరో తప్పుకు శిక్ష ఉండాలిగా" అంది.

భయంగా చూసారు.

"ఏంటీ గుర్తు చేయాలా? గుర్తుందా?" గట్టిగా అరిచింది.

ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. చేసిన నేరం గుర్తుంది. తప్పించుకున్నామన్న పొగరు వల్లే ఒంటరిగా కనిపించిన శోధన వెంటబడి ఇంతదాకా వచ్చారు.

"నలభై ఎనిమిది గంటల క్రితం కాల్ సెంటర్ నుంచి వస్తోన్న అమ్మాయిని, దారి మళ్ళించి నిర్దాక్షిణ్యంగా చంపారు. అవునా? అదీ అతి క్రూరంగా అత్యాచారం చేసి. క్షణకాల శారీరక ఆనందం కోసం, ఊరు, పేరు తెలియకపోయినా ఒంటరిగా కనిపించగానే ఆ అమ్మాయిని పైశాచికంగా అనుభవించారు. "ఒరేయ్

ఆ పెయిన్ ఎలా వుంటుందో తెలుసా మీకు? మీరెప్పుడైనా అనుభవించార్రా?" అంటూనే శోధన తన చేతిలో వున్న కంపాస్ బాక్స్‌లోని వృత్తలేఖిని తీసి ఆ నలుగురిలోని ఒకరి అరచేతిలో బలంగా గుచ్చింది.

విలవిలలాడుతూ పెద్దగా కేక పెట్టాడు. వాడి అరచేతినుండి రక్తం ఫౌంటెన్‌లా చిమ్మింది. ఆమెకు అతని కేక వినపడలేదు. నిర్భయ బస్సులో పడ్డ వేదన, అనుభవించిన పెయిన్, ఆమె సున్నితమైన ఎడిట్ అవయవం రక్తస్రావమై... నరకాన్ని అనుభవిస్తూ కూడా బ్రతుకు మీద ఆశతో చివరి క్షణం వరకూ పోరాడిన నిస్సహాయ అతివ గుర్తొచ్చింది. ఆనందంగా ఉద్యోగం చేసుకొని ఇంటికి వెళ్ళుతున్న 22 ఏళ్ళ ఉద్యోగినిని దారిమళ్ళించి, వదిలేయమని కాళ్ళ వేళ్ళా పడి ప్రార్థిస్తున్నా, కనికరించకుండా ఆమె మాన ప్రాణాలను హరించిన ఈ నలుగురూ నరరూప రాక్షసులుగా కనబడుతున్నారు.

"ఎవరిచ్చారీ అధికారం రేపిస్టులకు? అవతలి వ్యక్తి ప్రమేయం లేకుండా సుకుమారమైన అమ్మాయిని పాశవికంగా అనుభవించే హక్కు ఎవరిచ్చారు? కోర్టులు, ఎఫ్ఐఆర్‌లు, వాదోపవాదాలు... తన శరీరంలోని ఒక అవయవంపై జరిగిన దాడిని నిరూపించుకోమంటూ...

తన ప్రమేయం లేకుండా జరిగిన ఈ దారుణాన్ని సిగ్గు విడిచి న్యాయస్థానం ముందు నిరూపించుకోవాలా? మానవత్వపు వలువలూడదీస్తున్న ఈ కిరాతకులను ఏం చేయాలి? వీరు చేస్తున్న తప్పుకు ఏ శిక్ష విధించాలి, ఆ శిక్ష అనేది ఏ విధంగా ఉండాలి?

ఎస్! వీళ్ళు చేసిన ఈ తప్పుకు శిక్ష భయంకరంగా వుండాలి.. అ..తి.. భ..యం..క..రం..గా ఉండాలి ప్రతి వాడిలో ప్రాణభయం పుట్టించాలి.

అంతే వాడి పొట్టలో దిగబడింది అదే వృత్తలేఖిని.

పది నిమిషాల్లో అక్కడ వాళ్ళకి నరకాన్ని క్రియేట్ చేసింది.

వీళ్ళకు ఏ కోర్టుల్లో శిక్ష పడదు, పడ్డా అది వీళ్ళలో మార్పుని తీసుకు రాదు, ఏం చేస్తారో కానీ రెండు రోజులు తిరగకుండా బెయిల్ మీద బయటకు వస్తారు. షిట్.

"ఓ వ్యవస్థా! నువ్వు మారగలవా ఏనాటికైనా?"

"బుద్ధుడా! నువ్వైనా చెప్పగలవా ఏ ఒక్కరికైనా మారమని?"

పోలీసులకు అప్పగిస్తే వీళ్ళని చట్టం ప్రకారం వెళ్ళాలి. మరి ప్రజలకు అప్పగిస్తే ధర్మం ప్రకారం శిక్ష పడుతుంది. అందుకే వాళ్ళను పాక్షికంగా చంపేసింది.

మిగితాది ప్రజలకు అప్పగించింది. అంతే ఆమె అనుకున్నట్లే ప్రజాగ్రహం ముందు పోలీసు ఫోర్స్ పనిచేయలేదు. పోలీసులు వచ్చేలోగా ఆ నలుగురు శవాలుగా మారారు.

ఒక్కడు చంపితే హత్య, ప్రజలంతా కలిసి చంపితే అది రాక్షస సంహారం.

ఆ ప్రజల్లో ఒక మాస్టారు వున్నాడు. కనీసం తన దగ్గర చదివే పిల్లలను ముప్ఫయ్యేళ్ళ సర్వీసులో బెత్తంతో కూడా దండించని ఆ మాష్టారు.. ఆ నలుగురిని కూరలు కోసే కత్తితో పొడిచి.. పొడిచి.. పొడిచి చంపాడు.

'అహింసా పరమో ధర్మః' అని నమ్మి, అక్షరాలు దిద్దించిన ఆ అహింసావాది కన్నీటి రక్తం అది.

ఎందుకంటే, ఆ మాస్టారి ఒక్కగానొక్క బిడ్డ ఆ నలుగురి కామవాంఛకు బలైంది. కాల్ సెంటర్ నుంచి "నాన్నా! నీ పుట్టిన రోజు కదా! కేకు తీసుకు వస్తున్నా. నిద్రపోవద్దు" అంటోంటే, "ఎందుకు తల్లీ ఇవన్నీ" అన్నా "ఇవ్వాళ నా మొదటి జీతం తీసుకువస్తున్నా నాన్నా! నీ చేతుల్లో పెడతాను.." అన్న చిట్టితల్లి మాటలు ఇంకా చెవుల్లో వినిపిస్తూ ఉండగానే... అంతా ముగిసిపోయింది. దుర్మార్గుల కామాగ్ని జ్వాలల్లో దహించుకుపోయింది.

'తల్లీ శోధనా! నా ఆయుష్షు కూడా పోసుకుని నిండు నూరేళ్ళు బ్రతుకు తల్లీ!'

ఆ వృద్ధ మాస్టారి కన్నీటి ఆశీస్సులు అసంకల్పితంగానే బయటకి వచ్చేశాయి.

చట్టాలు, న్యాయస్థానాలు గుర్తులేవు. తప్పు ఒప్పులు కనబడలేదు. శాంతించిన తన బిడ్డ ఆత్మ మాత్రమే కనిపించిందా వెర్రి తండ్రికి.

అతని పేరు ముకుందరావు మాస్టారు.. హరిణి తండ్రి..

❖ ❖ ❖

ప్రజల చేతిలో హతమైన ఆ నలుగురి గురించి జాతీయ వార్తల్లో కూడా చెప్పారు. రేపిస్టులకు, అమ్మాయిల వెంటపడే వారికీ ఇదే సరైన శిక్ష అన్నారు.

మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేసాయి. అయితే పోలీసులకు ఈ విషయం మింగుడు పడ్డం లేదు. ఎవరీ అమ్మాయి? ఇంత ధైర్యంగా అనుకున్న పని పూర్తి చేసింది. సినిమాలో సంఘటనలా అనిపిస్తోంది అందరికీ.

కమిషనర్ ఆఘమేఘాల మీద కదిలాడు. నిమిష నిమిషానికి మ్రోగుతున్న సెల్‌ఫోన్‌కి సమాధానం చెప్పలేక సతమతమౌతూనే, సిటీలో పోలీసు యంత్రాంగాన్ని మొత్తం దించాడు ట్యాంక్‌బండ్ మీదకి.

మరో వైపు యూట్యూబ్‌లో శోధన పెట్టిన వీడియోను చూసేవారి సంఖ్య పెరిగిపోతూనే వుంది.

భయపడుతున్న ఫోన్ రానే వచ్చింది.

"ఏంటి కమిషనర్ ఏం జరిగింది?" హోమ్‌మినిస్టర్ గొంతు వినిపించింది.

"కొత్త తలనొప్పి సార్!"

"అంటే?"

"సిటీలో మొన్న జరిగిన హరిణి మానభంగం, హత్య కేస్. మనకన్నా ముందే ఆ నేరస్తులు ఎవరో మహిళకి దొరికిపోయారట. ఆమె వాళ్ళని దారుణంగా కొట్టి రోడ్డుమీద పడేసిపోతూ అదంతా వీడియో తీసి యూట్యూబ్‌లో కూడా పెట్టింది సార్! అసలే కోపం మీద ఉన్న జనాలు రెచ్చిపోయారు. అందులో ఎవడో కానీ మరీ దారుణంగా రాడ్‌తో పొడిచినట్లున్నాడు సార్! అందరూ చచ్చిపోయారు" అన్నాడు.

"ఐతే మరిప్పుడేం చేద్దాం అనుకుంటున్నావు?" అడిగాడు హోమ్ మినిష్టర్.

"ఏం వుంది సార్! ఇప్పటి వరకు నేరస్తులకోసం వెతికే ప్రయత్నం చేశాము, ఇప్పుడు వాళ్ళని చంపిన వాళ్ళకోసం వెతుకుతాం" అన్నాడు.

"తలనొప్పి అని తెలిసినప్పుడు అమృతాంజనం కొనుక్కోవాలి కానీ కొత్త తలనొప్పి తెచ్చుకోకూడదయ్యా! నా మాట విని డెడ్ బాడీస్‌ని పోష్టుమార్టంకి పంపి అటునుండి అటే వాళ్ళ ఇళ్ళకి పంపించేసేయి. ఆ... అన్నట్లు మర్చిపోయా.. ఆ మీడియా వాళ్ళకి మాత్రం నేరస్తులని అతి త్వరలో పట్టుకుంటామని చెప్పి చేతులు దులిపేసుకో" అంటూనే

"అవునూ ఆ పిల్ల తండ్రి అక్కడేమైనా ఉన్నాడా?" అన్నాడాయన.

"ఉన్నాడు సార్! అయినా ఎందుకు అలా అడుగుతున్నారు సార్!"

"డౌట్ లేకుండా అతనే పొడిచి ఉంటాడు ఆ రాడ్‌తో. అయినా అతను పొడవటం, వాళ్ళు చావడం రెండూ తప్పేం కాదు లేవయ్యా!" అంటూనే కాల్ కట్ చేశాడు హోమ్‌మినిస్టర్‌అవతల మ్రోగుతున్న సిఎం ఫోన్ ఎత్తుతూ.

"సార్ సార్, నేను అదే పనిలో ఉన్నా ఇప్పుడే కమిషనర్‌తో మాట్లాడా.. వీలైనంత తొందరగా ఈ గొడవని క్లోజ్ చేసేయమన్నా."

"ఇదిగో హోమ్! ఇప్పుడు జనం నేరం చేసిన వాళ్ళనే కొట్టారు, ఇంకా మనం ఇలానే ఉంటే మనల్ని కూడా కొట్టడానికి వెనుకాడరు అది మర్చిపోకు" అన్నారు సిఎం.

"నిజమే సార్, మనం వచ్చే అసెంబ్లీ సమావేశాలలో మహిళా భద్రతకోసం కొత్త చట్టం తీసుకురావాలి, ప్రజలకి మనమీద పోతున్న నమ్మకాన్ని తిరిగి సంపాదించుకోవాలి. అప్పుడే మన అధికారం మనకి పదిలంగా ఉంటుంది సార్!" అన్నాడు హోమ్‌మినిస్టర్ ధనంజయరావ్.

❖ ❖ ❖

పాతబస్తీ...

యాభై నాలుగేళ్ల జర్దార్ ఓ చిన్న ఇంట్లో ఇనుప మంచం మీద కూచున్నాడు. అతనికి ఎదురుగా ఓ చిన్న టేబుల్ మీద పోర్టబుల్ టీవీ వుంది, అందులో వస్తున్న వార్తలను చూస్తున్నాడు.

నలుగురు యువకులను జనం చంపేస్తోన్న దృశ్యం కూడా ప్రసారం అవుతోంది... యూట్యూబ్‌లో చిత్రీకరించిన వీడియో మధ్య మధ్యలో వేస్తున్నారు.

ఏ నేరం చేసినా సాక్ష్యాలు వుండకూడదనుకునే జర్దార్ ఇప్పటి వరకూ పలు కిడ్నాప్ కేసుల్లో నిందితుడు. సరైనా సాక్ష్యాలు లేక కొన్ని, బెయిల్ మీద బయటకు వచ్చిన కేసులు మరికొన్ని. అండర్ గ్రౌండ్ నుండి బయటకి వచ్చిన జర్దార్ అందరి కంటికీ కనిపిస్తూనే వుంటాడు. అయినా మన వ్యవస్థలోని లోపాల వల్ల అతను చట్టానికి మాత్రం దొరకడు. అందుకే నిర్భయంగా నేరాలు చేసుకుంటూ పోతూనే ఉన్నాడు.

తన జీవితంలో ఎదురైన ఏ విషయాన్నీ అంత తొందరగా వదిలిపెట్టే మనస్తత్వం లేని జర్దార్ ఎదురుగా టీవీలో కనిపిస్తున్న న్యూస్ చూస్తూ శోధన గురించే ఆలోచిస్తున్నాడు.

ఎవరీ శోధన...? ఒక జర్నలిస్ట్‌లా స్ట్రింగ్ ఆపరేషన్ చేయడమేమిటి? తనేమన్నా జర్నలిస్టా? నిజానికి ఈనాటి నెట్ విజ్ఞానం తనలాంటి వాళ్లకు ఒక ఆయుధంగా పనికివస్తోంది, ఎలా అంటే తన అనుచరులకి ఇతర దేశాలలో ఉన్న తనలాంటి డాన్‌లకు రహస్య సందేశాలు పంపటం, చేయాల్సిన కార్యక్రమాలను సైతం రెండో కంటికి తెలియనీయకుండా ఈ సోషల్ నెట్ వర్క్‌లో చాప కింద నీరులా జరిపేసుకోవడం, రహస్య వెబ్ సైట్స్ హ్యాక్ చేయడం... ఇలాంటివెన్నో సునాయాసంగా చేసేసుకుంటూ మాఫియా రాజ్యాధినేతలుగా ఎదిగిపోతున్నారు. అలాంటిది ఈనాడు ఒక సామాన్య ఆడపిల్ల శోధనలాంటి వ్యక్తి తనలాంటి వాళ్ళను ఇదే నెట్ ద్వారా ఎండగడుతోంది. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం అతడు ఇంతగా కంగారు పడడానికి కారణమైన విషయం ఆమె చంపిన ఆ నలుగురు జర్దార్ ఇన్ఫార్మర్స్. అందుకే ఈ పరిస్థితులు అతనికి మింగుడుపడటం లేదు. పైగా వాళ్ళని తను చంపకుండా తమకంటే తెలివిగా ప్రజలే చంపేలాగా చేసింది. అది అతనికి మింగుడుపడని విషయం అయింది, పంటికింద రాయిలా గుచ్చుకుంటోంది.

❖ ❖ ❖

కాఫీ హౌస్...

నగరంలో మంచి పేరున్న హోటల్. ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి వరకూ వేడి వేడి ఇడ్లీ దొరికే ఒకే ఒక 'ది బెస్ట్ హోటల్'గా పేరుంది. ఇడ్లీ ప్రియులు రోజుకు ఒక్కసారైనా ఆ హోటల్‌కు వస్తుంటారు.

సమయం సాయంత్రం ఆరు గంటలు...

ఎప్పటిలానే మన్మథరావ్ ఆ హోటల్‌కు వచ్చాడు. విచిత్రమైన వ్యక్తి అతను, మంచి జాబ్, అంతకన్నా మంచి వైఫ్, అయినా అతనికి సంతృప్తి లేదు. అతడి దృష్టిలో లైఫ్ అంటే అమ్మాయిలతో సరదాగా గడపడం, రోజుకో కొత్త అందం కోసం వేటాడటం. అతను అమ్మాయిలను ట్రాప్ చేసే విధానం కూడా విచిత్రంగా వుంటుంది. తన దగ్గర వున్న అన్ని తెలివితేటలను (అందులో అతి ఎక్కువ)

ఉపయోగిస్తాడు. అమ్మాయిలను ట్రాప్ చేయడం గొప్ప ఆర్ట్ అంటాడు. హెూటల్‌లో మెనూ మారినట్టు అతని డైరీలో అమ్మాయిలు క్యాలండర్‌లో డేట్‌లా మారిపోతూ వుంటారు.

ఈ రోజు అతను ట్రాప్ చేసిన అమ్మాయి పేరు గీతిక, కొత్తగా డ్యూటీలో జాయిన్ అయింది, మన్మథరావ్ ఆమెకు బాస్.

ఇద్దరూ ఎదురెదురుగా కూచున్నారు.

మన్మథరావ్ మూడవసారి తన క్రాఫ్ సరిచేసుకుంటూ గీతిక వైపు చూసి "నూట డెబ్భై" అన్నాడు.

గీతిక అర్థంకాక "ఏమిటి సార్?" అని అడిగింది.

"నిన్ను నేను చూసిన చూపులు... ఎన్నిసార్లు చూసినా చూడాలనిపించే అందం నీది. నీకో విషయం తెలుసా? నిద్రమాత్రలు వేసుకోకపోయినా నిద్ర పట్టేలా చేసే బ్యూటీ స్లీపింగ్ పిల్‌వి" ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకుని అన్నాడు మన్మథరావ్.

గీతిక మొహం ఎర్రబడింది. ఒక కాంప్లిమెంట్, అదీ తన బాస్ ఇచ్చే కాంప్లిమెంట్.

"నీ పేరు గీత అయితే బావుండేది, ఎందుకంటే నువ్వు నా గుండె మీద గీసిన గీతవి" చాలా చీప్ ట్రిక్ ప్లే చేసాడు.

"సార్, మీరు మరీను. మేడం కన్నా నేను బావుంటానా?" అతని భార్యను ఉద్దేశించి అంది.

మన్మథరావ్ దీర్ఘంగా నిట్టూర్చి "ఆమె నలుపు... నువ్వు తెలుపు, ఆమె పొట్టి... నువ్వు మంచి హైట్, ఆమె ఎపుడూ సీరియస్‌గా వుంటుంది... నువ్వు నవ్వుతూ వుంటావు.. ఆమె దగ్గర నాకు బాధ దొరుకుతుంది... నీ దగ్గర సంతోషం మిగులుతుంది. ఇంతకన్నా ఏం చెప్పను? నన్ను అనుక్షణం అనుమానిస్తుంది అని చెప్పనా? ఆఫీసులో అలిసిపోయి ఇంటికి వెళ్లేసరికి ఆమె ఏ క్లబ్‌కో వెళ్తుందని చెప్పనా?" బాధ నటిస్తూ అన్నాడు.

"అయ్యో మీకెన్ని కష్టాలు సార్... సారీ, మిమ్మల్ని బాధ పెట్టాను." ఆమెకి ఇంకా మగాళ్ళ సైకాలజీ ముఖ్యంగా మన్మథరావ్ లాంటి వాళ్ళ సైకాలజీ

తెలియదు. అప్పుడే కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ప్రేమకు, స్నేహానికి తేడా తెలియదు, తెలియని దశలో వుంది.

"గీతికా! నా మనసులో బాధ నీతో పంచుకుంటే నాకు రిలీఫ్‌గా వుంది." చుట్టూ చూసి గీతిక వైపు చూసాడు. ఆమెకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఈ అనుభవం ఆమెకు అలవాటు లేదు.

అతను మరి కాస్త అడ్వాన్సు అయ్యే ప్రయత్నం చేస్తున్నాడు.

అప్పుడే "ఎక్స్‌క్యూజ్ మీ" అన్న గొంతు వినిపించింది.

తల తిప్పి చూసాడు చికాగ్గా మన్మథరావు. మంచి మూడ్‌లో, గీతికను లైన్‌లో పెట్టే ప్రాసెస్‌లో వున్న అతనికి ఆ గొంతు పెద్ద అడ్డంకిగా అనిపించింది.

ఎదురుగా ఓ అందమైన అమ్మాయి, అతని చికాకు అమృతాంజనం రాసినట్టు ఎగిరిపోయింది. వెంటనే మొహమంతా కిలోల కొద్దీ చిరునవ్వు పులుముకుని "యస్ మేడం!" అన్నాడు.

"టేబుల్ మీద నా మొబైల్ మర్చిపోయాను" అంటూ టేబుల్ మీద వున్న మొబైల్ తీసుకుంది.

ఆ మొబైల్ అప్పటి వరకూ ఆన్‌లోనే వుంది. అది ఓ నెంబర్‌కు డయల్ చేయబడి వుంది.

మన్మథరావ్ మాటలు అవతలి నంబర్‌కు స్పష్టంగా వినిపించాయి.

అవతలి నంబర్ మిసెస్ మన్మథరావ్‌ది.

❖ ❖ ❖

శోధన ఒక సుడిగాలిలా వచ్చింది, సముద్రంలేని చోట సునామీలా చుట్టేసింది.

వస్తూనే సిఐ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. పక్కనే లాకప్, నిందితులను ఉంచాల్సిన ఆ లాకప్‌లో ఓ అమాయకపు యువతిని ఉంచాడు సిఐ.

ఇరవై రెండేళ్ళ ఆ యువతి లాకప్ ఊచలను పట్టుకుని భయం భయంగా చూస్తోంది.



అప్పుడే స్టేషన్‌లోకి వచ్చిన శామ్యూల్ శోధనను చూసి ఒక్కక్షణం ప్రభువుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

ఇంకా మందు మూడ్‌లోనే వున్నాడు సిఐ దుర్జనరావ్. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి.

"ఏయ్! ఎవర్నువ్వు?" మాటలు తడబడుతున్నాయి, కానీ ఆ మాటల్లో అధికార గర్వం తొంగిచూస్తోంది.

"సార్, సార్, నన్ను కొందరు తరుముతున్నారు... నాకు షెల్టర్ కావాలి."

"ఈ రాత్రి మీ పోలీస్ స్టేషన్‌లో తలదాచుకుని రేప్పొద్దున్నే వెళ్ళిపోతాను" బుద్ధిగా చెప్పింది శోధన.

"ఏయ్... అసలు నువ్వేమనుకుంటున్నావ్?" ఇదేమైనా నీ అత్తారిల్లా? వెళ్ళు... వెళ్ళూ" అంటూ చేతిని బయట వైపుకు చూపించాడు.

"అదేంటి సార్, ఒక అందమైన ఆడపిల్ల మీ రక్షణ కోరి వస్తే.." అమాయకంగా అడిగింది శోధన.

సిఐ దుర్జనరావ్ తాగిన మత్తులో వున్నాడు. లేకపోతే గుర్తు పట్టేవాడేమో ఆమెని.

"ఏయ్! ఇది పోలీస్ స్టేషన్, అందులో నా ఇలాకా. నేను మంచి మూడ్‌లో వున్నాను కాబట్టి బ్రతికిపోయావు వెళ్లు" సీరియస్‌గా అన్నాడు.

అతని దృష్టి లాకప్‌లో వున్న అమ్మాయి మీద వుంది. ఈ రాత్రి ఆ అమ్మాయిని బలవంతంగానైనా అనుభవించి తర్వాత తెల్లవారు ఝామునే సిటీ దాటించాలి. జర్దార్ నుంచి వచ్చే డబ్బు గురించి, ఈ రాత్రి దొరికే సుఖం గురించి ఆలోచిస్తున్నాడు. అందుకే కానిస్టేబుల్స్ అందరినీ బయటకు పంపించాడు.

"సారీ ఇన్‌స్పెక్టర్, ఈ రాత్రి నాకు షెల్టర్ కావాలి. లేకపోతే నా శీలానికి గ్యారంటీ లేదు. అసలే రోడ్డు మీద మొగవెధవలు చొంగ కారుస్తూ వెంట పడుతున్నారు" అంది.

సిఐ దుర్జనరావ్ కోపంగా శోధన వంక చూసాడు.

"అసలు పోలీసుల గురించి నువ్వు ఏమనుకుంటున్నావ్? నువ్వు ఎక్కడికి వచ్చావో తెలుసా? ఇది పోలీస్ స్టేషన్, లాడ్జి కాదు" కోపంగా అన్నాడు.

"అదేంటి సార్, మీలాంటి పోలీస్ ఆఫీసర్స్ ఈ మధ్య లాడ్జీలు, బారులు బదులు పోలీస్ స్టేషన్‌లోనే సెటప్ పెట్టుకుంటున్నారని బ్రేకింగ్ న్యూస్‌లో చూసానే" చాలా తాపీగా అంది.

ఆ మాటతో దుర్జనరావ్‌కు కోపం నషాళానికి అంటింది. మామూలు సమయంలో అయితే తన ప్రతాపం చూపించేవాడు. బలవంతంగా కోపాన్ని అణుచుకుంటూ "నిన్ను నిజంగా ఎవరో తరుముతున్నారని గ్యారంటీ ఏమిటి?" ఎదురు ప్రశ్నించాడు.

"అయితే ఓ పని చేయండి సార్, మీరు నాతో రండి."

నన్ను ఇంటి దగ్గర సేఫ్‌గా దింపేసి తిరిగి స్టేషన్‌కు వచ్చి మందు తాగండి" కూల్‌గా అంది శోధన.

ఆ అమ్మాయి తనను రిక్వెస్ట్ చేస్తోందో, ఆర్డర్ వేస్తోందో అర్థం కాలేదు అతనికి. కోపంగా చూస్తూ "చూడు నాకు అసలే తిక్క, నన్ను ఎక్కువగా ఇరిటేట్ చేస్తే పరిస్థితి సీరియస్‌గా వుంటుంది" అన్నాడు.

"నాకు తిక్క కన్నా భయం ఎక్కువ. నన్ను బయటకు పంపిస్తే ఈ రాత్రి

నాకు ఏదైనా జరిగితే దానికి కారణం... త్రీటౌన్ సిఐ" అని ఆగి అతని పోలీస్ చొక్కా మీద వున్న నేమ్ బ్యాడ్జి చూసి "సిఐ దుర్జనరావ్ మాత్రమే అని పత్రికల వాళ్ళకు చెబుతా. ఒక్క రాత్రి ఒక ఒంటరి ఆడపిల్లకు షెల్టర్ ఇవ్వని ఈ పోలీస్ స్టేషన్ ఎందుకు? ఇక్కడ టేబుల్ మీద వున్న ఈ మందు బాటిల్స్ ఎందుకు?" నాటకీయంగా అంది శోధన.

మనిషి మత్తులో వున్నప్పుడు, కన్ఫ్యూజన్లో వున్నప్పుడు ఏమీ ఆలోచించలేడు.

దుర్జనరావ్ కూడా అదే పరిస్థితిలో వున్నాడు. ఇప్పుడతను మందు మత్తులో వున్నాడు. దానికి తోడు కన్ఫ్యూజన్‌లో కూడా వున్నాడు. అందుకే ఎలాగైనా ఆమెను స్టేషన్ నుంచి పంపించేయాలి అని మాత్రమే అతను ఆలోచిస్తున్నాడు.

వెంటనే శామ్యూల్ వైపు చూసి రమ్మన్నట్టు సైగ చేసాడు.

శామ్యూల్ వెళ్ళాడు "ఈ అమ్మాయిని బయటకు పంపించేయ్. పెద్ద న్యూసెన్స్ చేస్తోంది" అన్నాడు.

వెంటనే శామ్యూల్ "సిస్టర్" అని పిలిచాడు.

"యస్ మిష్టర్" అంది శామ్యూల్ వంక చూసి.

"మా సార్ చెప్పింది విన్నారుగా ప్లీజ్.." అన్నాడు డోర్ వైపు చూస్తూ.

"మీ సార్ చెప్పింది నేనూ విన్నాను. తెలుగును తెలుగులో ట్రాన్సలేట్ చేస్తే ఎలా?" అని అతని నేమ్ బ్యాడ్జి వంక చూసి "శామ్యూల్ బ్రదర్" అంది.

శామ్యూల్‌కి ఆమె మాట్లాడే విధానం నవ్వు తెప్పించింది, పైగా సంతోషంగా వుంది.

"ప్లీజ్ సిస్టర్.." అన్నాడు.

"పోనీ ఓ పని చేయండి" అంది.

"చెప్పండి సిస్టర్ ఏం చేయమంటారు?" అడిగాడు శామ్యూల్.

"ఇప్పుడు మీరు చెప్పింది... ఇందాక మీ సార్ చెప్పింది ఓ తెల్ల కాగితం మీద రాసి, మీ స్టేషన్ ఎదురుగా వున్న టీ బడ్డీ వాడి చేత సాక్షి సంతకం చేయించి ఇవ్వండి. ఫర్ సపోజ్ రేపు నా శీలానికి ఏదైనా డ్యామేజీ జరిగితే మీ మీద డామేజీ సూట్ వేయడానికి" తాపీగా చెప్పింది.

ఆ మాటలు విన్న సిఐకి మతిపోయింది. బుర్ర గిర్రున తిరిగింది. కోపం తన్నుకు వచ్చింది.

ఇప్పుడు సీరియస్‌గా డీల్ చేసే మేటర్ కాదు అని మాత్రం అర్థం అయింది. అంతే అతని స్వరంలో మార్పు వచ్చింది. లేని చిరునవ్వు మొహం మీదకి తెచ్చుకొని అనునయంగా

"రాత్రివేళ లేడీస్‌ను పోలీస్ స్టేషన్‌లో ఉంచుకోవడానికి రూల్స్ ఒప్పుకోవు, పైగా మా స్టేషన్‌లో లేడీ కానిస్టేబుళ్లు కూడా లేరు" అన్నాడు.

"గుడ్... ఎంత నిజాయితీ ఉంది మీలో. నిజమే మీ పోలీస్ స్టేషన్‌లో శాంతి భద్రతలు ఏసీలో కూచోని ఉంటున్నాయి కదూ... మరి ఆ సెల్‌లో వున్న లేడీ సంగతి ఏమిటి సిఐ సార్" తాపీగా అడిగింది శోధన.

ఒక్కసారిగా పొలమారింది దుర్జనరావుకి. అతని సర్వీస్‌లో మొట్ట మొదటిసారి కంగారుపడ్డాడు. "చెప్పండి సర్, అర్ధరాత్రి మహిళలను లాకప్‌లో వుంచకూడదు. అదీ లేడీ కానిస్టేబుల్ లేకుండా. పోనీ లోపల, అదే ఆ లాకప్‌లో వున్న అమ్మాయి మీద ఎఫ్ ఐ ఆర్ ఫైల్ చేసారా? ఆమెని ఏ సెక్షన్ కింద అరెస్ట్ చేసారో తెలుసుకోవచ్చా?"

వామనుడు ఇంతింతై వటుడింతై అన్నట్టు శోధన లేచింది. ఆమె మాట్లాడుతుంటే ఐపిసి మాట్లాడుతున్నట్టు వుంది. సిఐ దుర్జనరావ్ గొంతు తడారిపోయింది.

శోధన సెల్ దగ్గరికి వెళ్ళింది. అప్పటి వరకూ బిక్కు బిక్కుమంటూ వున్న లాకప్‌లో వున్న అమ్మాయి కళ్ళలో సన్నటి వెలుగు.

"ప్లీజ్ మేడం! నన్ను కాపాడండి" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

వెంటనే తేరుకున్నాడు సిఐ దుర్జనరావ్.

"ఏయ్ అసలు నువ్వేమనుకుంటున్నావ్? పోలీసులతోనే పెట్టుకుంటావా?"

"యస్సై దీన్ని లోపలేయి ముందు" అంటూ తన ఒరిజినల్ క్యారెక్టర్ చూపించాడు.

శోధన నింపాదిగా అతన్నే చూస్తూ. "అదేంట్రా అని నేను నిన్ను అన్నాననుకో

నీ తల కాశ్మీర్ బోర్డర్‌లో పెట్టుకోవలిసి వస్తుంది. నిన్ను రా అనడం నాకు పెద్ద కష్టమేమీ కాదు.

ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్ నా చిన్నపుడు బూతులు చాలానే నేర్చుకున్నాను శాంపిల్‌కు నాలుగు వదిలితే... నీ నాలుకకు రుచులు కూడా తెలియవు. అర్థం అయిందా? అయినా ఇంకా నువ్వు నన్ను అరెస్టు చేయాలని ముచ్చటపడుతోంటే కాదనను అరెస్ట్ చేసుకో" అన్నది.

అంతలో ఏదో గుర్తుకు వచ్చినట్లుగా నటిస్తూ "అయ్యో! నా మతిమండా! వన్ సెకన్" అని హ్యాండ్‌బాగ్‌కు వున్న బటన్ తీసింది. మీకు చెప్పనే లేదు కదూ... ఇది బటన్ కెమెరా, మంచి క్లారిటీ వుంటుంది. కావాలంటే డబ్బింగ్ కూడా చెప్పించవచ్చు" అంటూ నింపాదిగా అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంది.

అంతే... పోలీస్ స్టేషన్‌లో తీవ్రవాదులు బాంబ్ పెటినట్టు షాకయ్యాడు దుర్జనరావ్.

" 'పోలీస్ స్టేషన్‌లో మందు సెటప్. లాకప్‌లో మహిళ అక్రమ నిర్బంధం. అదేమని ప్రశ్నించిన మరో మహిళపై సిఐ దాష్టీకం' ఈ బ్రేకింగ్ న్యూస్ చాలా బావుంటుంది" ఇంకా తాపీగా అంది శోధన.

ఏం చేయాలో తోచని పరిస్థితి దుర్జనరావుది. అయినా తన స్టేషన్‌లో తనకు భయం ఏమిటి?

ఆ వికృతమైన ఆలోచన రాగానే లేచి శోధన దగ్గరికి వచ్చి ఆమె మెడ మీద చేయి వేయబోయాడు.

"సార్... ప్లీజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళపై అసభ్యంగా ప్రవర్తించడం మంచిది కాదు, వదిలేయండి సార్" అన్నాడు శామ్యూల్.

"రేయ్... నువ్వు ఆఫ్ట్రాల్ యస్సైగాడివి. నాకే ఎదురు చెబుతావా? ముందు నువ్వు దాన్ని లాకప్‌లో వేయ్."

తన అధికార దర్పాన్ని ప్రదర్శించాడు.

"సార్.. ప్లీజ్ మీరు తాగి వున్నారు" అనునయంగా అన్నాడు శామ్యూల్.

"అవును. తాగి ఉన్నా. అయితే ఏంటీ? ఇది నా స్టేషన్, నా ఇష్టం. ఎక్కువగా మాట్లాడితే క్రమశిక్షణ పేరుతో ఏ ట్రాఫిక్‌కో వెళ్తావ్ జాగ్రత్త" అంటూ శోధన

మెడ మీద చేయి వేసాడు. ఇంకా ఆ చేయి మొత్తం శోధన మెడ మీద పడనే లేదు

"చెయ్ తీయరా..." శామ్యూల్ గట్టిగా అరిచాడు. ఆ అరుపుకు బయట కునికిపాట్లు పడుతున్న సెంట్రీ భయంతో లోపలికి పరుగెత్తుకు వచ్చాడు.

సిఐ దుర్జనరావ్ షాకయ్యాడు. "నిన్నేరా! చెయ్ తీయరా" శామ్యూల్ నోట్లో నుంచి వచ్చిన ఆ మాటలు విని సెంట్రీ కన్నా ఎక్కువగా దుర్జనరావ్ షాక్‌కు గురయ్యాడు. నోట్లో నాలుక లేనట్టు వుండే తన కింద పనిచేసే ఒక యస్సై తనని రా అనడమా?

"చెయ్ తీయరా" ఈసారి శామ్యూల్ చేతిలో రివాల్వర్ వుంది.

"నీ కిచ్చినట్టుగానే గవర్నమెంట్ నాకూ సర్వీస్ రివాల్వర్ ఇచ్చింది. నువ్వు డ్యూటీలో ఉపయోగించవచ్చు... నేనూ అంతే! కాకపోతే ఒక మహిళ ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం ఈ రివాల్వర్ ఉపయోగిస్తున్నాను. దానికి నా ఉద్యోగం పోతే పోనీ నాకేంటి? ఇదే స్టేషన్ ఎదురుగా టీ బండి పెట్టుకుని బ్రతుకుతా! నీలా రక్తపు కూడు తిని మాత్రం కాదు" అంటూ శోధన దగ్గరికి వెళ్లి "మేడం మీరు ఆ అమ్మాయిని తీసుకుని వెళ్ళండి. వీడి సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు.

శోధన స్టిఫ్‌గా నిలబడి సెల్యూట్ చేసింది. "హేట్సాఫ్ శామ్యూల్! పోలీసులలో కూడా నీలాంటి నిజాయితీపరులు వున్నారని నిరూపించావు. డ్యూటీ కన్నా మానవత్వం చాలా గొప్పదని చెప్పావ్" అంటూ టేబుల్ మీద వున్న లాకప్ తాళాలు తీసుకుని లాకప్ తెరిచి లోపల వున్న అమ్మాయిని బయటకు తీసుకువచ్చింది.

"థాంక్యూ మేడం" ఆ అమ్మాయి చేతులు జోడించింది.

"థాంక్స్ చెప్పాల్సింది నాకు కాదు, అతనికి. సరైన సమయంలో ఫోన్ చేసాడు" అంటూ శామ్యూల్‌ని చూపించింది.

ఆ రాత్రి మరో వార్త నగరాన్ని కుదిపేసింది.

'పోలీస్ స్టేషన్‌లో దుశ్శాసన పర్వం. సిఐ నిర్వాకం. తెగించి సాహసం చూపిన యస్సై.'

ఓ అమ్మాయి చేసిన స్టింగ్ ఆపరేషన్ వివరాలకు, పూర్తి వీడియోకు యూట్యూబ్ చూడండి.

ఆ రోజు అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌లోని దృశ్యాలు అప్‌లోడ్ అయ్యాయి. వ్యూస్ చాంతాడులా పెరిగాయి.

చిత్రంగా సిఐ సస్పెండ్ అయ్యాడు. దర్యాప్తుకు హోమ్‌మినిస్టర్ ఆదేశించాడు, కానీ క్రమశిక్షణా చర్యగా కొన్ని రోజులు సస్పెండ్‌కు గురికాక తప్పలేదు యస్సై శ్యామ్యుల్‌కి పాండవుల అజ్ఞాతవాసం మంచి కోసమే అన్నట్టు.

❖ ❖ ❖

అర్థరాత్రి రెండు దాటుతుంది.

బెడ్‌రూంలో ఏసీ చల్లదనం ఆమె శరీరాన్ని తాకుతోంది. పింక్ కలర్ నైటీలోకి మారిపోయింది. అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది. కళ్ళు అలసటగా వున్నాయి. ఒంటరితనం జ్ఞాపకాన్ని ఆహ్వానిస్తోంది. జ్ఞాపకం విషాదాన్ని గుర్తు చేస్తోంది.

ఎక్కడో ముంబైలో వున్న తను నాట్యాన్ని ప్రేమిస్తూ, సినిమాలు చూసేస్తూ, లైఫ్‌ని సింపుల్‌గా, హ్యాపీగా గడిపేయాలనుకున్న తను ఎక్కడికి వచ్చింది? ఎవరిని టార్గెట్ చేసింది? అడవిలో భీతావహరిణిలా ఉండే తను, ఈ జనారణ్యంలో సివంగిలా మారింది.

ఒక కన్నీటి చుక్క 'నేను గుర్తున్నానా?' అని అడిగింది.

ఒక కన్నీటి చెమ్మ అమ్మలా స్పృశించింది.

మంచం మీద వెల్లకిలా పడుకుంది. రెండు చేతులూ తలకింద దిండులా పెట్టుకుంది.

కనిపించని ఉద్వేగమేదో... కనురెప్పలను కన్నీటి అలతో కలిసి వచ్చి, అలా పలకరించి వెళ్ళింది.

కళ్ళు మూస్తే పీడకల తన కంటి వాకిట దృశ్యమై కనిపిస్తుందన్నంత భయం.

లేచి వెళ్లి వార్డ్ రోబ్‌లో వున్న ఆల్బం తీసింది.

మొదటి పేజీ తీయగానే... ఆమె ఒంట్లో చిన్న కంపనం... తనకు క్లోనింగ్‌లా వున్న మనిషి కాదు తన మనసు. ఆ మనసు మరో శరీరాన్ని ఇస్తే కనిపించే రూపం శోభన.

సిబిఐ ఏజెంట్ శోభన.

ఎవరి కోసం తను అణ్వాయుధంగా మారిందో, ఎవరిని తను అన్వేషిస్తూ వచ్చిందో, ఎవరి కోసం తను శోధిస్తుందో... ఆ శోభన ఇప్పుడు ఎక్కడుంది? ఏం చేస్తోంది? ఏ శత్రు దుర్భేధ్యంలో బందీగా వుందో?

నిత్యం రద్దీగా వుండే పంజాగుట్ట ఏరియా.

కనీస కామన్‌సెన్స్ లేని వాహన చోదకులు, చలానాల మీద తప్ప ట్రాఫిక్ మీద ఆసక్తి చూపని ట్రాఫిక్ సిబ్బంది. కొందరి వల్ల జరిగే ప్రమాదాలకు మోస్ట్ డేంజరస్ ప్లేస్ అది. అడ్డదిడ్డంగా డ్రైవ్ చేయడంలో చాలా మంది ముందుంటారు. ప్రతి రోజూ ఇంట్లో చీమలను చూసి వాటి నుంచి ఎట్ లీస్ట్ చీమ తలకాయంత క్రమశిక్షణ కూడా నేర్చుకోని భాగ్యనగర వాహనచోదకుల్లో ఒకానొక సెలబ్రిటీ గారాల పుత్రరత్నం రాత్రి ఒంటిగంట దాటాక పబ్ నుంచి విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న కొత్తకారులో ఫ్రెండ్స్‌తో కలిసి తాగిన మత్తు పాదాల నుంచీ నషాళానికి ఎక్కి, పాదాన్ని యాక్సిలేటర్ మీద నొక్కాడు.

స్టీరింగ్ తన ఇష్టం వచ్చినట్టు కదులుతోంది.

ఒక్కసారిగా హాహాకారాలు... కారణం ఓ కారు అదుపు తప్పుతోంది. అసలే బిజీ ఏరియా, అందులోనూ కారు స్పీడ్, ఒక్కసారిగా కారు నాలుగైదు వాహనాలను గుద్దుకుంటూ వెళ్లి రోడ్డు మీద పల్టీలు కొట్టింది. మంటలు వ్యాపించాయి, కారులో ఆ పుత్రరత్నంతో పాటు అతని ఫ్రెండ్స్ వున్నారు. ఆ రోజు ఆ సెలబ్రిటీ కొడుకు పుట్టినరోజు. ఆ సెలబ్రిటీ హోమ్‌మినిస్టర్ ధనంజయరావ్.

ఎప్పుడైతే కారు రోడ్డు మీద అదుపుతప్పి ఘోర ప్రమాదాన్ని సృష్టించిందో ఆ వెంటనే కదిలింది పోలీస్ యంత్రాంగం ప్రమాదం జరిగిన చోటుకి. పబ్ నుంచి దాదాపు ఆరు కిలోమీటర్ల వరకూ ఎన్నో ముఖ్యమైన పాయింట్స్ దగ్గర సరైన నిఘా పెట్టలేకపోయిన పోలీసులు ప్రమాదం జరిగిన వెంటనే మాత్రం ఎలర్ట్ అయ్యారు.

అంబులెన్స్ సైరన్ ఆ ప్రాంతంలో ప్రతిధ్వనించింది.

ఆ ఘోరాన్ని చూసిన ఒకతను వెంటనే ఒకరికి ఫోన్ చేసాడు.

"నేను మా ఆసరా కార్యకర్తను. మేడంను వెంటనే కలవాలి, ఇక్కడ ఒక యాక్సిడెంట్ జరిగింది" చెప్పాడు అవతలి వ్యక్తితో.

"మేడం హెూమ్‌మినిస్టర్‌గారి దగ్గరికి వెళ్లారు, బంజారాహిల్స్‌లో కొందరు అమ్మయిలను ఎవరో కుర్రాళ్ళు వేధిస్తున్నారట. ఆ ఇష్యూలో ఆయన్ని కలిసి మాట్లాడాలని వెళ్లారు."

"అవునా ఎప్పుడు వస్తారో ఏమైనా తెలుసా?"

"హెూమ్‌మినిస్టర్ ఉదయం 11 గంటలకి అప్పాయింట్‌మెంట్ ఇచ్చారు. సాయంకాలం వరకూ పిలవలేదు. అంతేకాదు మేడంని కలవకుండానే ఆయన ఇంటికి వెళ్ళిపోయారు కూడా. మేడమ్ పట్టుదల తెలుసు కదా! ఇంటికే వెళ్ళి కలుస్తా అని మేడం అటునుండి అటే హెూమ్‌మినిస్టర్ ఇంటికి బయల్దేరి వెళ్ళారు. మేము వస్తామన్నా మమ్మల్ని రావద్దన్నారు" అవతలి వ్యక్తి చెప్పాడు.

అదే సమయంలో....

యాభై అయిదేళ్ళ వైదేహి ఆక్టివా మీద అర్థరాత్రి రెండు గంటల వేళ హెూమ్‌మినిస్టర్ కాన్వాయి వెనుకే బయల్దేరింది పట్టుదలగా.

హెూమ్‌మినిస్టర్ రెసిడెన్స్, తీవ్రవాదుల ముప్పు పొంచి వున్నందువలన అతనికి జడ్ కేటగిరీ భద్రత వుంది. హెూమ్‌మినిస్టర్ కాన్వాయి ఆ భవనంలోకి ప్రవేశించగానే ఆ ప్రిమిసెస్ గేట్లు మూసుకున్నాయి.

గేటు బయట వైదేహి నిలబడి వుంది. సెక్యూరిటీ పరుగెత్తుకు వచ్చి వైదేహిని చుట్టుముట్టింది. మొహం మీద చెరగని చిరునవ్వు... ఆ నవ్వు చూసిన మృత్యువే కాసింత ఉలిక్కి పడుతుంది. అలాంటిది ఈ సెక్యూరిటీ ఎంత?

ఆఘమేఘాల మీద సెక్యూరిటీ చీఫ్ వచ్చాడు. అతను మిలిటరీలో పని చేసి వచ్చిన వ్యక్తి.

"ఎవరు మీరు? ఇంత అర్థరాత్రి వేళ మీకు ఇక్కడ పని ఏమిటి?" తన అధికార హెూదాతో అడిగాడు.

"ఆ విషయం మీ హెూమ్‌మినిస్టర్‌ని అడగండి, లేదా ఈ రోజు ఉదయమే నాకు పదకొండు గంటలకి కలవమని అప్పాయింట్‌మెంట్ ఇచ్చి, ఇప్పటి వరకూ

హోమ్‌మినిస్టర్‌ని కలిసే అవకాశం ఇవ్వకుండా, కనీసం మహిళను అనే ఇంగితం లేని ఆయన పిఏని అడగండి" అదే చిరునవ్వుతో అంది వైదేహి.

సెక్యూరిటీ చీఫ్ తన సర్వీసులో మొదటిసారి షాకయ్యాడు. ఒక సాధారణ మహిళ అర్థరాత్రి వేళ ఎంత ధైర్యంగా వచ్చింది? అందులోనూ సెక్యూరిటీ చీఫ్ అయిన తననే నిలదీసి మరీ అడుగుతోంది. కానీ పాపం ఆ క్షణం అతనికి తెలియదు తను మాట్లాడుతుంది ఒక అసాధారణ వ్యక్తితోనని.

తను మాట్లాడుతోంది ఒకనాటి స్వతంత్ర సమరయోధుడు, రాష్ట్ర మాజీ గవర్నర్ కూతురుతోనని తెలిస్తే... అన్నింటికీ మించి యుద్ధం అనివార్యమైతే... ధర్మం ఓడిపోయే సమయం ఆసన్నమైతే... విశ్వరూపం చూపే ఒక శక్తితోనని తెలిస్తే?

క్షణాల్లో హోమ్‌మినిస్టర్‌కి చేరిందా వార్త. వెంటనే వైదేహిని రమ్మని చెప్పాడు.

హోమ్‌మినిస్టర్ ఎదురుగా కూచుంది వైదేహి. ఆమె వంక పరిశీలనగా చూసాడు. ఆమె ముందు తన పదవి తాలూకు పొగరు చూపించే సాహసం చేయలేకపోయాడు. అతనికి ఒక్కటే ఆశ్చర్యంగా వుంది. ఈ వయసులో ఇంత అర్థరాత్రి వేళ దైర్యంగా తనను ఫాలో అయి రావడం మింగుడుపడ్డం లేదు.

"చెప్పండి... ఈ టైంలో మీరు నన్ను కలవాల్సిన పని ఏముంది?" కాసింత తన దర్పాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

"నాకు మీరు ఇచ్చిన అప్పాయింట్‌మెంట్ ఉదయమే" అంది వైదేహి.

"అఫ్‌కోర్స్ కానీ హోమ్‌మినిస్టర్‌కు బోల్డు పనులు వుంటాయి."

"అవి శాంతిభద్రతలకు సంబంధించినవే కదా! వాటిని విస్మరించి మీరు మీ పార్టీ కార్యకర్తలతో, లేదా నాయకులతో మాట్లాడడం అంత ముఖ్యం కాదు అని మీరు గ్రహిస్తే మంచిది. మీరు పబ్లిక్ సర్వెంట్ ముందు వారికోసం టైమ్ కేటాయించాలి. పార్టీ కోసం మిగతా టైం స్పేర్ చేయవచ్చు" అన్నది.

"అంటే మా డ్యూటీస్ మీరు గుర్తు చేయాలా?" కాసింత కోపం ప్రదర్శిస్తూ అన్నాడు.

"ఉదయం పదకొండు గంటలకు రంగారెడ్డి జిల్లాలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ రెండు వర్గాల్లో మీ పార్టీ కార్యకర్తలు ఒక వర్గంలో వున్నారు.

అక్కడ వున్న మరో పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసారు. ఈ విషయం రేపు అసెంబ్లీలో తేలుతుంది. అది వేరే విషయం. ఒక మహిళ మీ అప్పాయింట్ మెంట్ తీసుకున్నప్పుడు మీరు కలువవలసిన అవసరం వుంది. కాదంటారా? అంతే కాదు, మీ పిఏకి ఆ విషయాన్ని మీ దృష్టికి తీసుకు రావాలి అన్న కనీస మేనర్స్ కూడా లేదు" అంది వైదేహి.

"సరే.. ఇప్పుడు చెప్పండి ఇంత అర్ధరాత్రి కూడా మీరు ఇక్కడి వరకూ వచ్చిన కారణం?" అసహనంగా అడిగాడు హోమ్‌మినిస్టర్.

అతనికి కొద్దిగా చిరాకుగా వుంది, దానికి తోడు అతని అహం దెబ్బతిన్నది.

"బంజారాహిల్స్‌లో కొందరు పోకిరీలు అమ్మాయిలను వేధిస్తున్నారు... ఆ దారిలో రాత్రి మాత్రమే కాదు పగలు వెళ్ళాలన్నా కూడా వాళ్ళు భయపడుతున్నారు. అంతేకాదు రాత్రి వేళ ఆ దారిలో ఫుల్ స్పీడ్‌తో వెహికల్స్ వెళుతూ ఉంటాయి స్పీడ్ బ్రేకర్లని సైతం లెక్క చేయకుండా. మీ దృష్టికి వచ్చిందో లేదో కానీ మద్యం మత్తులో డ్రైవ్ చేస్తున్నవారి సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతున్నది" అంటున్న ఆమె మాటలు ఇంకా పూర్తికాకుండానే

"ఇది చాలా కామన్ సమస్య, దీని కోసమా మీరు ఉదయం నుంచి వేచి వున్నది.

లోకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంప్లయింట్ ఇచ్చి ఉంటే సరిపోయేది కదా!" తేలిగ్గా చెప్పాడు హోమ్‌మినిస్టర్.

"డ్రైవింగ్ లైసెన్స్ మర్చిపోయినా, పొరపాటున సిగ్నల్ క్రాస్ చేసినా బెదిరించి ఫైన్ వేసే పోలీసులు సెలబ్రిటీల జోలికి వెళ్ళరు? ఎవరైనా కొత్తగా వచ్చినవాళ్ళు డబ్బులకి అమ్ముడుపోకుండా వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేస్తోంటే రాజకీయ నాయకులు ఊరుకుంటారా? ఆ స్వేచ్ఛ పోలీసులకు వుండి వుంటే, రాజకీయం పోలీసుల జోలికి వెళ్ళకుండా వుండి వుంటే నాలాంటివాళ్ళు మీ దగ్గరికి వచ్చే అవసరమే ఉండేది కాదు" స్పష్టంగా చెప్పింది వైదేహి.

"అంటే మీరు చెప్పేది ఏమిటి?" అసహనంగా అడిగాడు హోమ్‌మినిస్టర్.

"బంజారాహిల్స్‌లో రాత్రివేళ నిఘా పెంచండి, ఫాస్ట్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ పట్ల కేర్ తీసుకోండి, సెలబ్రిటీల పిల్లలు ఆకాశం నుంచి వూడిపడరు కదా! వాళ్ళను అదుపులో పెట్టండి ముఖ్యంగా మీ కొడుకుని కూడా!"

చివరి మాటతో అదిరిపడ్డాడు హోమ్‌మినిస్టర్... కోపం కూడా వచ్చింది ఆయనకి.

అది గమనించి కూడా గమనించనట్లే తన ధోరణిలో తను చెప్పేస్తోంది ఆమె.

"మీ అబ్బాయి తరచూ పబ్‌లకు వెళ్తాడు. అది మీ అబ్బాయి ఇష్టం, మీ ఇష్టం... కానీ తప్పతాగి డ్రైవ్ చేస్తాడు. దానివల్ల మీ అబ్బాయికే కాదు, రోడ్డు మీద వెళ్ళేవారికీ ప్రమాదమే" అన్నది. వైదేహి గొంతులో కోపం స్పష్టంగా ఉంది.

ఒక్క క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు హోమ్‌మినిస్టర్‌కి. అతని ఈగో దెబ్బతిన్నది. దానితో పాటు ఆమె చెప్పిన విషయం అతనికి కొరడా దెబ్బలా తగిలింది.

వైదేహి వంక చూసాడు. ఆమె మొహంలోని ఫీలింగ్స్ స్పష్టంగా వున్నాయి.

"కొద్దిగా మంచినీళ్ళు ఇప్పించగలరా?" అడిగింది వైదేహి.

ఒక్క క్షణం గిల్టీ ఫీలింగ్ కలిగింది హోమ్‌మినిస్టర్‌లో... ఉదయం నుంచి ఆడమనిషి ఏమీ తినకుండా, తాగకుండా తనకోసం ఎదురుచూస్తూ ఉందన్న ఫీలింగ్ అది.

వెంటనే సర్వెంట్‌ని పిలిచి మంచినీళ్ళు తీసుకురమ్మని చెప్పాడు.

మంచినీళ్ళు తీసుకురావడానికి సర్వెంట్ వెళ్ళాడు. ఈలోగా ఫోన్ వచ్చింది ఆమెకి.

ఈ టైంలో ఎంతో అర్జెంటు అయితే తప్ప సెల్ మోగదు. అందుకే ముందు ఉన్నది హోమ్‌మినిస్టర్ అయినా "ఎక్స్‌క్యూజ్ మీ" అంటూ మొబైల్‌లో ఓకే బటన్ నొక్కింది.

"మేడం.. బంజారా హిల్స్ ప్రాంతంలో, పంజాగుట్ట సర్కిల్ నుంచి వచ్చే రూట్‌లో పెద్ద యాక్సిడెంట్ జరిగింది. ఒక వ్యక్తి తీవ్ర ప్రాణాపాయ స్థితిలో వున్నాడు. రక్తం అర్జెంట్‌గా కావాలి." అవతలి వ్యక్తి హాస్పిటల్ పేరు వివరాలు, బ్లడ్ గ్రూప్ అన్నీ చెప్పాడు.

"వెంటనే వచ్చేస్తున్నాను నా బ్లడ్ గ్రూప్ అదే" అని చెప్పి హోమ్‌మినిస్టర్

వైపు తిరిగి "సారీ అండీ, మనం మళ్ళీ కలుద్దాం.." అంటూ హడావుడిగా బయటకు నడిచింది.

సర్వెంట్ మంచినీళ్ళు తెచ్చేలోగా వెళ్ళిపోయింది.

ఉదయం నుంచి తన కోసం తిరిగి, తీరా తను కలిసాక కనీసం మంచి నీళ్ళు కూడా తాగకుండా వెళ్ళిపోయిన వైదేహి వంక చూస్తూ ఉండగానే హోమ్‌మినిస్టర్‌కు ఫోన్ వచ్చింది.

"హా.. అంటూ షాకింగ్‌గా ఫోన్ పెట్టేసి హడావుడిగా లేచాడు హోమ్‌మినిస్టర్.

ఆయన కొడుకు ఉన్న కారుకి యాక్సిడెంట్ జరిగిందని, కొడుకు ప్రాణాపాయ స్థితిలో వున్నాడని చెప్పటానికి ఆ ఏరియా ఇన్‌స్పెక్టర్ చేసిన ఫోన్ అది.

వైదేహి హుటాహుటిన వెళ్ళింది కూడా చావు బ్రతుకుల్లో వున్న హోమ్ మినిస్టర్ కొడుక్కి రక్తం ఇవ్వడానికే.

ఒక అనూహ్య సంఘటనకు ఈ అధ్యాయం నాంది పలుకుతోందని ఆ క్షణం వారిద్దరికీ తెలియదు.

సరిగ్గా అదే సమయంలో శోధన శివతో కలిసి యాక్సిడెంట్ జరిగిన ప్రాంతానికి వచ్చింది.

మరో వైపు వైదేహి వస్తోంది. కొద్దిగా చలి వేస్తోంది, అయినా ఆ చలి వైదేహిని ఏమీ చేయడం లేదు. ఆక్టివా స్పీడ్‌గా వెళ్తోంది. ఒక మనిషి చావు బ్రతుకుల మధ్య వున్నాడు అన్న విషయం ఆమె మైండ్‌ని చలికి అతీతంగా తీసుకుపోయింది. అప్పటికే వైదేహి మధ్య మధ్యలో ఆగి చాలామందికి ఫోన్ చేస్తోంది. మరో ఇద్దరు కూడా చావు బ్రతుకుల మధ్య వున్నారు అన్నారు హాస్పటల్ వాళ్ళు. ఎప్పుడు ఎవరికి రక్తం అవసరం వస్తుందో అన్న ఆందోళన ఆమెని తొలిచేస్తోంది.

ఆలోచనలు ఆక్టివా కన్నా స్పీడ్‌గా వెళ్తున్నాయి.

రక్తసంబంధం అంటే ఏమిటి? రక్తం దానం చేస్తే అది రక్తసంబంధం కాదా? ఓ పక్క ఫ్యాక్షనిష్టులు ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు, రక్తం ఏరులై పారుతోంది. ప్రాణాలు విలువే లేనట్లు గాల్లో కలిసిపోతూనే ఉంటున్నాయి. కానీ అదే రక్తంలో కనీసం పదవ వంతు దానం చేసినా ఒక మనిషి ప్రాణాలు

కాపాడవచ్చు అన్న ఆలోచనే వారిలో కలిగితే మనుష్యులను చంపడంలో వున్న పైశాచిక ఆనందం, మనుష్యులను బ్రతికించడంలో పొందగలిగితే, ఏరులై పారుతున్న ఆ రక్తం విలువ తెలిస్తే, ఈ రక్తపాతం రక్తదానంగా మారితే ఎంత బాగుండును? ఆలోచిస్తూ మూల మలుపు దగ్గరికి వచ్చి ఒక్క క్షణం ఆగిపోయింది.

సడెన్‌గా బ్రేక్ వేసింది. కారణం తెలుసుకోవాలంటే పది నిమిషాల వెనక్కు వెళ్ళాలి.

శోధన ఆలోచనలు ఆమె నడిపే వెహికల్ కన్నా స్పీడ్‌గా వున్నాయి.

పంజాగుట్టలో జరిగిన దారుణం ఆమెను కోపానికి గురి చేస్తోంది. ఒక వ్యక్తి నిర్లక్ష్యం ఎంత పెద్ద మూల్యం చెల్లించుకోవల్సి వస్తుంది? డ్రంక్ అండ్ డ్రైవ్ ఎంత ప్రమాదకరం?

తాగి డ్రైవ్ చేసే అధికారం ఎవరిచ్చారు? మాట తూలితే ఫర్లేదు. వెహికల్ అదుపు తప్పితే? పంజాగుట్ట సర్కిల్‌లో జరిగిన యాక్సిడెంట్ విషయం తెలిసి బయల్దేరింది. శివను కూడా రమ్మని చెప్పింది శోధన.

హోమ్‌మినిస్టర్ కొడుక్కి సీరియస్‌గా ఉంది అని తెలిసింది. హోమ్‌మినిస్టర్ కొడుకు ఒక్కడే మనిషా? ఆఘమేఘాల మీద అతడికి ట్రీట్‌మెంట్ జరుగుతూనే ఉండి ఉంటుంది. అందులో ఎటువంటి సందేహం లేదు. కానీ అదే మామూలు వాళ్ళకి అయితే? ఎన్ని ప్రశ్నలు? ఎన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేయమంటారో? కనీస వైద్యసహాయం కూడా అందించకుండా వాళ్ళని చంపేస్తూ ఉంటారు ఎన్నోసార్లు. ఇప్పుడు కూడా ఆ యాక్సిడెంట్ ఎంత మందిని గాయపరిచిందో... మరెంత మంది ప్రాణాలను హరించిందో?

ఆమె ఆలోచనలు ఎంత స్పీడ్‌గా వున్నాయంటే ఎదురుగా వచ్చిన వెహికల్‌ని కూడా గుర్తించలేదు... తను టర్నింగ్‌లో కూడా చాలా స్పీడ్‌గా వస్తున్నానన్న విషయమూ గుర్తించలేదు. ఎదురుగా వెహికల్ కనిపించి సడెన్ బ్రేక్ వేసింది. మూల మలుపులో తన ఎదురుగా మరో వెహికల్.

ఒక ఘటన దైవఘటనైె, ఒక అద్భుతం ఆవిష్కారమైతే?

ఎదురుగా వైదేహి...

సృష్టికర్త విధాత ఓ అద్భుతమైన, అపురూపాన్ని శరీరాన్ని సృష్టించి ఏమరుపాటుగా ఆ శరీరంలోని ఒక భాగాన్ని భూమీ్మదికి పంపించాడు. ఆ ప్రాణి వైదేహిగా తన తలరాతను తనే పునర్లిఖించుకుని విధాతనే అబ్బురపరిచింది. ఆపై ముప్ఫయ్యేళ్ళ తర్వాత తను సృష్టించిన మిగతా సగభాగం తన దగ్గరే వుందని గుర్తించి తిరిగి ఆ సగభాగాన్ని భూమీ్మదికి పంపించాడు. ఆమె తలరాతను తనే లిఖించాలని తలపోసాడు. కానీ విధాతను ప్రాధేయపడి తన తలరాతను కాలానికే వదిలివేయమని చెప్పింది.

అలా భూమీ్మదికి ముప్ఫయ్యేళ్ళ తర్వాత వచ్చిన ప్రాణి శోధన.

ఒకే శరీరం రెండుగా చీలి ఆలస్యంగా వచ్చిన మరో శరీరమే శోధన.

కానీ కాలానికి వదిలేయకుండా శోధన తలరాతను మరొకరికి ముడివేసాడు ఆ విధాత. ఎవరతను?

ఒక్క క్షణం... ఒకే ఒక్క క్షణం ఆకాశాన్ని సముద్ర కెరటం పరామర్శించినట్టు...

ఒక మెరుపు మెరిసి మురిసినట్టు సడెన్ బ్రేక్ వేసి లిప్తకాలం చిన్న ఉద్వేగానికి లోనైంది శోధన. ఎదురుగా వైదేహి... సడెన్ బ్రేక్ వేసింది. బ్రేక్ వేసి ఉండకపోతే రెండు వెహికిల్స్ గుద్దుకుని ఉండేవి. తను పొరపాటున మూల మలుపు చూసుకోలేదు.

ఎదురుగా వున్న వైదేహి వైపు చూసింది... చూడగానే రెండు చేతులు జోడించి నమస్కరించాలని అనిపించే రూపం.

వెహికిల్ ఆపి స్టాండ్ వేసి వైదేహి దగ్గరికి వెళ్లి “సారీ మేడం” అంది సిన్సియర్‌గా శోధన.

“ఫర్లేదమ్మా... రోడ్డు ప్రమాదాలు భయంకరమైనవి. ఒక్కో సారి అవి ప్రాణాలు తీస్తాయి. వేగం ప్రమాదకరమైనది. అంతకన్నా నిర్లక్ష్యం ఇంకా ప్రమాదకరం. ఏదో ఆలోచిస్తూ నడిపించడం ఇంకా ఇంకా ప్రమాదకరం” చెప్పింది వైదేహి.

“యస్...మేడం... ఏదో ఆలోచిస్తూ నడిపాను సారీ!” అని చిన్నగా నవ్వింది.

“ఇంత రాత్రి వేళ బయల్దేరుతున్నావు... అదీ ఒంటరిగా...”

"మన స్వతంత్రాన్ని పరీక్షిద్దామని" చిన్నగా నవ్వి అంది శోధన.

"మన స్వతంత్రం మన చేతుల్లోనే వుంది, ఉంటుంది కూడా. ఎవరైనా లాక్కున్నా, లాక్కుందామని ప్రయత్నం చేసినా మనం ఇవ్వకూడదు."

వైదేహి మాటల్లో స్పష్టత వుంది. అందుకో మరెందుకో కానీ వాదించలేక పోయింది విచిత్రంగా శోధన.

వైదేహి "నాకు చిన్న అర్జెంటు పని వుంది. జాగ్రత్తమ్మా!" చెప్పింది ఆక్టివా స్టార్ట్ చేసి.

వైదేహి వెళ్తోన్న వైపే చూస్తూ ఉండిపోయింది.

'ఎవరు తను... తనని చూడగానే ఏదో ఒక భావం తనను చుట్టుముట్టింది' అనుకుంటూనే వెహికల్ ముందుకు పోనిచ్చింది శోధన.

యాక్సిడెంట్ స్పాట్...

ఘోరమైన రోడ్డు ప్రమాదం సిటీ నడిబొడ్డున...

అప్పటికే ఆమె వెనుకే శివ వచ్చాడు, కెమెరా బయటకు తీసాడు.

"అర్థరాత్రి వాహనాల స్వైరవిహారం, తాగి వాహనాలు స్పీడ్‌గా నడిపే సెలబ్రిటీలను, వారి పుత్రరత్నాలను నిలదీసే నాథులెవరు? యాక్సిడెంట్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఎవరు పట్టించుకుంటారు? శోధన చెప్పుకు పోతూనే వుంది. అక్కడ జరిగిన యాక్సిడెంట్ దృశ్యాలు చిత్రీకరిస్తున్నాడు శివ.

అయితే హెూమ్‌మినిస్టర్ కొడుకు యాక్సిడెంట్ చేసిన విషయాన్ని కొందరు పోలీసు అధికారులు తొక్కి పెట్టారు. అదే విషయాన్ని శోధన ఎత్తి చూపింది, హెూమ్‌మినిస్టర్ కొడుకు పబ్ నుండి తాగి తూలుతూ బయటకు వచ్చిన ఫుటేజ్‌ని పబ్ ద్వారా సంపాదించింది.

హెూమ్‌మినిస్టర్ కొడుకుని కేసు నుంచి తప్పించడానికి పోలీసులు చేస్తున్న ప్రయత్నాన్ని విమర్శించింది. అదంతా కెమెరాలో రికార్డు చేయిస్తోంది.

యాక్సిడెంట్ స్పాట్‌లో వుండవలసిన పోలీసులు యాక్సిడెంట్ చేసింది హెూమ్‌మినిస్టర్ కొడుకు కాబట్టి హాస్పిటల్‌కు వెళ్లారు సెక్యూరిటీ అన్న నెపంతో.

శోధన ఇక్కడ యాక్సిడెంట్ దృశ్యాలు షూట్ చేస్తున్న విషయం ప్రజలకి తెలిసే లోపే శోధన హాస్పిటల్‌కు వచ్చింది.

హాస్పిటల్ పరిసర ప్రాంతంలో పూర్తి భద్రత వుంది. పోలీసులు ఎలర్ట్‌గా వున్నారు. అదే హాస్పిటల్‌లో జనరల్ వార్డ్‌లో నలుగురు వ్యక్తులు చావు బ్రతుకుల మధ్య వున్నారు. అయిదుగురు వ్యక్తులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. హెూమ్‌మినిస్టర్ కొడుకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్నాడు. తలకు దెబ్బలు బలంగా తగిలాయి.

వైదేహి అక్కడికి వెళ్లేసరికి డాక్టర్స్ కూడా ఎదురుచూస్తున్నారు. వైదేహి హాస్పిటల్‌లోకి వస్తూనే అడిగిన ప్రశ్న "ఎవరైనా చనిపోయారా?"

"లేదు మేడం... కాకపోతే నలుగురి పరిస్థితి తీవ్రంగా వుంది." డ్యూటీ డాక్టర్ వైదేహిని గుర్తుపట్టి చెప్పింది. ఎవరికి, ఎప్పుడు రక్తం అవసరపడినా వైదేహి ముందుంటుంది. ఆమె అంటే చాలామంది డాక్టర్స్‌కు గౌరవం. ఒక్కోసారి బ్లడ్ బ్యాంకుల కన్నా వైదేహినే నమ్ముకుంటారు.

"మంత్రిగారి అబ్బాయి నిరంజన్ పరిస్థితి తీవ్రంగా వుంది" డ్యూటీ డాక్టర్ చెప్పాడు.

వైదేహి ముందుకు నడిచింది. ఆమె దృష్టిలో మంత్రి కొడుకు అయినా, కూలీ అయినా ఒక్కటే... ప్రాణాలు కాపాడడమే తనకు తెలుసు.

అప్పటికే శోధన అక్కడికి వచ్చింది. వస్తూనే డాక్టర్ దగ్గరికి వెళ్ళింది. యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలైన వారి దగ్గరికి వెళ్ళింది. అక్కడ వున్న పోలీసులు వారించారు. అడ్డుకునే ప్రయత్నం చేసారు. శివ తన కెమెరాకు పని చెప్పాడు. కొద్దిసేపటి క్రితమే యాక్సిడెంట్ వార్త యు ట్యూబ్‌లోకి అప్‌లోడ్ అయింది.

"ప్రాణాలు తీయడానికి ప్రయత్నించిన మంత్రి కొడుక్కి వైద్యం చేయకూడదు" గట్టిగా అరిచింది శోధన. అప్పటికే జనం గుమికూడటం మొదలుపెట్టారు.

కొందరు గాయపడినవారికీ నష్టపరిహారం ఇవ్వాలని అరుస్తున్నారు. మరికొందరు "కాదు, యాక్సిడెంట్ చేసినవారికి కఠినమైన శిక్ష పడాలని" ఆవేశపడి పోతున్నారు. ఒక్కోసారి ఇలాంటి సందర్భాల్లో ఆవేశం శృతి మించుతుంది. అవకాశవాదులు తలదూర్చడం మొదలుపెడతారు. స్వలాభం కోసం ఇంకొందరు.

శోధన మంత్రి కొడుకును ఉంచిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వైపు కదిలింది. హాస్పిటల్ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు.

గొడవ ముదురుతోంది అక్కడ... సరిగ్గా అప్పుడు బయటకు వచ్చింది వైదేహి.

"మేడం మీరా? మీరు ఇక్కడ?"

"మంత్రి కొడుక్కి రక్తం ఇవ్వడానికి వచ్చారు" శివ మెల్లిగా తనకు తెలిసిన సమాచారం చెప్పాడు.

"రోడ్డు మీద వెళ్ళే అమాయకుల మీదికి కారును పోనిచ్చి వారి రక్తాన్ని కళ్ళ జూసిన వాడికి రక్తం ఇస్తారా మేడం?" ఆవేశంగా అడిగింది శోధన.

వైదేహి మొహం మీద చిరునవ్వు చెరగలేదు.

"నేను రక్తం ఇస్తున్నది ప్రాణాపాయ స్థితిలో వున్న ఒక నిస్సహాయుడికి అంతే. అతను ఎవరు? ఎవరి కొడుకు? అని ఆలోచించించి రక్తాన్ని దానం చేయంగా! అయినా ప్రాణాన్ని కాపాడడం మన ధర్మం" చెప్పింది వైదేహి.

"కానీ హంతకుడిని కాపాడడం ధర్మం ఎలా అవుతుంది మేడం?"

"ఉరికంబం ఎక్కుతున్న వాడికి కూడా చివరి కోరిక వుంటుందని, దాన్ని తీర్చటం మానవత్వం అనిపించుకుంటుందని చెప్పడానికి న్యాయస్థానమే దాన్ని అమలుపరుస్తుంది. అనారోగ్యంతో వున్నవారిని ఉరి తీయరు. ఒక మనిషి ప్రాణాన్ని చూస్తూ చూస్తూ పోనివ్వటం ధర్మం కాదు. అలాంటివారిని చూస్తూ మనం మౌనంగా వుండకూడదు."

"మరి అతని వల్ల గాయపడ్డవాళ్ళు?"

"అది పోలీసులు చూసుకుంటారు. అక్కడ న్యాయం జరగకపోతే నీ లాంటి సామాజిక స్పృహ వున్నవాళ్ళు స్పందిస్తారు. నువ్వు ఓ మనిషి చేసిన నేరాన్ని ప్రశ్నించు. అతని ప్రాణాన్ని తీయాలన్న వాదాన్ని బ్రతికించవద్దు."

శోధన కొద్ది క్షణాలు మౌనంగా వుంది. కేవలం తన వాదన మాత్రమే కరెక్ట్ అనే తత్త్వం కాదు. ఎదుటివారి వాదనలో నిజాయితీని కూడా గుర్తించాలని భావించే మనస్తత్వం శోధనది.

కొన్నిసార్లు మౌనం ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. వైదేహి అప్పటికే శోధన గురించి తెలుసుకుంది.

"మీరు చేస్తున్న పని చాలా మంచిది. సోషల్ అవేర్‌నెస్ యూట్యూబ్ ద్వారా ఒక మంచి మెసేజ్ కమ్యూనికేట్ చేస్తున్నారు. నేతాజీ, గాంధీ మహాత్ముడు ఇద్దరూ

దేశభక్తులే... కానీ వాళ్ళు అనుసరించే పంథాలు వేరు. మీ ఆవేశంలో నిజాయితీ వుంది, కానీ ఒక్కో సారి ఆవేశం ఉపద్రవాన్ని కూడా తెచ్చి పెడుతుంది" అన్నది మెల్లని స్వరంతో వైదేహి.

అప్పటికే పోలీసులు శోధనను చుట్టుముట్టారు. ఇష్యూ హెూమ్‌మినిస్టర్‌ది కదా! అత్యుత్సాహం తప్పనిసరిగా వుంటుంది.

"మేడం, మీరు ఈ హాస్పిటల్ వదిలి వెళ్ళాలి" ఓ పోలీస్ అధికారి తన దర్పాన్ని ప్రదర్శించాడు.

"ఎందుకు? ఈ హాస్పిటల్ మీకు మాత్రమే సంబంధించినదా?" అడిగింది రెక్‌లెస్‌గా శోధన.

"ఇక్కడ న్యూసెన్స్ చేయకూడదు? అవతల మినిస్టర్‌గారి కొడుకు పరిస్థితి సీరియస్‌గా వుంది?" పోలీస్ అధికారి అన్నాడు.

"గుడ్.. మీ స్వామిభక్తి బావుంది. ఈ హాస్పిటల్ మీ మినిస్టర్‌గారి స్వంతమా? మిగతావారి ప్రాణాలు ఏమైనా ఫర్లేదా? రమ్మనండి మీ మినిస్టర్‌ని, మేమే అడుగుతాం" శోధన అంది.

"మీరు మర్యాదగా ఇక్కడి నుంచి వెళ్ళకపోతే మిమ్మల్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకు వెళ్ళాల్సి వుంటుంది" హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు.

"ఓకే... అరెస్ట్ చేయండి. జీపులో వెళ్దామా? నడుచుకుంటూ వెళ్దామా? అదే అంకుశం సినిమాలో రాజశేఖర్ రామిరెడ్డిని తీసుకువెళ్ళినట్టు."

ఇన్‌స్పెక్టర్ షాకింగ్‌గా చూసాడు. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. వైదేహి జోక్యం చేసుకుంది.

"ఇన్‌స్పెక్టర్, మీరు మాట్లాడుతుంది కరెక్ట్ కాదు. ఆ అమ్మాయి తన కోసం న్యూసెన్స్ చేయడం లేదు, బాధితులకు న్యాయం జరగాలని అంటోంది" అని శోధన వైపు చూసి "ఇది వాదనకు సమయం కాదు. ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో వున్నప్పుడు కాపాడవలిసిన బాధ్యత మన మీద వుంది. మనం మళ్ళీ కలుద్దాం" అని మరో మాటకు అవకాశం ఇవ్వకుండా లోపలికి వెళ్తూ ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగి "ఆ అమ్మాయికి హాని జరిగితే అది మీ పోలీసులకు మంచిది కాదు" అందులో సూచన, వార్నింగ్ రెండూ వున్నాయి.

అక్కడ పరిస్థితి తుఫాన్‌కు ముందు ప్రశాంతతలా వుంది. హోమ్‌మినిస్టర్ వచ్చాడు. వస్తూనే డిసిపిని వివరాలు అడిగాడు. తన కొడుకు తప్పతాగి డ్రైవ్ చేసిన విషయం తెలిసింది. మిగతా బాధితుల గురించి తెలుసుకున్నాడు. అతనికి ఒకే కొడుకు. పెళ్ళైన చాలా కాలం తర్వాత పుట్టాడని గారాబం చేసాడు. దానికి తోడు తన రాజకీయాల్లో తను ఎప్పుడూ బిజీగా ఉండటం వలన కొడుకు బాగానే అదుపు తప్పాడని కూడా తెలుసు. అయినా ఇప్పటివరకు తెలియని ఒక విషయం ఆ క్షణంలోనే అర్థం అయింది ఆయనకి.

ప్రాణం ఎంత విలువైనదో తెలుస్తోంది, అక్కడ ప్రాణాపాయ స్థితిలో వున్నది తన ఒక్కగానొక్క బిడ్డ కావటం వలన. ఒక మనిషిలో పశ్చాత్తాపం కలగాలన్నా, ఆలోచనలో మార్పు రావాలన్నా నెలలు, సంవత్సరాలు అవసరం లేదు, జరిగే సంఘటనలు, అనుభవాలు చాలు. దానికి విచక్షణ తోడైతే... హోమ్‌మినిస్టర్ ధనంజయరావ్ ఇప్పుడు అదే స్థితిలో వున్నాడు.

అతనిలోని విచక్షణ పనిచేయడానికి కారణమైన సంఘటన జరిగింది.

వైదేహి కారణంగా...

తన కొడుకును ఉంచిన ఐసియు వైపు కదిలాడు. అక్కడి దృశ్యం చూసాడు.. క...ది...లి..పో..యా...డు.

తన కొడుకు రక్తం మడుగులో వున్నట్టు వున్నాడు. ప్రమాదం ఎంత తీవ్ర స్థాయిలో వుందో అర్థమవుతోంది.

మరో దృశ్యం తన కొడుక్కి రక్తం ఇస్తున్నది మరెవరో కాదు వై...దే..హి.

తన కోసం ఉదయం నుంచి ఎదురుచూసి, అర్థరాత్రి కూడా తన ఇంటికి వచ్చి, మహిళల సమస్య గురించి మాట్లాడాలని ప్రయత్నించిన వ్యక్తి దాహం అని చెప్పి మంచినీళ్ళు కూడా తాగకుండా హడావుడిగా వెళ్ళింది... తన బి...డ్డ...కు రక్తం ఇవ్వడానికి. మొదటిసారి అతనికి ఏడవాలని అనిపించింది.

తను ఒక విధంగా అవమానపరిస్తే, అదేమీ పట్టించుకోకుండా ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడే వ్యక్తులు ఇంకా బ్రతికే వున్నారా?

బయట గొడవ జరుగుతోంది. మరొకప్పుడైతే తన దర్పాన్ని ప్రదర్శించేవాడు. కానీ ఇపుడు మౌనంగా ఉండిపోయాడు. ప్రముఖుల పిల్లలు యాక్సిడెంట్‌లో

చనిపోయిన వార్తలు చదివాడు. మితిమీరిన వేగంతో వాహనాలు రోడ్ల మీద స్వైరవిహారం చేయడం తెలుసు, కానీ తనదాకా వస్తేనే కదా ఎవరికైనా తెలిసేది?

"సార్, ఎవరో శోధన గొడవ చేస్తున్నది. మన అబ్బాయికి కూడా రక్తం ఇవ్వకూడదని గొడవ చేసింది. వైదేహి మేడం చెప్పడం వల్ల ఆగిపోయింది. అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించమంటారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"వద్దు" అన్నట్టు తల అడ్డంగా తిప్పాడు.

అతని మనసులో తెలియని ఆందోళన. అది కొడుకును అలాంటి పరిస్థితిలో చూడటం వల్లనా? వైదేహి తన కొడుక్కి రక్తం ఇవ్వడం వల్లనా? తనలో ఏ మూలో మానవత్వం ఇంకా మిగిలివుండడం వల్లనా?

"సార్... మన అబ్బాయి అవుట్ ఆఫ్ డేంజర్" పిఏ వచ్చి చెప్పాడు.

"మిగతావాళ్ళు ఎలా వున్నారు?" మొదటిసారి పాజిటివ్‌గా ఒక ప్రజా ప్రతినిధిగా, బాధ్యత గల హోం మంత్రిగా అడిగాడు.

పిఏ ఏదో చెప్పబోయాడు.

"ముందు వాళ్ళందరినీ స్పెషల్ వార్డ్‌లో చేర్పించండి. వాళ్ళకు సంబంధించిన కుటుంబాలవారికి కబురు పెట్టండి. వీలయితే మన వెహికల్స్ పంపి తీసుకు రండి. వాళ్ళ ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చు మనమే భరిస్తామని హాస్పిటల్‌లో ఇన్‌ఫార్మ్ చేయండి" చెప్పాడు.

ఇదంతా శోధన వింటూనే వుంది. తన కెమెరాలో రికార్డు చేస్తోంది కూడా.

చీఫ్ డాక్టర్ రూంలో కూచున్నాడు హోమ్‌మినిస్టర్.

ఎందుకో మొదటిసారి అతను తీవ్ర ఉద్వేగానికి లోనవుతున్నాడు, యాక్సిడెంట్‌లో గాయపడినవారిని పరామర్శించాడు. ప్రాణం ఎవరికైనా గొప్పదే... అన్న జీవితసత్యం తెలుసుకోవడానికి అతనికి చాలా టైం పట్టింది. అధికారం, రాజకీయం తన కళ్ళ ముందు పొరలుగా ఏర్పడ్డాయి. కంటి ముందు వున్న ఆ పొరలే చాలామంది రాజకీయ నాయకులను కళ్ళున్న అంధులుగా మారుస్తున్నాయి.

బయట కారిడార్‌లో నిలబడి వుంది శోధన. గాయపడిన వారి బంధువులు వచ్చారు. వారితో హోమ్‌మినిస్టర్ మాట్లాడుతున్నారు, వారికి ధైర్యం చెపుతున్నారు.

హోమ్‌మినిస్టర్‌లోని మార్పును గమనిస్తోంది శోధన. బహుశా కొడుక్కి జరిగిన యాక్సిడెంట్ అతనిలో మార్పు తీసుకువచ్చి వుంటుంది.

ఇక తనకు ఇక్కడ పనిలేదు అనిపించింది... ఎందుకంటే బాధితులకు హోమ్‌మినిస్టర్ న్యాయం చేస్తాడు. ఒక్కసారి పశ్చాత్తాపంతో మారినవాడు మరోసారి తప్పు చేయడు.

తను వెళ్లిపోవాలి తను చేయవలసిన ముఖ్యమైన పని మరోటి వుంది.

ఎందుకో వెళ్ళే ముందు ఒక్కసారి వైదేహిని కలిసి వెళ్లాలని అనిపించింది. మళ్ళీ ఈ టైంలో డిస్ట్రబ్ చేయడం ఎందుకు అనిపించింది. హాస్పిటల్ బయటకు వెళ్లబోతుంటే ఎవరో పిలిచినట్టు అనిపించింది. వెనక్కి తిరిగి చూస్తే హోమ్‌మినిస్టర్.

"ఒక్కసారి నాతో రాగలరా?" అడిగాడు హోమ్‌మినిస్టర్

మౌనంగా అతడిని అనుసరించింది శోధన.

❖ ❖ ❖

అదే సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగి బయటకు వచ్చాడా యువకుడు.

పదేళ్ళ క్రితం అదే స్టేషన్‌లో ఆకలితో వారం రోజులు కడుపును కాళ్ళలో పెట్టుకుని, ఆకలి బాధను పంటి బిగువున అనుభవించిన వ్యక్తి అతను. బన్ కోసం చిల్లర వెతుక్కుని అవి లేక పంపులో నుంచి వస్తోన్న వేడినీళ్ళు తాగిన దృశ్యం గుర్తొచ్చింది.

అతను స్టేషన్ బయటకు వచ్చి ఓ ఆటోవాలాకు ఓ ఫోటో చూపించి "ఈ అమ్మాయి మీకు ఎక్కడైనా కనిపించిందా?" అని అడిగాడు.

అతని పేరు విశ్వక్...

అతని చేతిలో వున్న ఫోటో శోధనది...

బ్రహ్మదేవుడు తథాస్తు దేవతల వంక చూసాడు.

బ్రహ్మదేవుడు తను రాయకుండా వదిలేసిన శోధన తలరాతను రాయడానికే వచ్చాడా?

హోమ్‌మినిస్టర్ శోధన వైపు చూసాడు. చాలా చిన్న వయసు, తన రాజకీయ అనుభవమంత కూడా లేని వయసు. కానీ ఆ కళ్ళలో పట్టుదల కనిపిస్తోంది. నిజాయితీ కనిపిస్తోంది.

"చెప్పమ్మా, తప్పు జరిగిపోయింది, ఆ తప్పుకు ఇప్పుడు హాస్పిటల్‌లో వున్న నా బిడ్డను పోలీసులకు సరెండర్ చేసి అరెస్ట్ చేయించమంటావా? హోమ్ మినిస్టర్‌గా అధికారంతో అడగడం లేదు, ఒక తండ్రిగా అడుగుతున్నాను. ఈ యాక్సిడెంట్‌లో గాయపడ్డవారికి పూర్తి న్యాయం చేస్తాను. ఒక వేళ వారు ప్రాణాలు కోల్పోతే నేనే స్వయంగా నా బిడ్డను పోలీసులకు అప్పగిస్తాను. అలా కాక ఈ సమస్య సమసిపోతే నా బిడ్డ తప్పును నేను సరిదిద్దుతాను. అంతేకాదు హోమ్ మినిస్టర్‌గా ఈ యాక్సిడెంట్స్‌కు అడ్డుకట్ట వేస్తాను, అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాను చట్టాన్ని కట్టుదిట్టం చేస్తాను. పబ్స్ విషయంలో, స్పీడ్ డ్రైవ్ విషయంలో, డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కేర్ తీసుకుంటాను. ఇది ఓ రాజకీయ నాయకుడి వాగ్దానం కాదు. ఓ తండ్రిగా నా తప్పును సరిదిద్దుకుని, హోమ్‌మినిస్టర్‌గా నా బాధ్యత నిర్వహించుకోవాలనే స్వార్థం. నువ్వెవరో కానీ జనం కోసం అర్ధరాత్రి ధైర్యంగా వచ్చావు, నా బిడ్డకు రక్తం ఇస్తోన్న ఆ మహాతల్లి ఎవరో కానీ నా బిడ్డను బ్రతికిస్తోంది. ఇంత కంటే చెప్పటానికి ఏమీ లేదు తర్వాత నీ ఇష్టం" హోమ్‌మినిస్టర్ తను చెప్పవలిసింది చెప్పాడు.

నిర్ణయాన్ని శోధనకు వదిలి పెట్టాడు.

శోధన ఎక్కువగా ఆలోచించలేదు. హోమ్‌మినిస్టర్ చెప్పినదానిలో ఉన్న నిజాయితీ గురించి ఆలోచించింది. కొన్నిసార్లు చట్టం కన్నా, ధర్మం ముఖ్యం. మారిన మనిషిని నిలదీయడం కన్నా అభినందించడం సంస్కారం అన్న ఓ రచయిత మాటలు గుర్తు చేసుకుంది.

తను చేయవలిసిన పనులు చాలా వున్నాయి. వాటికి హోమ్‌మినిస్టర్ సహకారం కూడా తనకు అవసరం.

తెలివైనవారు శత్రువులు లేకుండా చేసుకోవాలి.

"సార్... నేను వచ్చిన పని పూర్తయింది. మీ మాటలు నమ్ముతున్నాను. మీ అబ్బాయి త్వరగా కోలుకోవాలని, ఈ ప్రమాదంలో ఎవరూ విషాదంలోకి

వెళ్ళకూడదనీ కోరుకుంటున్నాను. మీలా ప్రతి మంత్రీ ఆలోచిస్తే చాలా సమస్యలు సమసిపోతాయి. మాలాంటి వాళ్ళ అవసరమే ఉండదు ఈ సమాజానికి. వస్తాను సర్” అంది రెండు చేతులు జోడిస్తూ.

ఆ రెండు చేతులు పట్టుకుని “కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియడం లేదు. నాకు ఆడపిల్ల వుంటే నా బిడ్డ నీలానే వుండేదేమో! నీకు ఎప్పుడైనా నాతో పనిపడితే నిస్సంకోచంగా అడుగు. నీకు తండ్రిలాంటివాడిని, నాకు కొడుకుతో పాటు కూతురు కూడా వుందని అనుకుంటాను” సిన్సియర్‌గా అన్నాడు.

“థాంక్యూ... నేను అడిగానని వైదేహి మేడంతో చెప్పండి” అంటూ ఇందాకా పంజాగుట్ట సెంటర్‌లో తీసిన వీడియో క్లిప్స్ చిప్ హోమ్‌మినిస్టర్‌కు ఇస్తూ ఇక వీటితో పని లేదు” అంది.

నడిచి వెళ్తోన్న అగ్నితేజాన్ని చూస్తున్నాడు బయటకు వెళ్తోన్న శోధన వైపు చూస్తూ.

ఆ క్షణమే స్ట్రిక్ట్‌గా ఉత్తర్వులు తయారయ్యాయి.

ఒకటి అర్ధరాత్రి దాటకముందే పబ్స్ క్లోజ్ అవ్వాలి. తాగి డ్రైవ్ చేస్తే వెంటనే ఎలాంటివారైనా అరెస్ట్ చేయాలి, ఆ వెహికిల్ సీజ్ చేయాలి. ముఖ్యంగా అమ్మాయిలను వేధించే వారిపట్ల సీరియస్ యాక్షన్ తీసుకోవాలి. వైదేహి తన దగ్గరికి వచ్చిన విషయం గుర్తొచ్చింది.

ఒక సంచలనాత్మక మలుపుకు ఆ సంఘటన ఒక కారణం అయింది.

❖ ❖ ❖

స్మార్ట్ డిటెక్టివ్ ఏజెన్సీ...

చాలామందికి పరిచయం లేని పేరు అది. డిటెక్టివ్ అనే పదం ఒకపుడు అపరాధ పరిశోధన నవలల్లో మాత్రమే కనిపించేది. కానీ నయా జమానాలో వీటి పాత్ర, ప్రాముఖ్యత పెరిగిపోయింది. ఒకప్పుడు నేరస్తులను పట్టుకోవడానికి మాత్రమే ఉపయోగపడేవి ఈ డిటెక్టివ్ సంస్థలు. కానీ ఇపుడు జనాలు చాలా పనులకు ఉపయోగించుకోవడం ప్రారంభించడం వలన ఈ డిటెక్టివ్ సంస్థలు కూడా ఒక పరిశ్రమలా మారాయి.

రజనీ పండిట్ లాంటి మహిళా డిటెక్టివ్‌లు ఈ 'డిటెక్టివ్' అనే పేరుకు న్యాయం చేస్తున్నారు.

ఆఫీసులో స్టాఫ్ మీద, పెళ్లి చేసుకోబోయే వధూవరులు ఒకరి మీద మరొకరు నిఘా వేసుకువడానికి కూడా డిటెక్టివ్ ఏజెన్సీ ఒక ఫ్లాట్ ఫాంగా మారింది.

కార్పొరేట్ ఆఫీసులలో స్టాఫ్ మీద నిఘా వేయడం దగ్గరి నుంచి భర్త/ భార్యలు ఏం చేస్తున్నారో తెలుసుకోవడం వరకూ డిటెక్టివ్‌లు సహాయపడుతున్నారు.

అలా మూడేళ్ళ క్రితం మొదలైంది ఈ స్మార్ట్ డిటెక్టివ్ ఏజెన్సీ.

చాలా కేసుల్లో విజయం సాధించింది. ముఖ్యంగా తన క్లయింట్ నమ్మకాన్ని వమ్ము చేయలేదు. అందుకే విశ్వసనీయత కోసం ఆ డిటెక్టివ్ ఏజెన్సీని నమ్ముకుంటున్నారు చాలామంది ఈనాడు.

ఉదయం పదిగంటలు...

రిసెప్షన్‌లో వున్న మాధురి ఆ వారం స్వాతి వీక్లీ తిరగేస్తోంది. అందులో వచ్చే 'ఈ శీర్షిక మీదే' అంటే ఆమెకు చాలా ఇష్టం. అందులో ఎన్నో సరదా ప్రశ్నలు, సమాధానాలు ఉంటాయి. అవి చదవడం సరదా ఆమెకి. సరిగ్గా అప్పుడే మిసెస్ మన్మథరావ్ లోపలికి వచ్చింది. నలభై ఏళ్ళు వుంటాయి. అయినా ముప్ఫయిలా కనిపించాలన్న తాపత్రయం ఆమెలో కనిపిస్తుంది.

ఆమెను చూడగానే గుర్తు పట్టింది మాధురి.

"హలో మేడం, ఎలా వున్నారు?" అడిగింది చిరునవ్వుతో.

"ఫైన్. డిటెక్టివ్ సాగరిక లేరా?" అడిగింది మిసెస్ మన్మథరావ్.

"వస్తారు. పార్కింగ్‌లో మేడం పార్క్ చేసిన స్కూటీలో నుంచి ఎవరో మేడం గాగుల్స్ కొట్టేసారు. అవి సింగపూర్ నుంచి మేడం బావ పంపించినవి. ఆ కేసు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు" అంటూ చిన్నగా నవ్వి "మేడం, మీరు స్వాతిలో ఈ శీర్షిక మీరు చదువుతారా?" అడిగింది ఉత్సాహంగా.

"అప్పుడప్పుడు. ఏం?" అడిగింది మిసెస్ మన్మథరావ్.

"డిటెక్టివ్ షాకయ్యేదెప్పుడు? ప్రశ్నకు సమాధానం తన బైక్‌ను ఎవరో కొట్టేసినపుడు" అని నవ్వింది.

అపుడే డిటెక్టివ్ సాగరిక అక్కడికి వచ్చింది. ఎదురుగా కనిపిస్తున్న మిసెస్ మన్మథరావ్‌ని చూస్తూ "గుడ్ మార్నింగ్ మేడం. నేనే మిమ్మల్ని కలుద్దామని అనుకున్నాను. ఈలోగా..."

"మీ గాగుల్స్ పోయాయా?" నవ్వుతూ అడిగింది మిసెస్ మన్మథరావ్.

సాగరిక మాధురి వంక చూసింది.

"సారీ మేడం, ఏదో సరదాకి" నసిగింది మాధురి.

సాగరిక అదేమీ పట్టించుకోకుండా "రండి మేడం" అంది. ఇద్దరూ లోపలి నడిచారు.

"చెప్పండి మేడం, మీకు పూర్తి రిపోర్ట్ ఇచ్చాను. రికార్డు వాయిస్ కూడా వుంది. ఇప్పుడు ఏం చేద్దామని అనుకుంటున్నారు?" అడిగింది సాగరిక.

"ఏం చేయమంటారు?" అడిగింది మిసెస్ మన్మథరావ్.

"నేనెలా చెప్పగలను మేడం, కొందరు ఈ ఆధారాలను విడాకుల కోసం ఉపయోగించుకుంటారు, మరికొందరు భర్తను దారిలోకి తెచ్చుకోవడానికి ఇంకొందరు..." అని ఆగింది సాగరిక.

"చెప్పండి సాగరిక, ఇంకొందరు?"

ఒక్క క్షణం మౌనంగా వుండిపోయి అప్పుడు చెప్పింది సాగరిక.. "బ్లాక్ మెయిల్ చేయడానికి."

"నేను నా భర్తను, ఈ సాక్ష్యాలను అందుకోసం ఉపయోగించుకోవాలని అనుకుంటున్నాను" అంది మిసెస్ మన్మథరావ్.

ఒక్క క్షణం ఏం మాట్లాడలేకపోయింది సాగరిక. ఎందుకంటే తాము ఇచ్చే సాక్ష్యాలను చట్ట విరుద్ధంగా ఉపయోగించుకోవడానికి సాగరిక వ్యతిరేకం.

మన్మథరావ్‌కు బుద్ధి చెప్పడానికో, తన కాపురం చక్కదిద్దుకోవడానికో, లేదా చట్టపరంగా విడిపోవడానికో తను సేకరించి సాక్ష్యాలు ఉపయోగించుకుంటుందనుకుంది ఈమె. కాదు ఎవరికైనా అలా ఉపయోగపడాలని మాత్రమే కోరుకుంటుంది సాగరిక.

కానీ ఈవిడేవిటిలా మాట్లాడుతోంది. ఇలా అతడిని బ్లాక్ మెయిల్ చేసి ఏం చేస్తుంది?

"ఏంటి సాగరిక, ఆలోచిస్తున్నారు? కట్టుకున్న భర్తను బ్లాక్ మెయిల్ చేస్తానన్న నన్ను చూస్తోంటే ఆశ్చర్యంగా ఉందా?" అడిగింది.

"ఈ ప్రపంచంలో ఆశ్చర్యం కలిగించే విషయాలు మాయమయ్యాయి మేడం! ఒక మనిషి నిజాయితీగా వుంటే ఆశ్చర్యం, ఒక వ్యక్తి నిజాయితీగా ప్రేమిస్తే ఆశ్చర్యం" అంది నిర్లిప్తంగా సాగరిక.

"ఒక మనిషిని చంపేస్తే ఉరిశిక్ష విధిస్తుంది మన న్యాయస్థానం. మరి ఒక మనసును చంపేస్తే ఏ శిక్ష వుండాలి సాగరికా? మీరేమైనా చెప్పగలరా?" అడిగింది మిసెస్ మన్మథరావ్.

ఆ ప్రశ్న అర్థం కానట్టు చూసింది సాగరిక.

"నా భర్త ఉమనైజర్ అయితే పెద్దగా బాధపడను. కానీ ఒక బ్రోకర్ అయితే, ఒక హంతకుడు అయితే, అమ్మాయిల బలహీనతలతో ఆడుకొని, వాడుకుని, వారిని విదేశాలకు అమ్మేస్తోంటే?" సూటిగా అడిగింది.

"మీరు నా భర్త ఒకమ్మాయితో మాట్లాడిన మాటలు వినిపించారు, ఫోటోలు సంపాదించారు, సాక్ష్యాలు ఇచ్చారు. కానీ ఆ అమ్మాయి నేను నియమించిన అమ్మాయే అని మీకు తెలుసా? ఆమె ఒక సెక్స్ వర్కర్, మన్మథరావ్ లాంటి వాళ్ళ చేతుల్లో మోసపోయిన అమ్మాయి" అంటున్న ఆమె మాటలకి షాకింగ్‌గా చూసింది సాగరిక.

"అవును నేను చెప్పేది నిజం సాగరికా! ఒకప్పుడు మన్మథరావ్ చేతిలో మోసపోయిన మరో అమ్మాయి వత్సల... అంటే నే..నే" చెప్పింది నిశ్శబ్దాన్ని శబ్దంగా మారుస్తూ.

సాగరిక మౌనంగా ఉండిపోయింది.

"ఈ ప్రపంచంలో ఏ మగాడైనా అమ్మాయిల విషయంలో సెక్స్ పరంగానే ఆలోచిస్తారన్న నమ్మకం నాది. కొందరు మగాళ్ళు ఇందుకు మినహాయింపు కావచ్చు. ప్రేమ పేరుతో మోసం చేసి మొహం చాటేసే వారిని క్షమించవచ్చేమో కానీ ఆ ప్రేమను అడ్డు పెట్టుకుని అమ్మాయిల అవసరాలను, బలహీనతలను కాష్ చేసుకోవాలని అనుకునేవారిని క్షమించకూడదు సాగరిక" అంటూ ఒక్క నిమిషం మౌనంగా ఉండి, "నా భర్త కేవలం నన్ను మోసం చేసి పరాయి వ్యక్తితో సంబంధం పెట్టుకుంటే భార్యగా స్పందిస్తాను లేదా నిస్సహాయంగా నాలో నేనే

కుమిలిపోతాను. కానీ నాలాంటి అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటూ వుంటే ఒక మహిళగా స్పందిస్తాను, భద్రకాళిలా వాళ్ళ అంతు చూస్తాను."

ఆమె మాటల్లో కోపం కంటే ఆవేదన కనిపించింది సాగరికకి. వెంటనే "సారీ మేడమ్, మీరు కేవలం మీ భర్త ఎఫైర్స్ తెలుసుకోవడానికే ప్రయత్నిస్తున్నారని అనుకున్నాను. మిమ్మల్ని హర్ట్ చేసి ఉంటే క్షమించండి. మీరు చేస్తున్న పని మంచిదే. ఎవిడెన్స్ మీ దగ్గరే వున్నాయి. ఇప్పుడు నేనేం చేయాలో చెప్పండి" సిన్సియర్‌గా అంది సాగరిక.

ఏం చేయాలో చెప్పింది మిసెస్ మన్మథరావ్.

"వన్ సెకన్ మేడం.." అంటూ పర్స్‌లో నుంచి డబ్బు తీసి ఇచ్చింది.

"ఇదేమిటి?" అడిగింది వత్సల

"మీరు ఇచ్చిన ఫీజు. మీరు చేస్తున్న మంచి పనికి ఫీజు తీసుకోకూడదని నిశ్చయించుకున్నాను" చెప్పింది సాగరిక.

"ఆ డబ్బు మన్మథరావ్‌దే! మీరు ఇలాంటి మంచి సంస్థలు నడపాలంటే డబ్బు వుండాలి కదా! అలాగే మీ కష్టానికి తగిన ఫలితమూ వుండాలి. కాదనకుండా తీసుకోండి" అంటూ లేచింది వత్సల.

ఫస్ట్ కిక్.. కాస్ట్లీ పబ్. రాత్రి పది దాటి పది నిముషాలు...

కుర్రకారుకు కిక్కు ఎక్కించి వాళ్ళను మరో ప్రపంచంలోకి తీసుకువెళ్ళే స్వర్గంలాంటి నరకం.

బాగా డబ్బున్నవాళ్ళు, సెలబ్రిటీల పిల్లలు, చీకటి మాటున బిజినెస్ చేసేవారికి అది ఒక అడ్డా.

ఒక రాజకీయ నాయకుడి బినామీ అది. ఆ పబ్‌ను టచ్ చేయాలంటే పోలీసులైనా కొద్దిగా ఆలోచిస్తారు. అక్కడ నిబంధనలు ఎన్నికల్లో రాజకీయ నాయకుల వాగ్దానాల్లాంటివి.

ఆ పబ్ ముందు మన్మథరావ్ కారు ఆగింది. అందులో నుంచి మన్మథరావ్ దిగాడు. ఆ వెనుకే గీతిక దిగింది.

"అమ్మో! నాకు భయంగా ఉంది" అంది ఆ వాతావరణాన్ని చూసి కళ్ళను చక్రాల్లా తిప్పుతూ గీతిక.

"భయమెందుకు? కాఫీ హౌస్‌లో నుంచి పబ్ వరకూ వచ్చాం అంటే దీన్నిబట్టి నీకు ఏం అర్థమైంది?" అడిగాడు మన్మథరావ్ గీతిక నడుం చుట్టూ చేయి వేసి దగ్గరికి లాక్కుంటూ.

"కాఫీ హౌస్‌కు వెళ్తే, తర్వాత పబ్‌కు వెళ్ళొచ్చని" అమాయకంగా అంది గీతిక.

ఒక్క క్షణం తల పట్టుకుని "అలా కాదు బంగారం! నువ్వు బాగా ఇంప్రూవ్ అయ్యావని, మన రిలేషన్‌షిప్ బెడ్ రూం వరకూ వచ్చిందని దాని అర్థం" పబ్‌లోకి ఆమెను తీసుకువెళ్తూ అన్నాడు.

"అమ్మో! నాకు భయం" అంది భయం నటిస్తూ.

"ఒక్కసారి నేను చెప్పినట్టు వింటే భయం పారిపోతుందిలే! పద పబ్‌లో వున్న మజా చూపిస్తాను" ఆమె వంక చూస్తూ అన్నాడు.

పబ్ వాతావరణం మరో ప్రపంచాన్ని తలపిస్తోంది.

ఓ పక్క ఆకలి కేకలు, కుప్పతొట్టిలో అన్నం వెతుక్కునే దృశ్యాలు. మరో పక్క ఫైవ్ స్టార్ హోటల్స్. ఒకరిది ఆకలి సమస్య, మరొకరిది కోరిక సమస్య. లైట్స్, మ్యూజిక్, ఏరులై పారే మద్యం, నాన్ వెజ్ ఘుమ ఘుమలు... ఆ ప్రపంచమంతా మరో రంగులో కనిపిస్తుంది. చూసేవారికి వినోదం... అనుభవించే వారికి స్వర్గమే అది.

రూల్స్‌కు విరుద్ధంగా కూడా అక్కడ సౌకర్యాలు కరెన్సీకి దొరుకుతాయి.

అందమైన వెయిట్రెస్‌లు డబ్బున్న మగాళ్ళ వీక్నెస్‌లను కాష్ చేసుకోగలిగే గొప్ప వ్యాపారం.

అక్కడ తాగుతున్నారు, తూలుతున్నారు, అరుస్తున్నారు, అమ్మాయిలతో చిందేస్తున్నారు.

కరెన్సీ వరదలా ముంచెత్తుతున్నది. చీకటి బేరాలు, నేరాల మీటింగ్‌లు అక్కడ షరా మామూలే.

ఆ పబ్‌ను సీజ్ చేసే ధైర్యం చేయలేదు ఎవ్వరూ ఇప్పటిదాకా... ఎందుకంటే అలా ధైర్యం చేసినవాళ్ళు ఆఫీసర్లు అయితే యాక్సిడెంట్‌లో చచ్చిపోతారు.

మంత్రులైతే పదవులు కోల్పోతారు. ఇదీ ఆ పబ్ చరిత్ర. అసలు ఆ పబ్ చతుర్వేదిది. రాజకీయమనే ముసుగులో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్న వ్యక్తి చతుర్వేది.

అతనికి ఉచ్ఛనీచాలు తెలియవు... డబ్బుకు ఏ రిలేషన్సూ వుండవు.

డబ్బుతో తప్ప... అతనికి ఏ రిలేషనూ లేదు. డబ్బు... డబ్బు... డబ్బు అతనికి నచ్చిన మూడు విషయాలూ డబ్బే! అందుకే అతను ఏ పదవిలోనూ వుండటానికి ఇష్టపడడు.

సి.యం పదవిని ఆఫర్ చేసినా సున్నితంగా తిరస్కరించాడు. సి.యం అయినా ప్రతిపక్షాలకు భయపడాలి. ప్రతి దానికీ సమాధానం చెప్పుకోవాలి, స్వపక్షంలోని వ్యతిరేక వర్గాన్ని దారిలో పెట్టుకోవాలి. హైకమాండ్‌కూ భయపడాలి. కానీ రాజకీయ నాయకుడు అవతారంలో తను ఎవరికీ భయపడవలసిన అవసరం లేదు. తన దగ్గర వున్న డబ్బు అందరినీ తనకే భయపడేలా చేస్తుంది.

ఏ పార్టీ అధికారంలో వుంటే వారికి చతుర్వేది నుంచి నిధులు సునామీలా తరలి వెళ్తాయి.

ప్రతిపక్షాలకు, చివరికి స్వతంత్ర ప్రజా ప్రతినిధులకూ నిధులు వెళ్తాయి అతని ఖజానా నుంచి.

అందుకే అతడిని వేలెత్తి చూపే సాహసం ఎవరూ చేయరు. రాజకీయ నాయకుల పుత్రరత్నాలు, బిజినెస్ మేగ్నేట్స్ వంశాంకురాలు అక్కడ హాయిగా రిలాక్స్ అవుతూ ఉంటారు.

అక్కడ కూర్చున్న ఆ హైక్లాస్ కుర్రాళ్ళ కళ్ళు అందమైన వెయిట్రెస్ మీద పడ్డాయి. "ఏయ్ బ్యూటీ" ఒకడు పిలిచాడు.

వెయిట్రెస్ వచ్చింది "యస్ సార్!" అంది.

"నిన్ను చూస్తుంటే ఫుల్ కొట్టినంత కిక్ వస్తోంది. నాతో డాన్సు చేస్తావా?" అడిగాడు ఓ రాజకీయ నాయకుడి కొడుకు.

"సారీ సార్.. మీకు ఏ డ్రింక్ కావాలో చెప్పండి సర్వ్ చేస్తాను."

"నాకు నీ అందం అనే డ్రింక్ కావాలి" చెప్పాడతను.

ఆ వెయిట్రెస్ అక్కడి నుంచి వెళ్ళబోయింది. ఇక్కడికి వచ్చేవాళ్ళు అంతా బిగ్ షాట్స్ అని తెలుసు. వారితో గొడవ పడే సాహసం ఎవరూ చేయరు. విధి

లేని పరిస్థితిలో అక్కడ పని చేయడానికి వచ్చింది ఆమె. కానీ ఆమెకి తెలుసు ఇలాంటి కామెంట్స్ నుంచి తప్పించుకోవడం తనకి కష్టమే అని. ఒక్కోసారి అడ్వాన్స్ అవుతారు.

ఒక్క క్షణం అ అమ్మాయికి ఏడుపు వచ్చింది. ఎక్కడ చూసినా ఈ ఎక్స్ప్లాయిటేషన్ తప్పదా?

"ఏయ్ బ్యూటీ! నాక్కావలసిన డ్రింక్ ఇవ్వనే లేదు" అక్కడికీ వచ్చాడు ఇందాకటి వ్యక్తి. అతని తండ్రి పేరున్న రాజకీయ నాయకుడు. తండ్రి రాజకీయ పలుకుబడిని తన కోరికలకు పెట్టుబడిగా పెట్టుకుంటాడు.

అతని పేరు వివేక్. అందరూ విక్కీ అంటారు.

"హలో విక్కీ! ఏమిటి ఏదో డ్రింక్ అంటున్నావు. మాకూ ఇస్తే మేమూ సిప్ చేస్తాంగా" అతని మిత్ర బృందం వచ్చింది.

"నాకు ఈ అమ్మాయి అందాన్ని డ్రింక్‌లా సిప్ చేయాలని వుంది" చెప్పాడు విక్కీ.

"ఓహ్ నువ్వెంత లక్కీ! మా విక్కీ నిన్ను సిప్ చేస్తాడట. నీ టెన్ ఇయర్స్ శాలరీ ఒక్క నైట్‌కే వస్తుంది" అన్నారు కోరస్‌గా.

ఆ అమ్మాయికి ఏడుపు వచ్చేసింది. కేవలం తండ్రిని బ్రతికించుకోవడానికి ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశపడి ఈ పబ్‌లో చేరింది.

ఆ అమ్మాయికి ఏడుపు తన్నుకు వచ్చేస్తోంది. అంతే! పరుగున వాష్‌రూంలోకి వెళ్ళింది. గోడకు చేరగిలబడి ఏడుస్తోంది.

"రేయ్! మనవాడిని రమ్మని హింట్ ఇచ్చేసిందిరా. బెడ్‌రూం కన్నా వాష్‌రూం బెటర్ అని వెళ్ళింది. విక్కీ నువ్వు లక్కీ రా!" అంటూ ఫ్రెండ్స్ వెకిలి కామెంట్స్ చేసారు. విక్కీ అప్పటికే మూడో రౌండ్‌లో వున్నాడు. ఒకమ్మాయిని పైశాచికంగా హింసించడమే కిక్ అనే భ్రమలో వున్నాడు. విక్కీ అడుగులు వాష్‌రూం వైపు కదిలాయి.

అదే సమయంలో...

"యువర్ ఆర్డర్ ప్లీజ్ " అంటూ అడిగింది తన ఎదురుగా వున్న మన్మథరావ్‌ని శోధన.

వెయిట్రెస్ గెటప్‌లో వుంది.

"వైన్ కన్నా విమెన్ ఎక్కువ కిక్ ఇస్తుందని విన్నాను, ఇప్పుడు చూస్తున్నాను... స్లీపింగ్ పిల్స్ వేసుకోకపోయినా మత్తు ఎక్కించే బ్యూటీ మీది" మన్మథరావ్ శోధనకు మాత్రమే వినిపించేలా కామెంట్ చేసాడు.

"పాయిజన్ కూడా మంచి కిక్ ఇస్తుంది. వైన్‌లో మిక్స్ చేసి తెమ్మంటారా?" చిన్నగా అతనికి మాత్రమే వినిపించేలా అంది.

ఆ మాటలు విని ఒక్క క్షణం షాకయ్యాడు. తనతో అంత ధైర్యంగా చెప్పిన వాళ్ళను అతను ఇంతవరకు చూడలేదు.

కోపంతో ఏదో అనబోయాడు... అప్పుడే గీతిక వాష్‌రూంలోనుంచి వచ్చింది. వస్తోనే "సార్! వాష్‌రూంలో ఎవరో అమ్మాయి ఏడుస్తోంది... నేను బయటకు వస్తోంటే కొందరు మగాళ్ళు లేడీస్ టాయిలెట్ వైపు వెళ్తున్నారు" అంటూ చెప్పింది.

ఆ మాటలు శోధన చెవిని చేరిన మరుక్షణమే రియాక్టయింది. వేగంగా ముందుకు కదిలింది. శోధన చేతిలోని కర్చీఫ్ కింద పడింది. అది గమనించిన గీతిక "మేడం, మీ కర్చీవ్" అంది, కింద పడిన కర్చీఫ్‌ని శోధనకు తీసి ఇస్తూ దాని మీద "యస్" అన్న అక్షరాలు ఎంబ్రాయిడరీ చేసి వున్నాయి.

"మేడం 'యస్' అంటే ఏమిటి?" అడిగింది గీతిక ఆ కర్చీఫ్ వంక, దాని మీద వున్న ఆ 'యస్' అన్న అక్షరాల వంక చూస్తూ.

"యస్ అంటే సత్యం ది ట్రూత్..." అంటూ వాష్‌రూం వైపు వెళ్ళింది.

వెయిట్రెస్ ఆగకుండా కారుతున్న కళ్ళ నీళ్ళని తుడుచుకుంది... ఇంక ఈ ఉద్యోగానికి గుడ్ బై చెప్పాలి. ఇలా భయంతో బ్రతకకూడదు అనుకుంది. లేచి వాష్ బేసిన్ దగ్గరికి వచ్చి మొహం కడుక్కుంటూ ఉలిక్కిపడింది. అద్దంలో కనిపిస్తున్న మనిషిని చూస్తూ.

"హలో బ్యూటీ!" అన్నాడు.

ఆమె మొహం ఎర్రగా మారింది. లేడీస్ టాయిలెట్‌లో మగాడు.

"ఏం చేయను బ్యూటీ! నువ్వు ఎక్కడుంటే నేను అక్కడే కదా! నువ్వే కదా ఇక్కడికి వచ్చావు. నీలాంటి బ్యూటీని షేర్ చేసుకోవడం ఇష్టం లేక నేనొక్కడినే

వచ్చాను." వాష్‌రూం తలుపు వేయబోతూ అన్నాడు.

ఆ అమ్మాయి భీతావహరిణి అయింది. భయంతో ఒక్కో అడుగు వెనక్కి వేస్తోంది. అప్పుడే వాష్‌రూం తలుపు తెరుచుకుంది.

శోధన లోపలికి వచ్చింది. క్షణాల్లో అక్కడి సిట్యుయేషన్ అర్థమైంది.

ఆ అమ్మాయి వైపు చూసింది... వణికిపోతోంది.

"నువ్వెళ్ళు.." చెప్పింది శోధన.

"హే హలో... ఎవరు నువ్వు? మధ్యలో నీ కమాండ్ ఏమిటి? ఇక్కడ శోభనం కోసం వెయిటింగ్" వెకిలిగా అన్నాడు విక్కీ.

"నేనున్నాగా మై హునా?" అని చిలిపిగా కన్నుగీటింది. "ఏం ఆ అమ్మాయి కన్నా అందంగా లేనా నేను?" అంటూ ఆ అమ్మాయి వైపు తిరిగి వెళ్ళమని సైగ చేసింది.

ఆ అమ్మాయి రెండు చేతులు జోడించి అక్కడి నుంచి వెళ్ళింది.

శోధన హ్యాండ్ బాగ్‌లో నుంచి స్కార్ఫ్ తీసి మొహాన్ని కవర్ చేసుకుంది.

"ఏంటి సిగ్గా? స్కార్ఫ్‌లో కూడా అందంగా వున్నావు" అంటూ విక్కీ శోధన దగ్గరికి వచ్చాడు.

"ఆడపిల్లలు అంటే నీకు ఇంత చులకనా?" అడిగింది శోధన.

"ఆడపిల్ల, అగ్గిపుల్ల ఈ రెండూ వెలిగి, వెలుగుని ఇచ్చి ఆరిపోవడానికే" శోధన దగ్గరకి వస్తూ అన్నాడు విక్కీ.

"ఇప్పటి వరకూ ఎన్ని అగ్గిపుల్లలను గీసి పారేశావు?" శోధన అడిగింది.

"ఒక అగ్గిపెట్టె ఖాళీ అయింది. రెండో అగ్గిపెట్టెలో మొదటి అగ్గిపుల్లవి నువ్వే" నవ్వుతూ శోధన దగ్గరికి వచ్చాడు.

"అగ్గిపుల్ల ఒక్కసారి వెలిగి ఆరిపోయేలోగా తలచుకుంటే ఈ ప్రపంచాన్నే తగలబెడుతుంది" ఒక్కో అడుగు ముందుకు వేస్తున్న విక్కీ వంక చూస్తూ అంది.

అప్పటికే అతను శోధన దగ్గరికి వచ్చాడు. శోధన చేయి హ్యాండ్‌బాగ్‌లోకి వెళ్ళింది. లోపల వున్న పెన్ నైఫ్‌ని బయటకు తీసింది. చాలా షార్ప్‌గా వుంది. ఆమె చేయి వేగంగా కదిలింది.

ఆ వాష్‌రూంలో పెద్ద కేక.. హృదయవిదారకమైన కేక... రక్తం ఫౌంటెన్‌లా చిమ్మింది.

శోధన మొహం వాష్‌రూంలోని ఎడమ వైపుకు తిరిగింది.

"మగాడు అంటే ఒక జెండర్. కానీ అదేదో అమ్మాయి శీలాన్ని గాయపరిచే పదునైన ఆయుధం అనుకునే వాడికి ఇలాంటి శిక్ష తప్పదు."

ఆమె మాటలు, అప్పటి వరకూ జరిగిన సంఘటన, శోధన స్కార్ఫ్‌లో మాట్లాడినప్పటి నుంచి అక్కడ వున్న సీక్రెట్ కెమెరాలో రికార్డ్ అవుతోంది.

వాష్‌రూం రక్తసిక్తం అయింది. అతని శరీరంలోని ఒక పార్ట్ ఛిద్రమైంది.

శోధన వెళ్తున్నప్పుడు పొరపాటున ఆమె చేతిలో వున్న కర్చీఫ్ కిందపడింది.

ఒక్కసారిగా రేగింది పబ్‌లో కలకలం.

వాష్‌రూంకు వచ్చిన ఎవరో అమ్మాయి రక్తం మడుగులో వున్న విక్కీని చూసి కెవ్వున కేకవేసింది. క్షణాల్లో ఆ సంఘటన పబ్ మొత్తం వ్యాపించింది. విక్కీ ఫ్రెండ్స్ భయంతో వణికిపోయారు.

చతుర్వేది పబ్‌లో హత్యాప్రయత్నం... అదీ ఒక బిగ్ షాట్ కొడుకు మీద. పబ్‌లోని జనం అంతా వాష్‌రూం దగ్గరికి చేరారు. తీవ్రమైన రక్తస్రావం... అమ్మాయిలు ఆ దృశ్యం చూడలేకపోయారు. మగవాళ్ళు ఒక్క క్షణం వణికిపోయారు.

ఇందాకటి అమ్మాయి ఆ దృశ్యాన్ని చూసి షాక్‌కు గురైంది. రక్తపు మడుగులో కొట్టుకుంటున్నాడు. అంబులెన్స్ వచ్చింది. పోలీసులు వచ్చారు.

అక్కడకి వచ్చిన మన్మథరావ్ అక్కడి దృశ్యంతో పాటు మరోటి చూసాడు. వాష్‌రూంలో కర్చీఫ్, దాని మీద 'యస్' అన్న అక్షరం. ఒక్క క్షణం అతని మెదడు మొద్దుబారింది.

అంటే... ఆ అమ్మాయి? అతని మెదడు బ్లాంక్‌గా మారింది. ఇప్పుడు తను దాని గురించి ఆలోచించి కూడా లాభం లేదు. అతను గీతిక వైపు చూసాడు. ఆమె కర్చీఫ్‌ని గుర్తించలేదు. తను గీతికను గెస్ట్ హౌస్‌కు తీసుకువెళ్ళాలి. ఆ తర్వాత అక్కడి నుంచి జర్దార్ ఆ అమ్మాయిని ఎక్కడికి తీసుకువెళ్ళాలో అక్కడికి తీసుకువెళ్తాడు అనుకుంటూ గీతికను బయటకు తీసుకువెళ్ళాడు.

విక్కీ తండ్రి కేంద్రంలో చక్రం తిప్పడానికి వెళ్ళాడు. తనకు కావలసిన టెండర్ దక్కించుకోవడానికి అతను డబ్బును, లేదా అమ్మాయిని ఎర వేస్తాడు. ఈ రెండింటితో కాక అప్పుడప్పుడు బ్లాక్‌మెయిల్‌తోనూ తన పనులు సాధించుకుంటాడు.

ఇప్పుడు ఆ పనిమీదే అతను వచ్చాడు. సరిగ్గా అప్పుడే కొడుక్కి జరిగిన పరాభవం వార్త అతనికి చేరింది. వెంటనే హుటాహుటిన వెనక్కి వచ్చేసాడు.

❖ ❖ ❖

అది కొందరి దృష్టిలో స్మశానం. ఇంకొందరి దృష్టిలో మరణానికి వీడ్కోలు చెప్పే చివరి మజిలీ. వైదేహి దృష్టిలో నిస్సహాయులకు నీడనిచ్చి, సేదతీర్చే అమ్మ ఒడి.

సమాధులు ఓ పక్క, కూరగాయల చెట్లు మరోపక్క, పూలచెట్లు ఇంకో పక్క, ప్రతి సమాధి అక్కడ ఓ కథ చెబుతుంది. ప్రతి కథా అక్కడ ఓ వ్యథ వినిపిస్తుంది.

అక్కడికి హెూమ్‌మినిస్టర్ కారు వచ్చి ఆగింది. కూరగాయలు కోస్తున్న వారు కొందరు, పూలు కోస్తున్న వారు మరి కొందరు, మొక్కలకు నీళ్ళు పోస్తున్న వాళ్ళు కొందరు.. ఉద్యానవనంలా కనిపిస్తోంది ఆ స్మశానవాటిక.

ఒక చల్లని ప్రదేశంలో ఉన్న సిమెంట్ బెంచీ మీద కూర్చొని వైదేహి తలసీమియా వ్యాధి గురించి, దాని తీవ్రత గురించి ఓ పత్రిక్కి ఆర్టికిల్ రాస్తోంది. తను చేసే ఈ అక్షర యుద్ధాన్ని ఎవరూ గుర్తించకపోయినా ఏదో ఓ రోజు దీని అవసరాన్ని గుర్తిస్తే చాలు అన్నది ఆమె ఫీలింగ్.

హెూమ్‌మినిస్టర్ కారు రావడంతో అక్కడ హడావుడి మొదలైంది.

ఆ రోజు హాస్పిటల్‌లో ఆ సంఘటన జరిగాక వైదేహి హెూమ్‌మినిస్టర్ కొడుక్కి రక్తం ఇచ్చి వెళ్ళిపోయింది. కనీసం తనకు కృతజ్ఞత చెప్పే అవకాశం కూడా ఆమె హెూమ్‌మినిస్టర్‌కు ఇవ్వలేదు.

వైదేహి ఎదురువెళ్ళి సాదరంగా ఆహ్వానించింది. రెండు చేతులూ జోడించి నమస్కరించాడు హెూమ్‌మినిస్టర్. అతని వెంట అతని కొడుకు కూడా వచ్చాడు.



బహుశా మృత్యుముఖం వరకూ వెళ్లి రావడం వల్ల కాబోలు, లేదా ఒక సంఘటన మన మీద ఒక్కోసారి తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది.

కారణం ఏదైనా అతను మారాడు. ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది ఆమెకి.

"మీ ఋణం తీర్చుకోలేను, ఏమీ చేయకుండా ఏదో ఆశించే ఈ రోజుల్లో ఎంతో చేసి ఏమీ ఆశించకుండా మౌనంగా ఈ స్మశానంలో కూర్చోని హాయిగా ఏదో రాసుకుంటున్నారు. స్మశానాన్ని సైతం నందనవనంగా మార్చారు. ఇక్కడ వుంటే ఎంతో ప్రశాంతంగా అనిపిస్తోంది. మీరు చేసే సేవల గురించి తెలుసు కున్నాను. మీకు ఏ సాయం కావాలన్నా నేను చేయగలను" మనస్ఫూర్తిగా అన్నాడు హోమ్‌మినిస్టర్ ధనంజయరావ్.

"అది మీ సహృదయం, మీరు మారటం మీ సంస్కారాన్ని సూచిస్తుంది. ఈ ప్రపంచంలో తప్పులు చేయనివారు ఎవరు? కానీ వాటిని సరిదిద్దుకునేవారే గొప్పవారు. మీరు ఈ రాష్ట్రానికి రక్షణమంత్రి. దీని శాంతి భద్రతలు మీ చేతుల్లో వున్నాయి. వాటిని కాపాడితే ఈ రాష్ట్రం ప్రశాంతంగా వుంటుంది" అంది వైదేహి.

హోమ్‌మినిస్టర్ కొడుకు నిరంజన్ వైదేహి పాదాలకు నమస్కరించాడు. ఆశ్రమంలో వున్నవాళ్ళు గులాబీమాలను అప్పటికపుడు తయారుచేసారు. దానిని

హోమ్‌మినిస్టర్‌కు ఇచ్చింది వైదేహి. అంతేకాదు స్వయంగా తను చేసిన పాయసం తెచ్చింది.

మొదటిసారి హోమ్‌మినిస్టర్‌కు ఎంతో హాయిగా ప్రశాంతంగా అనిపించింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పి ఇక్కడే వుండి పోవాలనుకున్నాడు.

సరిగ్గా అపుడే అతనికి ఫోన్ వచ్చింది.

ఆ ఫోన్ సిద్ధప్ప నుంచి.

పబ్‌లో చావుకు దగ్గరగా వెళ్ళిన విక్కీ తండ్రి.

"సరే వస్తున్నాను" చిరాగ్గా అనేసి ఫోన్ పెట్టేసాడు. తర్వాత వైదేహి వైపు తిరిగి వెళ్తున్నట్టు చెప్పాడు.

❖ ❖ ❖

శోధన ఫస్ట్ కిక్ పబ్ నుంచి బయటకు వచ్చింది. తన గురించి త్వరలో వేట మొదలవుతుందని తెలుసు, తనకు కావలిసింది అదే. తన టార్గెట్ ఎవరో తనే తెలుసుకోవాలి. యుద్ధంలో శత్రువు ఎవరో తెలియకుండానే ఆ శత్రువు కోసం చేస్తోన్న యుద్ధం అది.

స్కూటీ స్టార్ట్ చేసింది. ఈ రోజు తను వెతకవలిసిన ప్రాంతం గోల్కొండ... శోధన మెదడులో ఆలోచనలు తన స్కూటీ కన్నా వేగంగా పరిగెడుతున్నాయి. సిటీలోని ప్రతీ అంగుళం గాలించాలి, తన శోభన ఆచూకీ తెలుసుకోవాలి. శోధన స్కూటీ గోల్కొండ వైపు వెళ్తోంది. స్కూటీ అటు వెళ్ళగానే ఓ అమ్మాయి బయటకు వచ్చింది ఓ నంబర్‌కు డయల్ చేసింది.

"శోధన గోల్కొండ వైపుకు వెళ్తోంది జాగ్రత్త" అని చెప్పింది.

తర్వాత మొహానికి స్కార్ఫ్ కట్టుకుని పక్కనే పార్క్ చేసి వున్న కారు దగ్గరికి వెళ్లి కారు డోర్ ఓపెన్ చేసి కారును మన్మథరావ్ గెస్ట్ హౌస్ వైపు పోనిచ్చింది.

ఆమె శోభన... సి బి ఐ ఆఫీసర్ శోభన.

శోభన కళ్ళు తడిబారాయి. అవి చెల్లెలు శోధన జ్ఞాపకాల తాలూకు గుర్తులు అని అర్థమైంది.

దీపావళి రోజు చిచ్చుబుడ్లు కాల్చడానికి భయపడే శోధన ఇప్పుడు రివాల్వర్‌తో శత్రువులను అతి సునాయాసంగా చంపేసి వస్తోంది. అది కేవలం తన వల్లనే.

ఒక మహా యజ్ఞంలో తను శోధనను భాగస్వామిని చేసింది. కానీ ఇంకా తన కళ్ళకు శోధన పాపాయిలానే కనిపిస్తోంది. చిట్టి పొట్టి గౌనుతో తనను పట్టుకోవడానికి అడుగులు వేస్తూ పరుగెత్తుకు వచ్చిన శోధన.

“ఎక్కడున్నానో చెప్పుకో” అన్నప్పుడు పెద్ద పెద్ద కళ్ళతో, అమాయకపు చూపులతో తనను పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నప్పుడు ముచ్చట వేసేది. అందుకే తనే దొరికిపోయేది అప్పుడు చాలా ఇష్టంగా.

“దొరికిపోయావ్... దొరికిపోయావ్” అని తానే అక్కని కనిపెట్టేసినట్లు భావించి విజయగర్వంతో చప్పట్లు కొట్టేది.

ఆదమరిచి తన ఒడిలోనే పడుకున్నప్పుడు ఆ అమాయకపు మొహాన్ని చూస్తే ముద్దొచ్చేది.

“నా చిట్టితల్లీ, నా గారాల చెల్లీ నన్ను క్షమించు. ఈ మహాయజ్ఞంలో నిన్ను భాగస్వామిని చేసినందుకు” మనఃస్ఫూర్తిగా చెల్లెలికి మనసులోనే క్షమాపణ చెప్పుకుంది శోభన.

❖ ❖ ❖

అదే సమయంలో...

రైల్వే స్టేషన్ రద్దీగా వుంది , రాత్రి పదకొండు దాటింది, రైలు ప్లాట్‌ఫారం మీద ఆగింది.

స్టేషన్ బయట హడావుడి మొదలైంది. చలి ఎక్కువగా వుండడం మూలాన కొందరు ఆటోవాలాలు ముడుచుకుని పడుకున్నారు. స్టేషన్‌లో నుంచి ఒకతను బయటకు వచ్చాడు... వయసు నలభైకి పైగానే వుంటుంది.

లావుగా వున్నాడు, పెరిగిన గడ్డం.. ఆ చూపుల్లో కొట్టొచ్చినట్టు క్రూరత్వం కనిపిస్తుంది. భుజానికి లగేజీ బ్యాగ్ వేలాడుతుంది.

అతను స్టేషన్ బయటకు వస్తూనే ఓ ఆటో దగ్గరికి వెళ్లి “వస్తావా?” అని అడిగాడు ఎక్కడికో చెప్పకుండానే.

ఆ ఆటో అతను కూడా ఎక్కడికి అని కూడా అడగకుండానే “రాను” అన్నాడు.

అతను మరో ఆటో దగ్గరికి వెళ్లి “వస్తావా?” అని అడిగాడు.

అతను కప్పుకున్న దుప్పట్లో నుండే కుడి చేతిని పైకి లేపి “రాను” అన్నట్టు అడ్డంగా ఊపి చెప్పాడు.

అతనికి కోపం నషాళానికి అంటింది. భుజానికి వున్న లగేజీ బ్యాగ్‌ని తీసి జిప్ ఓపెన్ చేసాడు. కుడిచేతికి పాములా తగిలింది రివాల్వర్.

దానిమీద చేయి వేసి మరో ఆటో దగ్గరకి వెళ్ళి అడిగాడు. అతనూ రాననే సమాధానమే చెప్పాడు. ఇంక కోపం ఆగలేదు. చేయి రివాల్వర్ మీదికి వెళ్ళింది. అప్పుడే అతని పక్కన మరో ఆటో ఆగింది. ఆటోలో నుంచి ఓ తల బయటకు వచ్చింది.

“రండి సార్, నేనొస్తాను” అన్న గొంతు వినిపించింది. ఆ గొంతు శోధనది. జీన్స్ ప్యాంట్ మీద బ్లాక్ టీ షర్టు, దాని మీద ఖాకీ చొక్కా.

ఆమె వైపు చూసి “సిటీ అవుట్‌స్కట్స్‌కు వెళ్ళాలి” చెప్పాడతను.

“మీటర్ మీద వంద రూపాయలు ఎక్స్‌ట్రా అవుతుంది” చెప్పింది శోధన.

“రెండు వందల రూపాయలు ఇస్తాను” అని చెప్పి అతను ఆటోలో కూచున్నాడు. బ్యాగ్‌లో వున్న రివాల్వర్‌ని లోపలికి నెట్టి జిప్ మూసేసాడు.

ఆటో డ్రైవ్ చేస్తూనే సైడ్ మిర్రర్‌లో వెనుక కూచున్న అతన్ని చూస్తోంది.

అతని మోహంలో ఆందోళన కనిపిస్తుంది.

అప్పుడే అతని చేతిలోని సెల్ రింగ్ అయింది. ఓకే బటన్ నొక్కి మెల్లిగా “హలో” అన్నాడు.

అవతలి వైపు నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

“ఫోటోని నీ సెల్‌కు పంపిస్తున్నా. జాగ్రత్తగా ఫినిష్ చేయాలి. ఈ రాత్రి పని పూర్తవ్వాలి” అటు వైపు నుంచి వినిపించింది.

“సరే” ముక్తసరిగా చెప్పి సెల్‌లో యెమ్మెమెస్ ద్వారా వచ్చిన ఫోటో చూసి షాకయ్యాడు.

సెల్‌లో వచ్చిన ఫోటో ఓ అమ్మాయిది. అదీ శోధనది.

ఒక వ్యక్తిని చంపడానికి సుపారీ తీసుకున్నాడు, ఆ వ్యక్తి అమ్మాయి అని అతనికి ఇప్పుడే తెలిసింది, అదీ ఓ ఆటో డ్రైవర్‌ని అని.

అతడి పేరు గఫూర్ కిరాయి హంతకుడు, కాంట్రాక్ట్ కిల్లర్ ముంబై నుంచి వచ్చాడు.

అతడికి అన్ని భాషలూ తెలుసు. అతను దయా దాక్షిణ్యాలు లేని నరరూప రాక్షసుడు.

ఒక్క క్షణం అతనికి ఆశ్చర్యం వేసింది. ఈ అమ్మాయిని చంపడానికా తను అంత దూరం నుంచి ఇక్కడికి వచ్చింది. అయినా ఎలుక ఎలుకల బోనులోకే సరాసరి వచ్చింది అనుకున్నాడు.

ఆమె పులి అని, పులి బోనులోకి వేటగాడిని మట్టుబెట్టడానికి వచ్చిందని ఆ క్షణం అతనికి తెలియదు.

గఫూర్ ఎవరికో యస్సెమ్మెస్ పంపించాడు. సరిగ్గా పది నిమిషాల తర్వాత రోడ్డు మీద ప్రత్యక్షమయ్యాడు ఒకతను.

గఫూర్ ఆటోలో అతడిని ఎక్కించుకున్నాడు. మరో పదిహేను నిమిషాల తర్వాత మరొకతను. ఆటో సిటీ అవుట్ స్కట్స్‌లోకి ఎంటరైంది.

చుట్టూ చెట్లు. ఆటో నిర్మానుష్యమైన రోడ్డు మీద వెళ్తోంది. గఫూర్ తనకు రెండు వైపులా కూచున్న వాళ్లకు సైగ చేసాడు. వాళ్ళు తమ జేబుల్లో వున్న రివాల్వర్స్ బయటకు తీసారు. వాటిని శోధన మెడ మీద పెట్టి “ఆటో ఆపు” అన్నారు.

ఆటో ఆపి వాళ్ళ వైపు చూసింది శోధన.

“ఎవర్నువ్వు?” అడిగాడు గఫూర్.

“ఆటో డ్రైవర్‌ని” క్యాజువల్‌గా చెప్పింది శోధన.

“ఒక ఆటో డ్రైవర్ కోసం, అందులో ఒక ఆడదాని కోసం కొన్ని లక్షలు సుపారీ ఇచ్చి చంపమన్నారంటే నువ్వు మామూలు ఆడదానివి కాదు. నిజం చెప్పు” అన్నాడు గఫూర్.

"పోనీ స్పెషల్ ఆడపిల్లను అనుకో, లేదా పులి పిల్లను అనుకో" ఏ మాత్రం టెన్షన్ లేకుండా అంది.

"మగాడిని అయితే సింపుల్‌గా చంపేసి వెళ్ళిపోయేవాడిని, కానీ నువ్వు అమ్మాయివై పోయావ్ నిన్ను కామ్‌గా చంపితే కిక్కు వుండదు, వీళ్ళు మా ఫ్రెండ్స్. ఇక్కడే ఎంజాయ్ చేసి ఆ తర్వాత నిన్ను ఫినిష్ చేస్తాం" గఫూర్ శోధన వంక చూసి అన్నాడు.

శోధన నవ్వింది.

అ ముగ్గురూ విచిత్రంగా శోధన వంక చూసారు.

"మమ్మల్ని చూస్తే భయం వేయడం లేదా?" అందులో ఒకడు అడిగాడు.

"భయమా… అదే వేస్తే నేను ఇంత దూరం ఆటోలో నిన్ను ఎందుకు తీసుకు వస్తాను గఫూర్" తాపీగా అంది తన ఖాకీ జేబులో వున్న ఫోటో బయటకు తీస్తూ.

ఒక్కసారిగా షాకయ్యాడు గఫూర్. తన పేరు ఆమెకు ఎలా తెలుసు అనుకుంటూ?

"అయినా నన్ను రేప్ చేయలన్నా, చంపాలన్నా నువ్వు కూచున్న సీట్‌లో నుంచి లేవాలి కదా?" అంది శోధన.

"అంటే?" అనుమానంగా అడిగాడు గఫూర్.

"పూర్ గఫూర్! నీ సీటు కింద బాంబ్ ఫిక్స్ చేశాను. నువ్వు కానీ నీతో వచ్చిన తొట్టి గ్యాంగ్ కానీ లేచారా పైకి లేచిపోతారు" తాపీగా చెప్పింది శోధన.

గఫూర్‌తో పాటు మిగతా ఇద్దరూ షాక్ అయ్యారు.

చెవులు రిక్కించి విన్నారు సీటు కింద శబ్దం. ఇలాంటి వాటిలో ఎక్స్‌పర్ట్‌లు వాళ్ళు.

తమని శోధన ట్రాప్ చేసిందని అర్థం అయిపోయింది వాళ్ళకు.

తన క్రైమ్ ట్రాక్‌లో ఇలాంటి వరెస్ట్ రికార్డ్ లేదు. ఇప్పటివరకూ ఇదే మొదటిది, చివరిది కూడా అని అతనికి తెలియడానికి అట్టే సమయం పట్టలేదు.

శోధన తాపీగా అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్ళింది, ఆమె చేతిలో వున్న బాంబ్ రిమోట్‌లో వున్న బటన్ మీద చేయి పడింది.

శోధనను చంపుదామని వచ్చిన గఫూర్, ఆమెతో ఆడుకోవడానికి వచ్చిన మరో ఇద్దరు క్రిమినల్స్ పోలీస్ రికార్డ్స్ నుంచే కాదు, భూమ్మీది నుండే తొలగిపోయారు.

ఆటో పెద్ద శబ్దంతో పేలిపోయింది.

ఆ వెలుగులో శోధన రోడ్డు ఎక్కింది.

రోడ్డు మీద వెళ్తోన్న కారును "లిఫ్ట్ ప్లీజ్" అంటూ ఆపింది.

కారు ఆగింది.

"థాంక్యూ" అంటూ డ్రైవింగ్ సీట్‌లో వున్న విశ్వక్‌ని చూసింది.

"ఆ ముగ్గురిని పరలోకానికి పంపించావా?" అడిగాడు విశ్వక్ కారును ముందుకు పోనిస్తూ.

అలాగే చూస్తోండిపోయింది శోధన.

❖ ❖ ❖

ఆ హాల్‌లో ఇద్దరే వున్నారు. ఒకరు హోమ్‌మినిస్టర్ ధనంజయరావ్, మరొకరు సిద్దప్ప.

"నా బిడ్డ మీద దాడి చేసింది ఎవరో వెంటనే తెలుసుకోవాలి" సిద్దప్ప అన్నాడు.

పార్టీకి నల్లధనాన్ని విరాళంగా ఇచ్చే సిద్దప్ప, ఆ డబ్బును ఎరలా భావిస్తాడు. అందుకే ప్రభుత్వాన్ని అతడి పనులను చేసిపెట్టే బ్రాంచ్ ఆఫీసులా మార్చుకున్నాడు.

"ఏంటి హోం ఆలోచిస్తున్నారేమిటి?" అడిగాడు సిద్దప్ప.

"పోలీసులు ఆ పని మీదే వున్నారు. క్లూస్ టీం కూడా వెళ్ళింది" హోమ్‌మినిస్టర్ చెప్పాడు.

"ఆ విషయం నాకూ తెలుసు. నాకు కావలసింది నా బిడ్డ మీద దాడి చేసిందెవరో నాకు తెలియాలి. ఈ వార్త పేపర్‌లో రాకముందే నా బిడ్డ మీద దాడి చేసిన మనిషి శవమై పోవాలి. లేకపోతే రేపు నన్ను చూసి చిన్న పిల్లాడు కూడా భయపడడు" సిద్దప్ప అన్నాడు.

చిత్రంగా చూసాడు హోమ్‌మినిస్టర్.

తన కొడుకు తీవ్రంగా గాయపడ్డాడు, అదీ మామూలుగా కాదు అతని ప్రైవేట్ పార్ట్ తీవ్రగాయానికి లోనైంది. అదే మింగుడుపడడం లేదు అతనికి. ఎందుకంటే స్వయంగా తనే ఎన్నో రేప్ కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. యాసిడ్ దాడి కేసుల్లోనూ వున్నాడు. ఎందరో అమ్మాయిల జీవితాలతో ఆడుకున్నాడు. కానీ తన రాజకీయ పలుకుబడితో సునాయాసంగా బయటపడ్డాడు. శిక్ష అంటూ విధిస్తే అతను చేసిన నేరాలకు వంద సంవత్సరాల శిక్ష కూడా సరిపోదు. ఆ విషయంలో తను అదృష్టవంతుడనుకునేవాడు ఇంతవరకు. కానీ ఇప్పుడు నిజానికి అతనికి కొడుకు పరిస్థితి కన్నా తన పవర్ పోతుందన్న భయం పట్టుకుంది.

సిద్దప్ప హెూమ్‌మినిస్టర్ వైపు చూసి "పబ్‌లో వున్న పుటేజ్ తెప్పించండి" అన్నాడు.

"ఆ పని మావాళ్ళు చేస్తున్నారు. ఆ పుటేజ్ ఆధారంగా మనం ప్రొసీడ్ అవ్వొచ్చు" అన్నాడు హెూమ్‌మినిస్టర్.

కానీ అతనికి నమ్మకం ఆ పుటేజ్ వల్ల సిద్దప్ప కొడుక్కి సరైన శిక్ష పడక మానదు.

దేవతలు సైతం 'తథాస్తు' అన్నట్లున్నారు అతను అనుకున్నదే జరిగింది.

గోల్కొండ, ఆ పరిసరి ప్రాంతాల్లో శోభన కనిపించిందని తన దగ్గర సమాచారం ఉంది. అందుకే వచ్చింది అందుకే ఎదురుగా కనిపిస్తున్న గోల్కొండ అందాలు కానీ, ఆ పురావస్తు శోభ కానీ ఆమెని ఆహ్లాదపరచలేకపోతున్నాయి. ఆమెకి కావాల్సింది తన అక్క శోభన తన ప్రాణం.

'ఎక్కడున్నావ్ నా ప్రాణమా! నా శరీరాన్ని రెండు ముక్కలు చేసినట్టు, నా నుండి విడిపోయావా? ఎక్కడని వెతకనూ... నీ కోసం ఎంత కాలం నిరీక్షించను?'

బాధగా ఆమె కళ్ళు కన్నీళ్లను వర్షిస్తున్నాయి.

ఆ ఏరియాలో అనుమానం వున్న ప్రాంతాలను తన మెదడులో నిక్షిప్తం చేసుకుంటోంది శోధన. గోల్కొండకు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న అడ్డా అది. చతుర్వేది అక్రమ నేర సామ్రాజ్యానికి బ్రాంచ్ ఆఫీసు. అక్కడ ముఖ్యమైన ల్యాండ్ సెటిల్‌మెంట్స్ జరుగుతాయి, ఈ సమాచారం తెలిసే ఇక్కడికి వచ్చింది శోభన. ఆ తరవాతే తను కనిపించలేదు. ఏమైపోయిందో ఎవరికీ అంతుబట్టలేదు.

శోధన పిడికిళ్ళు బిగుసుకున్నాయి. దూరంగా పాడుబడిన ఇల్లు కనిపిస్తోంది. లోపలికి వెళ్తే అదో కట్టుదిట్టమైన శత్రు దుర్భేద్యమైన కోట అని తెలుస్తుంది.

శత్రుసంహారానికి నాంది మొదలైంది.

శోధన అటువైపు వెళ్ళింది. అక్కడ పటిష్టమైన భద్రత ఉంది. చతుర్వేది నేర సామ్రాజ్యానికి పునాదులు అక్కడే వున్నాయి మరి. అతను ఒక బాలనేరస్తుడిగా తన నేర జీవితాన్ని ప్రారంభించింది అక్కడినుండే. చిన్నగా చిల్లర దొంగతనాలు మొదలుపెట్టి గంజాయి వరకూ ఎన్నో నేరాలు చేసాడు. బాలనేరస్తుడిగా బోస్టన్ స్కూల్‌లో ఉండి బయటకి వచ్చిన తర్వాత తన నేరాల స్థాయిని పెంచాడు. నేరం చేయడం కన్నా నేరాన్ని సృష్టించడం నేర్చుకున్నాడు. తాను ఎదగడం కోసం ఎవరినైనా అణగదొక్కే క్యారెక్టర్ అతనిది.

హైదరాబాద్ బాంబ్ పేలుళ్ళలో అతని హస్తం వుందని తెలిసినా సాక్ష్యాధారాలు దొరకలేదు ఎవ్వరికీ. ముంబై బాంబ్ పేలుళ్ళలో కూడా అతను ఉన్నాడని తెలిసింది. ప్రతి వ్యాపారాన్నీ తను చేసే నేరానికి వాడుకోవడం చతుర్వేది ప్రత్యేకత.

గల్లీ నుంచి ఢిల్లీ వరకూ విస్తరించిన అతని నేరాలపై సిబీఐ కన్నేసింది. ఆ కేసును సిబీఐ ఆఫీసర్ శోభనకు అప్పగించింది. శోభన చాలావరకూ సాక్ష్యాలు సేకరించింది. ఒక్కో విషయం తెలుస్తోన్న కొద్దీ విభ్రాంతికి గురైంది శోభన. ఆ సమయంలోనే శోభన మిస్సయింది.

శోధన మెల్లిగా ఆ పాడుబడిన భవనం వైపు నడిచింది. సాధారణంగా కనిపించే ఆ భవనం శత్రుదుర్భేద్యంగా వుంటుంది. ఆయుధాలు ధరించిన నరరూప రాక్షసుల పహారా ఉంటుందక్కడ. ఎందుకంటే చతుర్వేది ప్రాణాల గుట్టు ఆ భవనంలోనే ఉంది.

శోధన వారం రోజులుగా అబ్జర్వ్ చేసాకే అక్కడికి వచ్చింది. వెనుక వైపు అంతా ముళ్ళపొదలు నిండి వున్నాయి. అటువైపు ఎవరూ రారు. దానికి కారణాలు రెండు – ఒకటి అది దూరంగా విసిరివేయబడినట్టు ఉండటం, రెండో కారణం అది చతుర్వేది నేర సామ్రాజ్యం అని తెలియటం. వాళ్ళని పట్టుకోవాలని అక్కడికి వస్తే ప్రాణాలతో తిరిగి వెళ్ళలేరని తెలుసు పోలీసనే ప్రతివాడికి. శోధన మెల్లిగా

వెనుక వైపు నుంచి వెళ్లి చూస్తే స్టోర్ రూం కనిపించింది. దాని కిటికీ చాలా ఎత్తులో వుంది. మునివేళ్లపై నించుని లోపలికి చూడటానికి ప్రయత్నించింది శోధన. మరో రెండు అడుగులు ఎత్తు వుంటే తప్ప సాధ్యం కాదు. మరోసారి ట్రై చేయబోయింది. కుదరలేదు. చుట్టూ చూసింది రాయి లాంటిది దొరుకుతుందేమో నని. కనుచూపుమేరలో కనిపించలేదు చివరిసారిగా ట్రై చేయడానికి ప్రయత్నం చేసింది.

సడెన్‌గా ఆమె శరీరం పైకి లేచింది. రెండు బలమైన చేతులు ఆమె నడుం భాగాన్ని పట్టుకుని పైకి లేపాయి. స్టోర్ కిటికీ స్పష్టంగా కనిపిస్తోంది ఆమెకి. లోపల సిలిండర్స్ వున్నాయి. అక్కడ అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్నట్టు అనుమానం కలిగింది.

మెల్లిగా కిందికి దిగి ఎదురుగా వున్న వ్యక్తి వైపు చూసి "ఎవరు?" అని అడిగింది.

"లవర్" చెప్పాడు అతను.

"ఇట్సాల్ రైట్" అంది.

"హెల్ప్ చేస్తే థాంక్స్ చెబుతారు ఇట్సాల్ రైట్ అనరు" అన్నాడతను.

"అందమైన అమ్మాయి నడుంను పట్టుకోవడం హెల్ప్ కాదు. పైగా ఎవరు అంటే లవర్ అనేవాడు హెల్పర్ కాదు. ఈవ్ టీజర్ ఎంజాయ్. నా పర్మిషన్ లేకుండా నా నడుంను ముట్టుకున్నా ఇట్సాల్ రైట్ అన్నానంటే నేను మంచిదాన్ని అని అర్థం. నిజంగానే హెల్ప్ చేసావని అర్థం. ఇంతకీ మీ పేరు?" అడిగింది శోధన.

"వి విశ్వక్. సారీ ఒక్కటే వి. విశ్వక్. గ్లాడ్ టు మీట్ యూ" చేయి చాపి అన్నాడు విశ్వక్,

"ఓహ్.." అని విశ్వక్ వైపు చూసి.. "ఈ భవనాన్ని పేల్చేద్దామా?" అని అడిగింది.

అతని చేయి గాలిలో అలానే వుంది.

"గీతాంజలి సినిమా చూసారా?" అడిగాడు విశ్వక్.

"చూసాను ఎందుకు?"

"లేచిపోదామా అన్నంత ఈజీగా పేల్చేద్దామా అని అడిగితే" అని నవ్వుతూ "సరే" అన్నాడు తన చేతిని వెనక్కి తీసుకోబోతూ విశ్వక్.

వెంటనే శోధన అతని చేతిలో చేయి వేసింది.

"నేనోసారి లోపలికి వెళ్లొస్తాను. ఎవరైనా వస్తే నీ సెల్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వు" అంది లోపలికి వెళ్తూ.

సరే అన్నట్టు బుద్ధిగా తలూపాడు. లోపలికి వెళ్ళాక శోధనకు డౌట్ వచ్చింది. అతనికి తన నంబర్ ఇవ్వలేదు. మరి తనకెలా మిస్డ్ కాల్ ఇస్తాడు? అనుకుంటూనే వెనుక వైపు వున్న చిన్న ఇరుకైన దారి గుండా లోపలికి వెళ్ళింది. చిన్న చెక్క తలుపు తుప్పు పట్టి వుంది. దాన్ని మెల్లిగా తీసే ప్రయత్నం చేసింది శోధన. మొహమంతా చెమట పట్టింది. పది నిమిషాల తర్వాత తలుపు తెరుచుకుంది. లోపలికి వెళ్ళింది. లోపల సిలిండర్స్ మేళాలా వుంది. దొంగతనంగా గ్యాస్ ఫిల్లింగ్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఎంత డబ్బు వున్నా అక్కడ ప్రతి అణువులోనూ ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టని చతుర్వేది నిజస్వరూపం కనిపిస్తోంది. ఆ స్టోర్ రూంలోనుంచి చూస్తుంటే మరో గదిలో వున్న హెరాయిన్ కూడా కనిపిస్తోంది. అందులోనే మారణాయుధాలు వున్నాయని తెలుసు. కొన్ని రహస్య కీలక పత్రాలు, అన్నింటికన్నా ముఖ్యంగా అమ్మాయిలను బెదిరించి, వాళ్ళను నేకెడ్‌గా తీసిన నీలిచిత్రాలు, దాన్ని బూచిగా చూపిస్తూ అతను చేసే బ్లాక్ మెయిలింగ్ క్యాసెట్స్ కూడా అందులోనే వున్నాయి.

అన్నింటికన్నా ముఖ్యంగా అక్క శోభన మిస్సయిన ప్లేస్ ఇది. ఆనవాలు లేకుండా చతుర్వేది కీలక స్థావరం కుప్పకూలిపోవాలి. అగ్నికి ఆహుతి అవ్వాలి. ఆమె చేతివేళ్లు వేగంగా పనిచేస్తున్నాయి. గ్యాస్ లీక్ చేసే ప్రయత్నం మొదలుపెట్టింది. ఏ మాత్రం అనుమానం రాకూడదు. వాళ్లకు అనుమానం వచ్చేలోగా ఎస్కేప్ కావాలి. కొద్ది నిమిషాల్లోనే ఆమె శ్రమ ఫలించింది. అటు వైపు ఎవరూ రాకపోవడం ఆమెకు కలిసి వచ్చింది.

సక్సెస్ అనుకున్నది సాధించింది. గ్యాస్ లీక్ అవుతోంది తను వెంటనే బయటకు వెళ్ళాలి ఆ ఆలోచన కన్నా వేగంగా బయటకు నడిచింది. బయటకు వచ్చాక అనుమానం వచ్చింది. అగ్గిపెట్టె ఎలా? అప్పుడు గుర్తొచ్చాడు విశ్వక్.

అక్కడే ఓ బండ మీద ధైర్యంగా కూచోన్న అతని దగ్గరికి వెళ్లి "అగ్గిపెట్టె ఉందా?" అని అడిగింది చేయి చాచి.

వెంటనే విశ్వక్ ఆమె వైపు చూస్తూ "అగ్ని పర్వతం సినిమా చూసావా?" అని అడిగాడు.

"సూపర్ స్టార్ కృష్ణ సినిమా కదా! ఇప్పుడు ఆ విషయం ఎందుకు?" అడిగింది శోధన.

"ఆ స్టైల్‌లో చేయి చాచి అడిగితే" అంటూ జేబులో నుంచి అగ్గిపెట్టె తీసి ఇచ్చాడు.

"థాంక్స్" అంది అగ్గిపెట్టె తీసుకుని.

"సిగరెట్ కూడా ఇచ్చేదా?" అడిగాడు వస్తోన్న నవ్వును కంట్రోల్ చేసుకునే ప్రయత్నం చేస్తూ.

అంత కోపంలోనూ నవ్వొచ్చింది. "మీకు సిగరెట్ తాగే అలవాటు ఉందా?" అడిగింది అగ్గిపుల్ల గీస్తూ.

"కనీసం వక్కపొడి అలవాటు కూడా లేదు. పెట్రోల్ బంక్‌లో చిల్లర లేకపోతే ఇచ్చారు" నవ్వి చెప్పాడు.

"బావుంది పెట్రోల్ బంక్‌లో అగ్గిపెట్టె ఇవ్వడం" అని అగ్గిపుల్ల గీసి స్టోర్ రూం వైపు విసిరి..

"పరుగెత్తు" అని విశ్వక్‌తో చెప్తూనే తన స్కూటీ దగ్గరికి పరుగెత్తింది.

ఇక అక్కడ ఒక్క క్షణం వున్నా మంచిది కాదు. స్కూటీ స్టార్ట్ చేసింది స్కూటీ స్టార్ట్ కావడం లేదు. కోపంతో స్కూటీని ఒక్క తన్ను తన్నింది.

"స్కూటీలు తిడితే పడటం, తన్నితే స్టార్ట్ కావడం లాంటి పనులు చేయవు. ముందు నా బైక్ ఎక్కు, అవతల మన జాయింట్ మొగుళ్ళు వస్తున్నారు" అంటూ అటువైపు చూపించాడు.

చతుర్వేది మనుష్యులు బిల బిలమంటూ బయటకు వస్తున్నారు. పెద్ద శబ్దంతో ఆ భవనం పేలింది. చతుర్వేది బలమైన పునాది ఒకటి కూలిపోయింది. అంత ప్రమాదంలోనూ చతుర్వేది మనుష్యులు శత్రువుల కోసం వేట మొదలు పెట్టారు.

“నా పాతిక వేల స్కూటీ, పైగా వాళ్ళు చూస్తే సరాసరి అడ్రెస్ వెతుక్కుని వస్తారు” అంది.

“ముందు ఎక్కవే” అని బైక్ స్టార్ట్ చేసాడు.

ఓ వైపు చతుర్వేది మనుష్యులు వస్తున్నారు. గత్యంతరం లేదు. ముక్కూ మొహం తెలియని మనిషి తనను ‘వే’ అనడమా, ఉక్రోషంతో చిన్నపిల్లలా మారిపోయింది. ఒక రెండు కిలోమీటర్లు వెళ్ళాక అతని ఎడమ భుజం మీద గట్టిగా కొరికింది.

“రాక్షసి” గట్టిగా అరిచి అన్నాడు “కండ వూడేలా కొరికావు, నాన్ వెజ్ అంటే అంతిష్టమా” బాధగా అన్నాడు విశ్వక్.

“నన్ను ‘వే’ అంటావా? ఎక్కవే అంటావురా” కచ్చగా అంది.

బైక్ శోధన ఇంటి ముందు ఆగింది.

అప్పటికే ఆమె ఉక్రోషం, కోపం కొద్దిగా తగ్గాయి. ఇంటి ముందు తన స్కూటీ కనిపించేసరికి మొత్తం తగ్గింది. అతని ఎడమ భుజం వైపు చూసింది. షర్టు రక్తంతో తడిసింది. తను గట్టిగానే కొరికినట్లుంది.

“సారీ అండ్ థాంక్స్” అంది బైక్ దిగి శోధన.

“ఏది ఎందుకు?” తన భుజం రుద్దుకుంటూ అన్నాడు.

“మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. నన్ను, నా స్కూటీనీ సేఫ్‌గా ఇంటికి చేర్చారు. నేనే అనవసరంగా మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. అందుకు సారీ. నన్ను సేఫ్‌గా ఇంటికి చేర్చినందుకు థాంక్స్” అన్నది.

“ఇట్సాల్ రైట్”అన్నాడు విశ్వక్.

“వెల్‌కం అనాలి” అంది శోధన.

“మీరు ఇంట్లోకి పిలిస్తే అలానే అనేవాడిని. ఎనీ హౌ గుడ్ నైట్” అన్నాడు బండి స్టార్ట్ చేస్తూ.

‘‘అవును నా నంబర్ తీసుకోకుండా నాకు ఎలా మిస్డ్ కాల్ ఇద్దామనుకున్నారు?” అడిగింది శోధన.

విశ్వక్ తన మొబైల్ తీసి ఓ నంబర్ డయల్ చేసాడు. శోధన సెల్ రింగ్ అయింది.

"ఇలా" అన్నాడు.

షాకయింది. తన నంబర్ అతనికి ఎలా తెలుసు? శోధన మరో విషయం కూడా మర్చిపోయింది, అతను తనను సరిగా తన ఇంటి దగ్గరే దింపాడు. అతనికి తన ఇల్లు ఎలా తెలుసు అన్న విషయం?

ఇంతకన్నా పెద్ద విషయం అసలు ఆమె స్కూటీలో పెట్రోల్ మొత్తం విశ్వక్ తీయడం వల్లే స్కూటీ స్టార్ట్ కాలేదు. ఆమె మీద ఎటాక్ జరుగుతుందన్న అనుమానంతోనే ఆమెను స్వయంగా తనే తీసుకురావాలని అలా ప్లాన్ చేశాడు అతను.

అతి తొందరలోనే ఎన్నో శేష ప్రశ్నలకు సమాధానం దొరకబోతుంది.

❖ ❖ ❖

పోలీస్ జీపు ఫస్ట్ కిక్ పబ్ ముందు ఆగింది. అందులో నుంచి దుర్జనరావ్ చాల పొగరుగా దిగాడు. ఆకలితో వున్న క్రూర జంతువులా వున్నాడు, సరైన సమయానికి యూనిఫాం తిరిగి తన ఒంటి మీదికి వచ్చినట్టు ఫీల్ అవుతున్నాడు. తనలాంటి నీచ్ కమీనే పోలీసులు యూనిఫాం లేకుండా బ్రతకడం అంటే మొసలి రోడ్డు మీద ఉన్నట్టే.

తన బలం ఈ ఖాకీ యూనిఫాం. చతుర్వేదికి, సిద్ధప్పకు మేలు చేస్తే తనకు ప్రమోషన్ గ్యారంటీ అనుకున్నాడు దుర్జనరావు

పోలీస్ జీపు దిగుతూనే మేనేజర్ రూంలోకి వెళ్ళాడు. రాత్రి తాలూకు సిసి ఫుటేజ్ తీసుకున్నాడు. ఆ పబ్‌లో చాలా చోట్ల సిసి కెమెరాలు వున్నాయి. వీడియో ఫుటేజ్ చూస్తున్నకొద్దీ దుర్జనరావ్ మోహంలో రంగులు మారుతున్నాయి.

విక్కీకి, పబ్‌లో వున్న వెయిట్రెస్‌కు జరిగిన సంభాషణ అంతా వుంది. ఆ తర్వాత విక్కీ వాష్ రూంలోకి వెళ్ళడంతో సహా... కానీ కొన్ని చోట్ల కెమెరా లేకపోవడంవల్ల కొంత భాగం రికార్డ్ కాలేదు. సడెన్‌గా వాష్ రూంలో అపరిచిత యువతి స్కార్ఫ్ కట్టుకుని విక్కీని కొడుతున్న దృశ్యం, నైఫ్‌తో అతని శరీరం మీద, అతని ప్రైవేట్ పార్ట్ మీద తగిలిన గాయం. ఎంతోమందిని దారుణంగా హింసించిన దుర్జనరావ్ కూడా ఆ దృశ్యం చూసి ఒక్క క్షణం భయపడ్డాడు.

స్కార్ఫ్‌లో వున్న అమ్మాయి ఎవరో గుర్తించే ప్రయత్నం చేస్తున్నాడు. ఎక్కడో చూసినట్టే అనిపిస్తోంది. అతను రీ కలెక్ట్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ వీడియో ఆపేసాడు. పబ్‌లో పనిచేసే వెయిట్రెస్‌ను పిలిపించమన్నాడు. ఆ వెయిట్రెస్ మరుసటి రోజునుంచి పని మానేసింది. వెంటనే అతని మనసులో వికృత ఆలోచన. వెళ్లి ఆ అమ్మాయిని తీసుకురమ్మన్నాడు.

పోలీస్ జీపు ఆ వెయిట్రెస్ ఇంటి వైపు బయల్దేరింది.

అంత కన్నా ఒక పది నిమిషాల ముందే శోధన ఆ వెయిట్రెస్ దగ్గరికి బయల్దేరింది. తలుపు తెరిచిన ఆ అమ్మాయి తన ఎదురుగా వున్న శోధన వైపు చూసింది. వెంటనే గుర్తు పట్టింది. “మీరా మేడం! ప్లీజ్ రండి” అంటూ పక్కకు తొలగి దారి ఇచ్చింది. ఆ రోజు శోధన లేకపోతే తన జీవితం నాశనం అవ్వడమే కాదు, తనను ఆ విక్కీ చంపేసేవాడే. ఆ భయంతోనే అక్కడ పని మానేసింది ఆ వెయిట్రెస్.

ఇంట్లో ఆ అమ్మాయి తండ్రి వున్నాడు. అతను మంచానికి అతుక్కుపోయి వున్నాడు. ఆ ఇంటి పరిస్థితి అర్థమైంది.

“థాంక్యూ మేడం! ఆ రోజు మీరు సమయానికి రాకపోయి వుంటే నా పరిస్థితి చాలా ఘోరంగా వుండేది” కన్నీళ్ళతో అంది ఆ అమ్మాయి.

“ఓకే వదిలేయ్, సమస్యలకు భయపడకు. అప్పుడు విక్కీని ఆ పరిస్థితిలో చూసేక భయమేసింది కదూ” అంది శోధన.

“అవును మేడం! వాడు చాలా మంది జీవితాలతో ఆడుకున్నాడు. నాకు తెలిసి మీరు ఆ రోజే జాయిన్ అయ్యారు. ఎందుకో మిమ్మల్ని చూస్తుంటే పని కోసం జాయిన్ అయినట్టు అనిపించలేదు” అంది ఆ వెయిట్రెస్.

“యస్, నిజమే. కారణం చెప్పను గానీ నాకు నీ నుంచి రెండు సాయాలు కావాలి చేస్తావా భార్గవి” అడిగింది శోధన.

“మేడం, నా పేరు మీకెలా...?” ఆశ్చర్యంగా అడిగింది.

“తెలుసుకున్నాను. మీ నాన్నగారి ఆరోగ్య పరిస్థితి గురించి కూడా తెలుసు. మీ గురించి వైదేహి మేడంకు చెప్పాను. మీలాంటి వారికోసం ఆ మేడం నడిపే

ఆసరా సంస్థ ఎంతో సాయం చేస్తుంది. ఈ నంబర్ ఉంచుకో. ఇది ఆ మేడం నంబరే" అంటూ వైదేహి మేడం ఫోన్ నంబర్ ఇచ్చింది.

"చెప్పండి మేడం, నేను మీకు ఏ విధంగా సాయం చేయగలను? నా ప్రాణం ఇవ్వమన్నా ఇస్తాను" అంది సిన్సియర్‌గా భార్గవి.

"ఆ రోజు అంతగా భయపడ్డావు. మరి ఇప్పుడిలా ధైర్యంగా?"

"ఆ రోజు ప్రాణాల మీద తీపితో కాదు మేడం, నేనేమైనా అయితే నాన్నకు ఏమవుతుందో అని భయపడ్డాను. అదీకాక ఒక మానవ మృగానికి నా శరీరాన్ని అర్పించడానికి ఒక ఆత్మాభిమానం గల ఆడపిల్లగా ఇష్టపడలేదు."

"వెరీ గుడ్! ఇంకాసేపట్లో నీ కోసం పోలీసులు వస్తారు. నిన్ను దుర్జనరావ్ అనే వెధవ పోలీస్ డ్రెస్‌లో ప్రశ్నలు వేస్తాడు. అతనికి నువ్వు నిజాలు చెప్పాలి."

"వాట్ మేడం నిజాలు చెప్పాలా? ఇంకా అబద్ధాలు చెప్పమంటారు అనుకున్నాను."

"ఆ నిజాలతో పాటు నువ్వు నీ చీరెకు, బ్లవుజ్‌కు మధ్య సేఫ్టీ పిన్ బదులు ఒక కెమెరా పెట్టుకోవాలి. అది నీకు ఒక పోలీస్ ఆఫీసర్ ఇస్తాడు. నీకు ఏ ప్రమాదం లేకుండా అతను చూసుకుంటాడు" అన్నది.

"తప్పకుండా మేడం, ముందు మీ కోసం కాఫీ."

"వద్దు, మళ్ళీ తీరిగ్గా వస్తాను" అని శోధన గుమ్మం దగ్గరికి వెళ్లి ఏదో మర్చిపోయినట్టు వచ్చి, భార్గవి తండ్రి దగ్గరికి వచ్చింది. హ్యాండ్ బాగ్‌లో వున్నా ఆపిల్స్ తీసి అతని చేతిలో పెట్టి, అతనికి కళ్ళతోనే ధైర్యం చెప్పింది. అతని కళ్ళలో సన్నటి కన్నీటి మెరుపు.

శోధన చెప్పినట్టుగానే పది నిమిషాల తర్వాత పోలీస్ జీపు వచ్చింది. ఇద్దరు పోలీసులు, ఒక ఇన్‌స్పెక్టర్ వున్నారు. వాళ్ళను చూడగానే ఆశ్చర్యం నటించింది భార్గవి.

"మిమ్మల్ని మా సి ఐ గారు రమ్మంటున్నారు" అన్నాడు ఓ పోలీస్ చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ లోపలికి నడిచాడు. కానిస్టేబుల్స్ లోపలికి వెళ్ళబోయి ఇన్‌స్పెక్టర్ చూపులకు భయపడి ఆగిపోయారు.

లోపలికి అడుగు పెట్టగానే ఇన్‌స్పెక్టర్ “నా పేరు శామ్యూల్. శోధన మేడం చెప్పిన ఇన్‌స్పెక్టర్‌ని నేనే. మీరేమీ భయపడకండి” అన్నాడు శామ్యూల్.

“థాంక్యూ సర్. మీలాంటివారి వల్లే ఇంకా పోలీసులు అంటే గౌరవం మిగిలి వుంది” మనస్ఫూర్తిగా అంది.

“సరే బయల్దేరండి. మీకు అంతా మంచే జరుగుతుంది. ఆ ప్రభువు మంచివాళ్ళకు మంచే చేస్తాడు” అన్నాడు.

భార్గవి తండ్రికి చెప్పి బయల్దేరింది. ఆమెలో భయం మచ్చుకైనా కానరావడం లేదు.

పోలీస్ జీపు భార్గవి ఇంటినుంచి వెళ్ళగానే ఒక నిట్టూర్పు విడిచింది శోధన. అంతా తను అనుకున్నట్టే జరుగుతోంది. తన శోభన తనకు కనిపించడానికి ఆట్టే టైం పట్టదు అనుకుంది. అపుడే ఆమె సెల్ రింగ్ అయింది. ఆ నంబర్ ఎవరిదో సడెన్‌గా గుర్తుకు వచ్చింది. విశ్వక్... రాత్రి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

వెంటనే ఓకే బటన్ ప్రెస్ చేసి “హలో ఎవరూ?” అంది.

“నేనని నీకు తెలుసు. ఎవరూ అని ఎందుకు అడగడం?” అటువైపు నుంచి విశ్వక్ అన్నాడు.

“సరే విషయం ఏమిటో చెప్పండి” అంది శోధన.

“రాత్రి నా మీద ఓ వాంపయిర్ దాడి చేసింది. కోరల్లాంటి పళ్ళతో గాయం చేసింది ట్రీట్‌మెంట్ కోసం స్టార్ హాస్పిటల్‌లో జాయిన్ అవ్వాలనుకుంటున్నాను. నా భుజాన్ని నాన్ వెజ్‌లా కొరికేసింది” అన్నాడు.

నవ్వొచ్చింది శోధనకు. కాసింత సిగ్గుగా కూడా అనిపించింది. ఎంత ఇమ్మెచ్యూర్డ్‌గా బిహేవ్ చేసిందో గుర్తుకువచ్చింది. అయినా బయటపడకుండా “అయితే ఏమిటి? అయినా వాంపయిర్స్‌తో మీకు పనేమిటి?” అంది.

“పోనీ మీతోనే నాకు పని అనుకోండి. ఎక్కడున్నారు?”

“పనా? నాతోనా? నేను...” అని ఎదురుగా వెళుతున్న ఓ బస్సు వంక చూసి దాని మీద వున్న బోర్డు చదివి శిల్పారామం దగ్గర వున్నాను” అని చెప్పింది.

“అరె, వాటే కోఇన్సిడెన్స్ నేను ఇక్కడే వున్నాను” అన్నాడు విశ్వక్.

"అయితే వచ్చి కలవండి" అంటూ "ఇంతకీ ఎందుకో తెలుసుకోవచ్చా?" క్యూరియాసిటీతో అడిగింది.

"ఎందుకేమిటి లవ్ ప్రపోజ్ చేయడానికి. రాత్రి మర్చిపోయాను. అందుకే ఇప్పుడు ప్రపోజ్ చేద్దామని."

"వాట్! నీకేమైనా లూజా? రాత్రి పరిచయం అయిన మనిషిని, అదీ యాక్సిడెంటల్‌గా. లవ్ ప్రపోజ్ చేస్తావా?"

"ప్రేమ కూడా యాక్సిడెంట్ లాంటిది అని ఓ పుస్తకంలో రచయిత రాసాడు."

"అయితే రా ప్రేమించుకుందాం" కచ్చగా అని ఫోన్ పెట్టేసింది.

శోధన సెల్ పెట్టేయగానే "హలో" అన్న పిలుపు వినిపించి వెనక్కి తిరిగి చూసి షాకయింది.

విశ్వక్ "ప్రేమించుకుందాం రా అన్నారుగా వచ్చేసాను" అన్నాడు.

❖ ❖ ❖

దుర్జనరావ్ తన ఎదురుగా వున్న భార్గవి వైపు చూసాడు.

"నువ్వేనా భార్గవి అంటే? నీ వెనుకే పడ్డాడా ఆ విక్కీ? బాగానే వున్నావు. కత్తిలాంటి ఫిగర్. ఎవరైనా పడతారులే" అని వెకిలిగా నవ్వుతూ "చెప్పు ఆ రోజు నిన్ను కాపాడింది ఎవరు?"

"ఆమె ఎవరో తెలియదు కానీ చూస్తే గుర్తు పడతాను" అంది.

సిసి ఫుటేజ్ చూపించాడు. అందులో స్కార్ఫ్‌లో వున్న శోధనను గుర్తుపట్టినట్టు వెంటనే చెప్పింది "ఈ మేడమే ఆ విక్కీగాడిని తుక్కు తుక్కుగా కొట్టింది" కసిగా చెప్పింది.

"విక్కీని కొట్టినందుకు చాలా హ్యాపీగా వున్నట్టు వున్నావు" ఆమె శరీరం వంక చూస్తూ అన్నాడు.

"అమ్మాయిలను అనుభవించాలనుకునే మగమృగాలను అలానే చితక్కొట్టాలి" అంది భార్గవి.

తనని కూడా కలిపి అంటున్నట్టు అనిపించింది అతనికి.

"ఈ అమ్మాయిని ఎక్కడైనా చూసావా?" భార్గవి దగ్గరికి వస్తూ అడిగాడు.

ఒక్కో అడుగు వెనక్కి వేస్తూ "చూసాను" అంది.

భార్గవి భుజం మీద చేయి వేసి ఆమె భుజం నొక్కుతూ "ఎక్కడ?" అని అడిగాడు.

"ప్లీజ్ చేయి తీయండి" అంది గింజుకుంటూ.

"ఏం నేను అందంగా లేనా? అయినా పబ్‌లో పనిచేసే నీకు ఈ కల్చర్ తెలియదా? నాతో వున్నావనుకో నీకు ఫుల్ బందోబస్తు దొరుకుతుంది. నిన్ను ఎవరూ ఏమీ చేయరు. నాతో టచ్‌లో వుంటే నిన్ను టచ్ చేయడానికే భయపడుతారు" తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

అప్పుడే శామ్యూల్ లోపలికి వచ్చాడు.

"నువ్వెందుకు వచ్చావు? అసలు నిన్ను ఉద్యోగంలో నుంచి పీకేయాలి. బయటకు వెళ్ళు" సీరియస్‌గా అన్నాడు.

శామ్యూల్ బయటకు వెళ్ళాడు.

"ప్లీజ్, నన్నేమీ చేయొద్దు. ఇదన్యాయం! విచారణ కోసం పిలిపించి ఇలా ప్రవర్తించడం ఏమీ బాగాలేదు సర్."

"చూడూ, నా వెనుక సిద్దప్ప, చతుర్వేది లాంటి వాళ్ళు వున్నారు. ఎవరూ నన్ను ఏమీ పీకలేరు. అంతెందుకు హోం మినిస్టరే నన్నేమీ పీకలేకపోయాడు" వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

"యూట్యూబ్‌లో మీ వీడియో పెట్టినా ఎవరూ ఏమీ పీకలేరా? ఒకసారి ఇలాంటి అనుభవం జరిగినా మీకు బుద్ధి రాలేదా" అడిగింది భార్గవి.

ఆ మాటలతో షాక్ తిన్నాడు.

"మీ కోసం శోధన మేడం వూరి చివర వున్న ఓల్డ్ ట్రావెలర్ బంగ్లాలో ఎదురు చూస్తోంది. మీరు వస్తే మీతో ఓ బిజినెస్ డీల్ మాట్లాడుతుందిట. నేను మీ దగ్గరకి మేడం దూతగా వచ్చాను. మీరు, సారీ నీలాంటి వాడికి మర్యాద అవసరం లేదు. నువ్వు రాకపోతే ఈ వీడియో యూట్యూబ్‌లోకి ఎక్కుతుంది. అప్పుడు జనమే కాదు ఆ సిద్దప్ప, చతుర్వేది మిమ్మల్ని ఏం చేస్తారో ఊహించుకో

ఒకసారి” అంటూ తన బ్లవుజ్‌కు పెట్టుకున్న బటన్ కెమెరాను చేతిలోకి తీసుకుంది.

శామ్యూల్ లోపలికి వచ్చి భార్గవి వైపు తిరిగి “పనై పోయిందా?” అడిగాడు.

“అయిపోయింది అన్నయ్యా, మీ సిఐగారు బాగా కోఆపరేట్ చేశారు” అంది బయటకు నడుస్తూ.

❖ ❖ ❖

శోభన ఇప్పుడు నలభై ఏళ్ళ మహిళ గెటప్‌లో వుంది. పాతబస్తీలో వున్న జర్దార్ స్థావరానికి కిలోమీటర్ దూరంలో వుంది. ఢిల్లీలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్టు తన దగ్గర సమాచారం వుంది. దేశాన్ని అల్లకల్లోలం చేయాలన్న కుట్ర దుబాయ్‌లో ఉన్న ఓ మాఫియా డాన్ స్థావరంలో మొదలైంది అన్నదే ఆ సమాచారం.

ఇలాంటి కుట్రలు, ఇలాంటి వార్తలు చాలామందికి సెన్సేషన్‌గా అనిపించవు. సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలిలో, మైనస్ ఉష్ణోగ్రతలో కనురెప్పల మీద తుపాకీ ఉంచుకుని కాపలా కాసే జవాను సాహసం కన్నా, పంటితో కారు లాగితే, గదిలో బొద్దింకలతో సహవాసం చేస్తే గొప్పగా అనిపిస్తుంది. వాటిని చూడటానికి సమయాని కన్నా ముందే టీవీకి అతుక్కుపోతాము. కానీ మనదేశం ప్రమాదకరమైన స్థితిలో వుంటే, అసలు మన వెనుక ఏం కుట్ర జరుగుతోంది? మనం ఎలా స్పందించాలి? అన్న విషయం ఆలోచించం,

ఇందుకు ఎవరూ మినహాయింపు కాదన్నది శోభన స్ట్రాంగ్ ఫీలింగ్. తన ప్రాణానికి ప్రాణమైన తన చెల్లి శోధనతో సహా...

అందుకే తను శోధనను అస్త్రంగా ప్రయోగించింది. ఢిల్లీ నుంచి ఇక్కడికి రప్పించింది.

ఒక్కసారిగా ఆమె గతంలోకి వెళ్ళింది.

❖ ❖ ❖

‘ఇన్నాళ్లకి గుర్తొచ్చానా వానా’ అంటూ హమ్ చేసుకుంటూ వచ్చింది శోధన. ప్లేట్‌లో అన్నం కలుపుతూ “మై డియర్ సిస్టర్ ఇదిగో” అంటూ శోభన నోటికి ముద్ద అందించింది.

“ఇప్పుడే వద్దు. నువ్వు తినేయ్. నేను ఈ పని పూర్తిచేసేసి తింటాను” అంది శోభన.

"అబ్బా అక్కా! ఈ పనులు ఎప్పుడూ ఉండేవే కదా! తిండి తిప్పలు మానేసి మరీ చేయాలా" అంటున్న శోధన వైపు చూసింది. తన చెల్లి రూపంలో అమ్మే వచ్చిందా అన్న భావం మళ్ళీ ఆమె మనసులో కలిగింది. చిన్నతనంలో అన్నం తినను అని మారాం చేస్తోంటే అమ్మ బుజ్జగించి తినిపించే దృశ్యం కళ్ళముందు కదిలింది. అంతే గుండె లోతుల్లో దాగున్న కన్నీళ్ళు కళ్ళ కొలకుల దాకా వచ్చాయి. అవి చెంప నిమిరే సమయానికి శోధన 'హే! ఏంటే ఇదీ!" అంటూ ప్లేట్ పక్కన పెట్టి శోభనకి దగ్గరగా జరిగింది. శోభన కళ్ళు తుడుచుకుంటూ "ఏం లేదులే అన్నం తినిపించు" అన్నది. అలా అంటున్న అక్క మాటల్లో పసితనం కనిపించింది శోధనకి. గబగబా రెండు ముద్దలు తినిపించింది. "ఏంటీ మొత్తం నాకే పెట్టేస్తావా?" అంటూ కంచంలో ఉన్న అన్నాన్ని తన చేతుల్లోకి తీసుకొని చెల్లి నోట్లో పెట్టింది. ఇలా ప్రేమగా అన్నం పెట్టే దగ్గరివారు ఉంటే అదే నిజమైన జీవితం. ఆప్యాయంగా మనతో కొన్ని మాటలు మాట్లాడటానికి, మనసులో ఉన్న భావాలను పంచుకోవడానికి మనకు మాత్రమే సొంతమైన కొన్ని జ్ఞాపకాలను తట్టి లేపటానికి ఎవరో ఒకరుండాలి.

రక్తసంబంధాలు పరాయి సంబంధాలుగా మారిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి దృశ్యం చూస్తే మనం ఏం కోల్పోతున్నామో అర్థం అవుతోంది. బానే ఉన్నా అని అబద్ధం చెప్పటానికైనా బాగున్నావా? అని అడిగేవాళ్ళు ఉండాలి కదా! వాళ్ళిద్దరినీ అలా చూసి గోడమీద ఫోటోలో ఉన్న వాళ్ళ అమ్మ కూడా సంతోషంగా నవ్వుతున్నట్లుంది. వాళ్ళ మాటలు గాలికి మాత్రమే వినిపిస్తున్నాయి, వాళ్ళ నవ్వులు ఆ ఇంట్లో దీపాలతో సమానంగా వెలుగుతున్నాయి. వాళ్ళ చిలిపితనపు కేరింతల రవళులు వింటూ ఆనాటి రాత్రి కదులుతోంది. నిద్రాదేవి ఇద్దరినీ జోకొడుతోంది.

న్యూఢిల్లీ...

చల్లగాలి హస్తినను చుట్టుముట్టింది. ఆ విశాలమైన ఇంట్లో ఒక గదిలో మోకాలు మీద చుబుకాన్ని ఆన్చి కిటికీ అవతల వున్న వెన్నెలను చూస్తోంది శోధన.

ఈ వెన్నెల ఇలానే రోజంతా వుంటే ఎంత బావుండు?

ఈ వెన్నెల్లో మనసైన వాడి ఒళ్లో తల పెట్టి అతను చెప్పే కబుర్లు వింటూ గడిపేస్తే? శోధన మనసులో అందమైన ఊహలు సందడి చేస్తున్నాయి.

ఎం.ఎ. సైకాలజీ చేసిన శోధన జర్నలిజంలో కూడా పట్టా పుచ్చుకుంది. ఎదురుగా గోడకు వున్న ఫోటో వంక చూసింది. ఇద్దరు అమ్మాయిలు ఒకే రూపంలో చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన ఫోటోలు.

ఆ క్షణం శోధనకు అక్క గుర్తొచ్చింది. ఎవరు అక్క? ఎవరు చెల్లి? కేవలం క్షణ వ్యవధిలో పుట్టిన చిన్నారులు వాళ్ళు. చిన్నపుడే యాక్సిడెంట్‌లో అమ్మా నాన్న చనిపోతే తనే అన్నీ అయి పెంచిన అమ్మలాంటి అక్క శోభన.

దేశాన్ని ప్రేమిస్తూ, సిబిఐలో చేరి నేరాలను పసిగట్టి, అరికట్టే అధికారి శోభన.

శోభనను చూస్తే గర్వంగా వుంటుంది కానీ, ఆ ప్రమాదాలు, ఆ రిస్క్‌లు నచ్చవు శోధనకి. జీవితం హాయిగా, సాఫీగా సాగిపోవాలని అనుకునే మనిషి తను.

❖ ❖ ❖

అడుగుల శబ్దం వినిపిచింది. అది అక్క అడుగుల శబ్దమే వెంటనే లేచింది, హాల్‌లోకి పరుగెత్తింది అలిసిపోయి వచ్చిన శోభన.

"దేశోద్ధరణ పూర్తయిందా?" అడిగింది శోధన.

"శోధనా! నువ్వసలు సీరియస్‌గా ఉండవా?" చిరు కోపంగా అడిగింది శోభన.

"ఓకే... ట్రై చేస్తాను. ఈ సీరియస్‌నెస్ సరిపోతుందా?" మొహాన్ని కాస్త సీరియస్‌గా పెట్టి అంది శోధన.

"ఇదే వద్దు. ఎమ్మే చేసావు. చదివింది మనుష్యుల సైకాలజీ, జర్నలిజం చేసావు, సంగీతం నేర్చుకున్నావు. అయినా ఖాళీగా ఇంట్లో కూచుంటావు" అంది.

"అక్కా! ఇవ్వన్నీ టైం పాస్ కోసం. నేను జర్నలిజం చేస్తే నీకిష్టం అని చేశాను. యమ్మే సైకాలజీ మనుష్యుల మనస్తత్వం తెలుసుకోవాలని చదివాను. కానీ తర్వాత తెలిసింది మనుష్యుల సైకాలజీ పుస్తకాల్లో ఉండదని, అది మన మస్తకాల్లో (మెదళ్ళలో) ఉంటుందని. ఇక సంగీతం అంటావా? హాయిగా నువ్వు డ్యూటీకి వెళ్తే నీ పిల్లలకు నేర్పించడానికి మాస్టర్ ఎందుకు? నేనే నేర్పిస్తాను. నాకు పెళ్ళయ్యాక నా మొగుడి ముందు కూచోని వీణ వాయిస్తాను. పాత సినిమాల్లో



సావిత్రి వీణ వాయిస్తుంటే యస్వీవోడు ఎంత హ్యాపీగా వింటాడు. కదా! అలా" నవ్వుతూ అన్నది.

శోభన చెల్లెలి వంక చూసింది. ఒక ఆడపిల్లగా, సాధారణ అమ్మాయిగా తను చెప్పింది రైట్ కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో శోధనలాంటి తెలివైన అమ్మాయి జర్నలిస్ట్‌గా అక్షరాన్ని అస్త్రంగా ఎక్కుపెడితే తప్ప దేశానికి రక్షణ లేదు.

ఆంధ్రప్రదేశ్ విడిపోయి తెలంగాణా రాష్ట్రం కూడా ఏర్పడింది. కొందరు అవకాశవాదులు దేశంలో అల్లకల్లోలం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు.

తనకు తెలిసిన సమాచారం ప్రకారం పెద్ద కుట్ర జరుగుతోంది. ఈ కుట్రని ఛేదించాలంటే కొన్ని సందర్భాల్లో అధికారం పనిచేయదు. శోధనలాంటి జర్నలిస్ట్ బయటకు రావాలి. స్వేచ్ఛగా ఏదైనా రాయగలిగిన కలం అనే అస్త్రం వున్నది జర్నలిస్ట్ చేతిలోనే.

"అక్కా! ఎక్కువగా ఆలోచించకు. హాయిగా నువ్వు కూడా నీ ఉద్యోగానికి రిజైన్ చేయ్, ఇద్దరం పెళ్లి చేసుకుందాం. నీకు అభ్యంతరం లేకపోతే వన్ బై టు. అయినా సరే క్రికెట్ టీమ్‌లా పిల్లలను కని దేశానికి ఓ అమితాబ్‌ని, ఓ రాఖీ సావంత్‌ని ఇద్దాం" నవ్వుతూ అంది.

“నీకు అల్లరి ఎక్కువ అవుతోంది” అంది చెల్లెలి చెవి మెలిపెట్టి.

అర్ధరాత్రి పన్నెండు దాటింది.

శోభన కంప్యూటర్ ముందు కూచోని వర్క్ చేసుకుంటోంది. శోధన అన్నం కలుపుకుని వచ్చి తినిపిస్తుంటే తింటూనే వర్క్ చేసుకుంటోంది.

“అక్కా ఈ గొడవలు, కేసులు అవసరమా? హాయిగా దూరంగా ఎక్కడికైనా వెళ్లి బ్రతికేద్దాం” అంది శోధన.

“ప్రతీ ఒక్కరూ అలా అనుకుంటే ఈ దేశం ఏమైపోతుంది? దేశానికి మేధావి మౌనం చాలా ప్రమాదకరం. మనం ఇప్పుడున్న పరిస్థితి చాలా ప్రమాదకరం. సి.బి.ఐ లోనే కుట్ర జరుగుతోందన్న అనుమానం. ఎపుడు ఏం జరుగుతుందో అని భయం. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి” అంది శోభన.

ఆవులిస్తూ “అక్కా! నీకో దండం! నాకు నిద్రొస్తోంది. వెళ్ళి పడుకోనా? మళ్ళీ రేపు తాజ్‌మహల్ చూడడానికి వెళ్దాం అనుకుంటున్నా, అవునూ ఒక సమాధిని మనం నిజమైన ప్రేమకి చిహ్నంగా చూస్తున్నాం అంటే ప్రేమ నిజంగా అంత గొప్పదా అక్కా?” అడిగింది శోధన.

“అవును నీ ప్రేమంత గొప్పది” అంటూ ముద్దుగా తలమీద కొట్టి, “సరే వెళ్ళు పడుకో. మళ్ళీ నిద్ర చాలలేదంటూ గోలచేస్తావు. అయినా ఫ్రెండ్స్‌తోనేగా వెళుతున్నావు జాగ్రత్త!” అంది.

ఉదయం లేచేసరికి శోభన వెళ్ళిపోయింది. శోధన ఫ్రెషప్ అయి వచ్చింది. తన పర్స్‌లో వెయ్యి రూపాయల కట్ట ఆల్ ది బెస్ట్ అన్న చిన్న స్లిప్.. శోధన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అక్క ప్రేమ గుర్తొచ్చి.

అదే అక్కను చివరిసారి చూడటం అని ఆ క్షణం ఆమెకు తెలియదు.

శోధన తాజ్‌మహల్‌ను చూడ్డానికి వెళ్ళినప్పుడే అమెరికా రాయబారి వచ్చాడట. అందుకో, మరెందుకో గానీ ఆ రోజు అక్కడ బాంబ్ బ్లాస్ట్ జరిగింది. ప్రమాదం త్రుటిలో తప్పింది కానీ తాజ్‌మహల్‌ను సందర్శకులు చూడకుండా తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. శోధనకి అక్కను చూడాలనిపించింది. అంతే వెనక్కి వచ్చేసింది. ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా చిందర వందరగా వుంది. కంప్యూటర్

పగిలిపోయి వుంది. అక్క జాడ ఎక్కడా కనిపించలేదు. పరుగున అక్క పనిచేసే సిబీఐ ఆఫీస్‌కి వెళ్ళి అక్క సంగతి అడిగింది. కానీ వారికి సరైన సమాచారం లేదన్నారు. కమ్యూనికేషన్ మిస్సయినట్టు వాళ్ళు చెప్పారు. కానీ ఆమె కోసం వెతుకులాట మొదలెట్టామని, ఎప్పటికప్పుడు అప్ డేట్స్ చెప్తామని చెప్పారు.

శోధన మెదడులో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి "వీళ్ళు చెప్పింది నమ్మి చేతులు కట్టుకొని కూర్చోవాలా లేక" అక్క చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

ఇపుడు తనకు తన అక్క ముఖ్యం, శోభన ముఖ్యం. అక్క కోసం అన్వేషణ మొదలుపెట్టాలని నిర్ణయానికి వచ్చింది. అందుకే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంది. ఒక మహా భవనాన్ని కూల్చాలంటే దాని మూలాలు, పునాదులు ఎక్కడ వున్నాయో వెతకాలి, వాటిని కూల్చాలి.

ఆ రోజు శోభన మీద ఎటాక్ జరిగింది. ఆ ప్రయత్నంలో తప్పించుకుని వచ్చింది. అప్పటికే శోధన తన కోసం గాలిస్తోంది చాలా తీవ్రంగా. అయితే అప్పుడే ఆమెకు ఓ విభ్రాంతికరమైన విషయం తెలిసింది. సి.బి.ఐ లో కొందరు తన మిస్సింగ్‌ను సీరియస్‌గా తీసుకోలేదు. అంటే డిపార్టుమెంటులోనే శత్రువులు ఉన్నారని అర్థం అవుతోంది. కానీ ఎవరు? వాళ్ళకి తన మిస్సింగ్ వలన జరగబోయే లాభం ఏంటీ? అన్న విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ పరిస్థితుల్లో తన ఐడెంటిటీ బయటపడకూడదు. అలాగే శోధనలో ఈ కసి వుండాలి. శోధనలాంటి వ్యక్తి తలచుకుంటే ఏదైనా సాధించగలదు. అందుకే చెల్లెలిని నీడలా ఫాలో అవుతోంది.

❖ ❖ ❖

శోధన పాతబస్తీ వైపు నడుస్తోంది. ఆమెని చూసిన వారు ఎవరైనా ముస్లిం అనుకుంటారు.

సి.బి.ఐ లో పనిచేసిన ఆమెకు గెటప్ మార్చడం కష్టం కాదు. జర్దార్ స్థావరానికి దగ్గరగా వచ్చేసింది. అప్పుడే ఆమె దృష్టి తన ఎదురుగా వున్న వ్యక్తి మీద పడింది. అతడిని ఎప్పుడో, ఎక్కడో చూసినట్టు అనిపించింది.

ఆమె చాలా షార్ప్‌గా ఆలోచించింది. సడెన్‌గా గుర్తొచ్చింది. అతనే యాష్కీ..

సుపారీ తీసుకుని హత్యలు చేసే యాష్కీని మిలటరీ రహస్యాలు

దొంగిలించాడన్న అభియోగం మీద అరెస్ట్ చేసారు. కోర్ట్‌లో హాజరు పరచడానికి తీసుకు వస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. శవం గుర్తు పట్టడానికి వీల్లేకుండా నుజ్జు నుజ్జు అయింది. అంటే యాష్కీ...

శోభన తన సెల్ ఫోన్ బయటకు తీసింది. బురఖాలో వుంది. అందులో అది పాతబస్తీ కాబట్టి ఎవరికీ అనుమానం రాలేదు. బురఖాలో నుంచి అతడిని ఫోటో తీసింది. హై క్వాలిటీ కెమెరా ఫోన్ అది.

వేషాలు మార్చడంలోనూ, సుపారీ తీసుకుని హత్యలు చేయడంలోనూ ఆరితేరిన యాష్కీకి ఇక్కడ ఏం పని? తనకి తెలిసి యాష్కీ గురించి ఆరా తీయగలిగింది ఒక్కరే... ఆ ఒక్కరు శోధన.

❖ ❖ ❖

చుట్టూ చూసింది శోధన. దగ్గరలో ఎలాంటి మారణాయుధం కనిపించడం లేదు.

"ఏంటి వెతుకుతున్నావ్?" అడిగాడు అమాయకత్వాన్ని నటిస్తూ విశ్వక్.

"ఒకేసారి గుళ్ళు దూసుకువెళ్ళే ఏకే 56 లాంటివి దొరుకుతాయేమోనని."

"నన్ను మర్డర్ చేసేద్దామనే" విశ్వక్ అడిగాడు.

సరిగ్గా గంట క్రితం విశ్వక్ శోధన దగ్గరికి వచ్చి "ఐ లవ్ యు" అన్నాడు.

"నీకసలు బుద్ధి ఉందా?" అరిచేసింది శోధన.

"ఎవరైనా ఐ లవ్ యు అంటే నీకు ఆస్తి ఉందా? అని అడుగుతారు. నువ్వేంటి? బుద్ధి ఉందా? అని అడుగుతున్నావు. బుద్ధి వుంది కాబట్టేగా బుద్ధిగా ఐ లవ్ యు అన్నాను. నువ్వేంటి బుద్దిగా 'ఐ టూ' అనకుండా 'ఐ హేట్ యు' అన్న ఎక్స్‌ప్రెషన్ ఇస్తున్నావు. అయినా నీ బాడీలో లవ్ కణాలు తక్కువగా వున్నట్లున్నాయి" కామ్‌గా అన్నాడు.

"అసలు నీ భుజం కాదు, పీక కొరికేస్తే ఓ పని అయిపోయేది" కోపంగా అంది.

"అసలు నాకు తెలియక అడుగుతాను, నా ప్రేమను ఎందుకు రిజెక్ట్ చేస్తున్నావు?"

"నన్ను హంతకురాలిని చేయకు గెటవుట్" అరిచేసింది శోధన.

"ఊ! నడిరోడ్డు మీద గెటవుట్ అంటే ఎక్కడికి వెళ్ళేది. సరే రేపు కలుద్దాం. ఈలోగా బై ఛాన్స్ ఆలోచించు" అన్నాడు. శోధన వెళ్తోన్న విశ్వక్ వైపే చూస్తోంది.

❖ ❖ ❖

భారత సరిహద్దు ప్రాంతం.

నిరంతరం ప్రాణాలకు తెగించి దేశ సరిహద్దుల్లోకి శత్రువులను రాకుండా, కంటి మీద కునుకు లేకుండా కాపలా కాసే భారత జవానుల వీరత్వానికి సాక్షిగా నిలిచే ప్రాంతం.

అక్కడ అతి రహస్యంగా ఒక సమావేశం జరుగుతోంది. ఆర్మీ చీఫ్ కూడా అక్కడే వున్నాడు. తమ దేశ రక్షణ స్థావరాల వివరాలు ఉగ్రవాదుల చేతుల్లో నుంచి శత్రు దేశానికి వెళ్తున్నట్టు సమాచారం. ముఖ్యమైన పత్రాలు మాయమైనట్టు అనుమానం.

ఈ ప్రపంచంలో డబ్బు, సెక్స్, పదవి ఈ మూడూ అతి ప్రమాదకరమైనవి. వీటి కోసమే యుద్ధాలు జరిగినట్టు చరిత్రలో సాక్ష్యాలు వున్నాయి.

నీతిపరులు వున్న చోట అవినీతిపరులూ వుంటారు. ఒక వ్యక్తి బలహీనత వ్యవస్థను నాశనం చేసే ప్రమాదం వుంటుంది. అందుకే రక్షణ శాఖ, సిబిఐ లాంటి వాటిలో ప్రతి విషయం రహస్యంగా ఉంచబడుతుంది.

మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో 'దేశ భద్రత దృష్ట్యా రహస్యాలను కాపాడుతామని ప్రమాణం చేస్తారు. కానీ ఆ ప్రమాణం ఎంత వరకు నిలుపుకుంటారు? కుంటున్నారు? ఈ ఉపద్రవాన్ని అరికట్టాలంటే నిజాయితీ వున్న వ్యక్తులు కావాలి, తపస్సులా దేశ రక్షణకు కంకణం కట్టుకోవాలి. అలాంటి వ్యక్తి కోసం ఈ దేశంలోని రక్షణ వ్యవస్థ ఎదురుచూస్తోంది.

❖ ❖ ❖

కనిపించీ వినిపించని జ్ఞాపకమా... వినిపించే వేళ కనిపించకుండా వెళ్ళిన కన్నీటి వాక్యమా! నువ్వు కనిపిస్తావని ఎదురు చూస్తున్నా... నీతో గడిపిన క్షణాలను ఆహ్వానించి వాటితో ఆడుకుంటున్నా.

నిన్ను, నన్ను కలిపిన అమ్మ లేదు. మన నుదుటి రాత రాసిన బ్రహ్మ కనిపించడు.

ఇది వరమా? శాపమా? మళ్ళీ మనం కలుస్తామన్న ఆశ నా శ్వాసతో వెళ్లిపోతుందా?

మనసులో బాధ కన్నీటి అక్షరాలుగా మారుతోంది, ఆ అక్షరాలు గొంతులో ఉద్వేగమై పలుకుతున్నాయి.

కాలానికి ఈ ఫీలింగ్స్‌తో సంబంధం లేదు.

ఆ కాలం తన చాటున దాచిన రహస్యాలను వెలికితీసే అభిమన్యుడి కోసం ఎదురు చూస్తోందా? ఏమో!

❖ ❖ ❖

అది మన్మథరావ్ గెస్ట్‌హౌస్.

మన్మథరావ్ బాత్‌రూంలోకి వెళ్ళాడు. గీతికను అక్కడికి తీసుకు వచ్చి అప్పటికే రెండు గంటలు అయింది. ఒక మనిషి, అందులోనూ ఆడమనిషి మరో పది నిమిషాల్లో చస్తుంది అంటే ఈ పదినిముషాలు ఆమె అందాన్ని అనుభవించాలని అనుకునేంత నీచమైన మనస్తత్వం మన్మథరావ్‌ది. ఆ రెండు గంటలూ తన కోరిక తీర్చుకున్నాడు. మౌనంగా భరించింది గీతిక.

మరో అరగంటలో ఒక విఐపి రాబోతున్నాడు. అతనికి గీతిక శరీరం కానుక. అందుకు ప్రతిఫలంగా ఆ విఐపి వీళ్ళకు ఫేవర్ చేస్తాడు. ఆ ఫేవర్ ఖరీదు భారతదేశ భద్రత.

కేవలం రెండు శరీరాల రాపిడి కోసం ఒక దేశ భద్రతను పణంగా పెట్టే నీచ సంస్కారం డిపార్టుమెంటు పరువును తీస్తోంది. అంతకన్నా ఒక దేశాన్ని చీకటి వైపు తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తోంది అంటే సరిపోతుందేమో!

షవర్ కింద నిలబడి స్నానం చేస్తున్నాడు మన్మథరావ్. ఈ ప్రపంచంలో డబ్బు ఇచ్చే కిక్ మరేదీ ఇవ్వదన్న నమ్మకం అతనిది. జర్దారి లాంటి వాళ్ళు డబ్బును ఎరగా వేస్తారు. సిద్దప్ప, చతుర్వేదిలాంటి వాళ్ళు దాన్ని పెంచి పోషిస్తారు.

మరో గంటలో ఇక్కడ తన డ్యూటీ మారిపోతుంది. చివరి నిమిషంలో గీతికను మరో రాష్ట్రానికి తరలించే ఆలోచన మారిపోయింది.

పరాయి స్త్రీ పొందు ఇచ్చే ఆనందం, అందులోనూ పెళ్లి కాని అమ్మాయి ఫస్ట్ ఎక్స్‌పీరియన్స్ అతనికి కిక్ ఇచ్చింది.

రక్తం, సిరలు, ఫేషియల్స్, ధమనులు.. అదే శరీరం.. అదే రాపిడి కానీ కోరిక వేరే.. ఒక స్త్రీ చూపించే ప్రేమను, స్పర్శని ఇష్టపడడం వేరు. కానీ కేవలం మనసుతో ప్రమేయం లేని సెక్స్‌ను ఇష్టపడడం దేనితో సమానం?

మన్మథరావ్ లైఫ్‌కు ఎండ్ కార్డు పడబోతోంది.

మన్మథరావ్ బాత్‌రూంలో నుంచి బయటకు వచ్చాడు. మంచం మీద గీతిక నిర్వికారంగా కూర్చొని వుంది. ఆమెకు తన క్యారెక్టర్ అర్థమైంది. అతను చాలా వివరంగా చెప్పాడు. తను చెప్పినట్టు వినకపోతే జరుగబోయే ప్రమాదం ఆమెకు హెచ్చరించి మరీ చెప్పాడు.

"కూల్ గీతికా! కూల్. ఇదంతా లైఫ్‌లో ఒక పార్ట్, లైఫ్‌లో ఎదగాలంటే ఇలాంటి మెట్లు దిగాలి, అప్పుడే నువ్వు లిఫ్ట్‌లో పైకి వెళ్తావు" కూల్‌గా చెప్పాడు మన్మథరావ్.

గీతిక నవ్వింది. పగలబడి మరీ నవ్వింది.

ఆశ్చర్యంగా చూసాడు. బహుశా భయంతో మెంటల్‌గా అప్‌సెట్ అయ్యిందేమో అనుకున్నాడు.

"నిన్ను చూస్తుంటే జాలేస్తుంది మన్మథరావ్" మొదటిసారి పేరు పెట్టి పిలిచింది గీతిక.

కోపంగా చూసాడు ఆమె వైపు.

"నువ్వు కోపంగా చూస్తే భయపడిపోవడానికి నేను, నువ్వు ఇప్పటి వరకూ మోసం చేసిన పదిహేనుమంది అమ్మాయిల్లో ఒకదాన్ని కాను, కావాలనే నేను నీ ట్రాప్‌లోకి వచ్చాను. నా చివరి క్షణాల్లో డబ్బుతో దర్జాగా బ్రతకాలని వచ్చాను" అంది విలాసంగా కాళ్ళు ఊపుతూ.

"అంటే?"

"నేను ప్యూర్ వర్జిన్‌ని కాదు" అంటూ హ్యాండ్‌బాగ్‌లో నుంచి న్యూస్ పేపర్ కట్టింగ్స్ బయటకు తీసి అతని ముందు గిరాటేసింది. బ్రోతల్ కేసులో యువతి అరెస్ట్, వ్యభిచారం చేస్తూ పట్టుబడిన యువతి. కాస్ట్‌లీ కాల్ గర్ల్ అరెస్ట్ అన్నీ రకరకాల పేపర్ల కట్టింగ్స్.

‘‘వీటన్నింటిలో హీరోయిన్‌ని నేనే. నువ్వేదో గొప్పగా మురిసి పోతున్నట్టున్నావు నేను పెళ్ళికాని అమ్మాయిని అనుకొని. అయినా మీ మగాళ్ళకు ఏం కావాలిరా? ఎంతమంది అమ్మాయిలు కావాలిరా? ప్రేమతో, మనసుతో, స్పందనతో, స్పర్శతో సంబంధం లేదురా మీకు? అయినా అదంతా ఒక సైకలాజికల్ ఫీలింగ్, నథింగ్ ఎల్స్ కదరా? కళ్ళు మూసుకుని పడుకుంటే ఎవరైనా ఒక్కటేరా?’’ అంటున్న ఆమెని మధ్యలోనే అడ్డుకొని,

“అంటే నువ్వు నన్ను మోసం చేసావా?” అంటూ అరిచాడు మన్మధరావ్.

“మోసమా? అంటే ఏమిటి? ఒక పెళ్లి కాని అమ్మాయిని అనుభవించి, మరొకరికి తార్చాలని చూసే నీ ఆలోచన మోసం కాదా? అయినా ఈ ఆలోచన నాది కాదు నీ భార్యది, నీలాంటి వాడికి సరిగ్గా బుద్ధి చెప్పింది. ఇందులో ఫినిషింగ్ ట్విస్ట్ ఏమిటో తెలుసా” అంటూ హ్యాండ్ బాగ్‌లో నుంచి కొన్ని పేపర్స్ తీసి అతని ముందు గిరాటేసింది.. “అవి డాక్టర్ ఇచ్చిన మెడికల్ రిపోర్ట్స్. నాకు ఎయిడ్స్.. నీలాంటి కామాంధుల వల్ల వచ్చిన ఎయిడ్స్. నేను ఎక్కువ కాలం బ్రతకను. నా కన్నా కొద్దిగా ఆలస్యంగా నువ్వూ వస్తావు” అన్నది. అంతే ఆ చివరి మాట అతని మీద తీవ్ర ప్రభావాన్ని చూపింది. బరువైన సిమెంటు దిమ్మతో తలమీద మోదినట్టు నేలమీద దబ్బున పడ్డాడు మన్మథరావ్.

ఒక చిన్న అబద్ధం అతని ప్రాణాన్ని తీసేసింది. అతను చేసిన ఎన్నో తప్పులకు శిక్ష వేసింది. డాక్టర్ రిపోర్ట్స్ అబద్ధం అన్న నిజం అతనికి తెలియక ముందే తను చేసిన తప్పులకు శిక్ష అనుభవించాడు. అదే సమయంలో అక్కడికి వచ్చాడా విఐపి.

❖ ❖ ❖

శోధన టైం చూసుకుంది. తను వెళ్ళాల్సిన టైం దగ్గర పడుతోంది. మరో అరగంటలో తను అక్కడ వుండాలి. ఇక్కడి నుంచి మెయిన్ సర్కిల్‌కు వెళ్ళాలి. అక్కడి నుంచి తను పదిహేను నిమిషాల్లో వెళ్లిపోవచ్చు. బయటకు వచ్చి డోర్ వేసి లాక్ చేసింది. కిందికి దిగి వచ్చేసరికి అక్కడ రెండు చేతులూ ప్యాంట్ జేబుల్లో పెట్టుకుని నిలబడి వున్నాడు విశ్వక్.

“మీరా?” అంది.

"సినిమా హాల్ దగ్గరికి వచ్చి సినిమాకు వచ్చారా? అని అడుగుతున్నట్టు వుంది. అవును నేనే! ఇంత రాత్రి వేళ నీలాంటి వాంపయిర్ దగ్గరికి నేను కాక ఇంకెవరొస్తారు" అన్నాడు విశ్వక్.

"ఎందుకొచ్చారు?" కోపంగా అడిగింది.

"కాసేపు అలా ట్యాంక్‌బండ్ దగ్గరికి వెళ్లి వెనిలా ఐస్‌క్రీమ్ వన్ బై టు తిందామని."

"మీ కసలు మెదడు ఉందా? ఐస్‌క్రీమ్... అదీ ఇంత రాత్రివేళా?" కోపంగా అంది శోధన.

"చూసారా? ఇంత రాత్రి వేళా? అన్నారు గానీ నాతో రానని అనలేదు, సో మీరు నన్ను అది చేస్తున్నట్టే" అన్నాడు.

"అదా? అదేమిటి?" టైం చూసుకుంటూ అంది.

"లవ్వు" అన్నాడు విశ్వక్.

"అసలు కొవ్వు పట్టి" ఇంకా ఏమనాలో తోచలేదు. అసలే తను అర్జెంట్‌గా వెళ్ళాలి.

"కమాన్ కక్కేయ్. తిట్టాలని వుంటే తిట్టేయ్" అన్నాడు కవ్వింపుగా.

అవతల టైం లేదు. ఈ విశ్వక్ వదిలేలా లేడు. ఎందుకో ఏ జన్మ అనుబంధమో, ఏ రుణానుబంధమో కానీ అతడిని తిట్టాలని కూడా అనిపించడం లేదు శోధనకు.

"ప్లీజ్ నన్ను వదిలేయండి" అంది.

"వదిలేయడానికా వెంటపడింది?" అన్నాడు విశ్వక్.

"అయితే ఇప్పుడు నేనేం చేయాలి" టైం చూసుకుంటూ అంది శోధన.

"పోనీ ఐ లవ్ యు అనండి ఓ పనై పోతుంది."

ఒక్క క్షణం కోపంగా విశ్వక్ వైపు చూసి "ఐ లవ్ యు" అంది.

"ఊ.. పాపం పోనీ అని లవ్‌ని ముష్టి వేసినట్టు వుంది స్మయిలెక్కడ? ఫీలెక్కడ?"

పెదాలు విప్పి నవ్వి "ఐ లవ్ యు. చాలా" అంది.

"టూత్ పేస్టు యాడ్‌లా ఉన్నా ఇది కొద్దిగా బెటర్. సరే ఇంతకీ ఎక్కడికి? మళ్ళీ ఏ గ్యాస్ సిలిండర్స్ పేల్చడానికి" అడిగాడు విశ్వక్.

"ఐ లవ్ యు చెప్పమన్నావు చెప్పాను. వదిలేయ్" అంది.

"ఓకే రేపు కూడా చెప్పాలి" నవ్వుతూ అన్నాడు.

కోపంగా చూసి ముందుకు కదిలింది. స్కూటీ స్టార్ట్ చేసింది. 'తను మెయిన్ సర్కిల్ నుంచి వెళ్తే విశ్వక్ వెంటపడతాడు. షార్ట్ కట్‌లో సందుల్లో నుంచి వెళ్ళాలి అనుకుంటూ' అటు వైపు స్కూటీని మళ్ళించింది.

శోధన వెళ్ళగానే విశ్వక్ ఎవరికో ఫోన్ చేసాడు. "శోధన మెయిన్ సర్కిల్ నుంచి వెళ్ళడం లేదు, పావు గంట ఇక్కడ ఆపాను అదీ చాలా కష్టం మీద. నో డేంజర్. నేను ఫాలో అవుతూనే వుంటాను" అని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

❖ ❖ ❖

గీతిక వంగి మన్మథరావ్‌ను పరీక్షగా చూసింది.

"చనిపోయాడుగా!" అన్న మాటలు వినిపించాయి. కర్టెన్ చాటు నుంచి వస్తూ అన్నది వత్సల.

"చనిపోయాడు మేడం. మీరు చెప్పినట్టే జరిగింది. తనకూ ఎయిడ్స్ వస్తుందన్న భయం, తను ట్రాప్ చేయబడ్డాడు అన్న నిజం రెండూ కలిసి అతడిని డీప్ షాక్‌కు గురిచేసి వుంటాయి."

"ఒక వేళ ఆతను చావకపోయినా నేను చంపేసేదాన్ని. కాకపోతే అతని హెల్త్ కండిషన్ తెలుసు, ఇంతకు ముందే డాక్టర్ చెప్పాడు, అతను సడెన్ షాక్స్ వినకూడదని. అందుకే ఇలా ప్లాన్ చేశాను" అంది వత్సల.

కట్టుకున్న భర్త చనిపోయాడన్న ఫీలింగ్ లేదు ఆమె మాటల్లో. అవును మరి భర్త అంటే భార్యను కాపాడేవాడై ఉండాలి, తార్చేవాడై ఉండకూడదు. భర్త మరొకరితో ఎఫైర్ పెట్టుకున్నా సహించేదే కానీ అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటున్నాడు. దేశాన్నే అమ్మేయాలని చూస్తున్నాడు.

వత్సల గీతిక వైపు తిరిగి "థాంక్యూ గీతికా! ఇదంతా నీ వల్లనే" అంటూ హ్యాండ్‌బాగ్‌లో నుంచి కొన్ని డాక్యుమెంట్స్ తీసి ఇచ్చింది.

"ఇవేంటి మేడం?" వాటిని తీసుకుంటూ అడిగింది.

"మిస్టర్ మన్మథరావ్ ఆస్తిని సగం నీ పేరుతో రాసాను, మిగతా సగం ఆయన వల్ల దగా పడ్డవారికి, అనాథలైన మహిళలకు" అంది.

"నాకు ఈ ఆస్తి వద్దు మేడం!" అంది గీతిక.

"లేదు గీతికా! తీసుకోవాలి. నాకు చాలా బాధగా వుంది, నా స్వార్థానికి నిన్ను ఉపయోగించుకున్నాను, ఏ స్త్రీ చేయని పని చేశాను. స్వయంగా నేనే నిన్ను తార్చాను మరో మగవాడి దగ్గరికి."

"లేదు మేడం! నా అవసరాల కోసం, ఎదుటివారి స్వార్థం వల్ల నేనెప్పుడో నా శరీరాన్ని మగవాడి కోరికలకు విక్రయించడం మొదలుపెట్టాను. ఈ రోజు నా శరీరం ఒక దుర్మార్గుడికి శిక్ష విధించడానికి పనికి వచ్చింది. నేను సెక్స్ వర్కర్ అన్నది మాత్రమే నిజం. నాకు ఎయిడ్స్ వచ్చిందన్నది అబద్ధం, కానీ ఆ అబద్ధమే అతడికి శిక్ష వేసింది. నాలాంటి వారి కోసం మీరు చేసిన రిస్క్, తీసుకున్న నిర్ణయం గ్రేట్ మేడం" అంది గీతిక.

"ఈ గ్రేట్‌నెస్ నాది కాదు" అని ఆగింది. ఈలోగా అక్కడికి వచ్చింది శోధన.. "ఆ మేడంది" అంది శోధనను చూపిస్తూ వత్సల.

శోధన అక్కడికి వస్తూనే పరిస్థితి అంచనా వేసింది. అక్కడికి రావలసిన విఐపి రావడానికి ఇంకా పది నిమిషాల వ్యవధి వుంది. మధ్యలో ఆగిపోయాడు.

"రండి శోధనగారూ! ఆ రోజు డిటెక్టివ్ ఏజెన్సీలో మీరు కలిసివుండకపోయి వుంటే ఇదంతా జరిగేది కాదు" ఆ రోజు జరిగింది గుర్తు చేసుకుంది వత్సల.

స్మార్ట్ డిటెక్టివ్ ఏజెన్సీలో సాగరికతో మాట్లాడి బయటకు వస్తుంటే ఎదురు వచ్చింది శోధన.

"హలో! నా పేరు శోధన" అంది తనను తను పరిచయం చేసుకుంటూ.

"చెప్పండి" అంది వత్సల.

"మీ భర్తను నిజంగా మీరు శిక్షించాలని అనుకుంటే నేను చెప్పినట్టు చేయండి. మీరు హత్య చేస్తే నేరం అవుతుంది. అతను తనకు తాను చస్తే అది గుండెపోటు అవుతుంది. ఒక దుర్మార్గుడిని శిక్షించినట్టు అవుతుంది" అని వత్సలకు ఐడియా ఇచ్చింది శోధన.

"అలా నా భర్తకు శోధన మేడం చెప్పినటు శిక్ష విధించాలని అనుకున్నాను. అంతేకాదు ఈ దేశాన్ని కాపాడే పనిలో నేనూ ఉన్నాననే తృప్తి కూడా స్వంతం చేసుకున్నాను."

"వత్సలగారూ! మీరు నేను చెప్పినట్టు ఇన్‌స్పెక్టర్ శామ్యూల్‌కి ఫోన్ చేయండి. మీ భర్త ఒకమ్మాయితో కలిసి గెస్ట్‌హౌస్‌కు వెళ్ళాడని చెప్పండి. తర్వాత మిగతాది అతను చూసుకుంటాడు" అని గీతిక వైపు తిరిగి "మీరు మరో హెల్ప్ చేయాలి" అని ఏం చేయాలో చెప్పసాగింది.

గీతికలో కొత్త ఉత్సాహం, ఒక మంచిపని చేస్తున్నప్పుడు కలిగే నిజమైన ఆనందం.

చాలా జాగ్రత్తగా మన్మథరావ్ శవాన్ని బెడ్ రూంలోకి చేర్చారు.

సరిగా అప్పుడే ఆ గెస్ట్ హౌస్ ముందు కారు ఆగింది. అందులో నుంచి సిబిఐ డిప్యూటీ చీఫ్ వేదాచలం దిగాడు. యాభై అయిదు సంవత్సరాల వయసున్నా సీబీఐ మనిషి కావడంతో బలంగా కనిపిస్తున్నాడు. అతను ఒంటరిగానే స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడు. ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలు వుంటాయి. వేదాచలానికి డబ్బు, సెక్స్ ఈ రెండూ వీక్ పాయింట్స్.

ఈ రెండింటికీ తన పదవిని అడ్డుపెట్టుకొని బతికేస్తున్నాడు. సిబిఐ ఆఫీసర్ శోభనను పట్టుకోవడానికి వచ్చినట్టుగా అఫీషియల్ రికార్డ్. కొన్ని ముఖ్యమైన రహస్య పత్రాలతో శోభన మిస్ అయ్యిందని అందరినీ నమ్మించాడు వేదాచలం. ఆమెపై వారెంట్ కూడా వుంది. ప్రాణాలతో కానీ, శవంగా కానీ ఆమెను పట్టుకోవచ్చు.

వేదాచలం ఇక్కడికి వచ్చింది మరో పని మీద.

అందులో ఒక పని గెస్ట్‌హౌస్‌లో వుంది. మన్మథరావ్ అరేంజ్ చేసిన అమ్మాయితో.

వేదాచలం లోపలికి అడుగుపెట్టగానే ఆ గెస్ట్‌హౌస్‌లో రహస్యంగా అమర్చిన కెమెరాలు ఆన్ అయ్యాయి. వేదాచలం తనకు అలవాటు అయిన బెడ్‌రూంలోకి అడుగుపెట్టాడు. లోపల షవర్ పడుతున్న శబ్దం వినిపిస్తోంది. అతని ఒంట్లో వెచ్చటి ఆవిర్లు మొదలైనాయి.

మన్మథరావ్ ఎక్కడికి వెళ్లి వుంటాడు? ఆ క్షణం ఆ విషయం అతను పెద్దగా ఆలోచించలేదు. అతని అడుగులు బాత్‌రూం వైపు పడుతుండగానే బాత్‌రూం తలుపులు తెరుచుకున్నాయి. తల తుడుచుకుంటూ వచ్చింది గీతిక. ఒక్క క్షణం రెప్ప వాల్చకుండా చూసాడు.

"హాయ్ స్వీటీ! మత్తు ఎక్కించేలా వున్నావు" అంటూ ఆమె వైపు అడుగులు వేశాడు.

"ఏయ్ ఎవరు మీరు?" భయం నటిస్తూ అంది గీతిక.

"ఏంటి యాక్ట్ చేస్తున్నావ్? నేనెవరో తెలియదా? మన్మథరావ్‌ను పిలువ్. చెబుతాడు. నా కోసమే నిన్ను పిలిపించాడు. ఈ రాత్రి నాతో గడపడానికే నువ్వు వచ్చావు. నేను తలచుకుంటే నిన్ను క్వీన్‌ని చేస్తాను. మంచి మూడ్‌లో వున్నాను. విసిగించక రా" అప్పటికే అతను మందు కొట్టి ఉన్నాడు.

"నువ్వు నువ్వు ఎవరు?" గీతిక సందేహం నటిస్తూ అడిగింది.

"నేను సిబిఐ డిప్యూటీ చీఫ్‌ని. నా పేరు వేదాచలం. చాలా? ఇప్పుడైనా వస్తావా? ఈ రివాల్వర్‌తో నిన్ను షూట్ చేసి ఆ తర్వాత నిన్ను అనుభవించాలా?" తాగిన మత్తులో రివాల్వర్ బయటకు తీసాడు. ఒక్కసారిగా లైట్స్ ఆఫ్ అయ్యాయి. రివాల్వర్ పేలిన శబ్దం, ఒక చావు కేక వినిపించింది. లైట్స్ ఆన్ అయ్యాయి. గీతిక వెనుక మన్మథరావ్, అతని గుండెలో నుంచి దూసుకు వెళ్ళిన బుల్లెట్, వేదాచలం చేతిలోని రివాల్వర్ పొగలు కక్కుతూ.

ఎవరో తన చూపుడు వేలిని ప్రెస్ చేసినట్టు అనిపించింది. కానీ ఇదంతా నిమిషాల్లో జరిగింది.

"ఏమైంది" తనలో తనే గొణుక్కుంటూ అడిగాడు వేదాచలం.

"హత్య జరిగింది, నా కోసం మీరు, మన్మథరావ్ పోట్లాడుకున్నారు. ఆ పెనుగులాటలో మీరు మన్మథరావ్‌ను చంపేసారు" అన్నది.

"అబద్ధం!" అరిచాడు వేదాచలం.

"కాదు నిజం" వెనుక నుంచి వినిపించింది.

వెనక్కి తిరిగి చూస్తే ఇన్‌స్పెక్టర్ శామ్యూల్.

"ఇన్‌స్పెక్టర్... రండి! ఈ అమ్మాయి నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తోంది. మన్మథ రావ్‌ను ఈమె చంపేసింది. ముందు అరెస్ట్ చేయండి" గబా గబా చెప్పేసాడు.

"ఇంతకీ మీరెవరు సార్?" శామ్యూల్ అడిగాడు.

"నేను సిబిఐ డిప్యూటీ చీఫ్‌ని" గర్వంగా చెప్పాడు.

"మరి మీకు ఇక్కడ ఏం పని? మీకు అఫీషియల్‌గా గెస్ట్‌హౌస్ ఉందిగా!" శామ్యూల్ అడిగాడు.

"మిస్టర్! హోల్డ్ యువర్ టంగ్. ముందు నేను చెప్పినట్టు చెయ్. ఆఫ్ట్రాల్ ఇన్‌స్పెక్టర్‌వి" కోపంగా అన్నాడు వేదాచలం.

"ఒక్కసారి ఈ వీడియో ఫుటేజ్ చూడండి సార్! మీరు ఇక్కడకి వచ్చినప్పటి నుంచి రికార్డు అయిన ఫుటేజ్. దీన్ని ఏ టీవీ చానెల్‌లో ఇచ్చినా సూపర్‌గా వుంటుంది" అన్నాడు శామ్యూల్.

వేదాచలం మోహంలో రంగులు మారాయి. ఇందాక తాను వాగిన వాగుడు అంతా ప్లాన్డ్‌గా రికార్డ్ చేయబడిందని అర్థమైపోయింది.

"అసలు మీరెవరు? మీకేం కావాలి?" కీచుగా అరిచాడు.

"నిజం కావాలి" అన్న గొంతు వినిపించింది.

ఎదురుగా శోధన...

"నువ్వు... నువ్వు శోభనవి కదూ!"

ఒక్క క్షణం ఆ పేరు వినగానే శోధన వెన్నులో చిన్న కంపనం.

"యస్. ఆ శోభన గురించి నిజం కావాలి, నేను ఆ శోభన చెల్లెలిని" అతని ఎదురుగా కూచుంటూ అంది.

"ఒక సిబిఐ చీఫ్‌ని ఇలా బెదిరిస్తే ఎంత పెద్ద నేరమో తెలుసా? అసలు ఆ దుర్జనరావ్‌గాడు ఎక్కడ?" కోపంగా అరిచాడు వేదాచలం.

అతని చెంప చెళ్ళుమనిపించింది శోధన.

"ఒక సిబిఐ చీఫ్ ఇంత చీప్‌గా అమ్మాయి కోసం చొంగ కార్చడం కూడా నేరమే. ముందు నిన్ను అరెస్ట్ చేస్తారు. అదే నేనైతే అరెస్ట్ వారెంట్ కూడా అక్కర్లేదు.

డైరెక్ట్ డెత్ వారెంట్ ఇస్తాను. అయినా నీకు దుర్జనరావ్ గురించి కావాలా? వాడిని నాలుగు పీకితే వాడే నీ గురించి చెప్పాడు" అంది శోధన.

సరిగ్గా ఇరవై నాలుగు గంటల క్రితం...

దుర్జనరావ్ సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. విక్కీ కేసులో వున్నది ఎవరు? భార్గవి చెప్పిన ప్రకారం ఆమె శోధన అయ్యే అవకాశం వుంది. భార్గవి ఆ రోజు తన ట్రాప్‌లో నుంచి తప్పించుకుంది. ఈ రోజు తను శోధనను ట్రాప్ చేస్తే? ఆమె ఎక్కడుందో కూడా తెలిసింది. అయితే తన ఆలోచనల్లో మెదులుతున్నదంతా ముందే పకడ్బందీగా ప్లాన్ చేయబడిందని మాత్రం ఊహించలేకపోయాడు.

వెంటనే ఒక్కడే బైక్ మీద ఆ ప్రాంతానికి బయల్దేరాడు. అప్పటికే చతుర్వేది స్థావరం ఒకటి గ్యాస్ పేలుడులో తునాతునకలు అయ్యింది. ముఖ్యమైన డాక్యు మెంట్స్ కాలిపోయాయి. ఈ టైంలో తనకు శోధన దొరికితే ప్రమోషన్ గ్యారంటీ.

ఆ ఉత్సాహంతో అతను వెళ్ళాడు. అక్కడ అతని ఫేట్ తారుమారు అయింది. శోధన చాలా ప్లాన్డ్‌గా అతడిని బంధించింది. టార్చర్ అంటే ఏమిటో రుచి చూపించింది. థర్డ్ డిగ్రీ అంటే ఏమిటో ప్రాక్టికల్‌గా అతనికి తెలిసి వచ్చింది.

"ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని ఇలా బంధిస్తే ఏమవుతుందో తెలుసా?" అన్నాడు బింకంగా దుర్జనరావ్.

"ఏమీ కాదు తెల్లవారితే నీ డెడ్ బాడీ కుప్పతొట్టిలో పడి వుంటుంది" అంది శోధన తాపీగా.

"హోమ్‌మినిస్టర్‌కు తెలిస్తే ఏమవుతుందో తెలుసా?" అన్నాడు దుర్జనరావ్.

"కనుక్కుంటాను" అని డైరెక్ట్‌గా హోమ్‌మినిస్టర్‌కు ఫోన్ చేసింది. "సర్ ఇక్కడ మీ సిఐని నేను బంధించాను. వాడు చేసే వెధవ పనులు మీకు యంయంఎస్ ద్వారా పంపించానుగా, వీడిని ఏం చేయమంటారు సర్?" స్పీకర్ ఆన్ చేసి అడిగింది.

"ఎన్‌కౌంటర్ చేసేయ్, ఏదైనా ప్రాబ్లం వస్తే నేను చూసుకుంటాను, అన్నట్టు వాడి సర్వీస్ రివాల్వర్‌తోనే కాల్చేయ్. అప్పుడు వాడే సూసైడ్ చేసుకున్నట్లు కలర్ ఇస్తే సరిపోతుంది. మళ్ళీ కేసులని, కోర్టులని ఎందుకు చెప్పమ్మా?" హోమ్ మినిస్టర్ గొంతు ఔట్ స్పీకర్లోంచీ వినిపిస్తోంది.

హోమ్‌మినిస్టర్ మాటలు డైరెక్ట్‌గా విన్న దుర్జనరావ్‌లో ప్రాణభయం మొదలైంది.

"నిన్ను చంపితే నేను హ్యాపీగా వుంటాను, లేకపోతే మళ్ళీ టెన్షన్. డ్యూటీలోకి వచ్చాక మళ్ళీ పగబడతావు. ఇదంతా ఎందుకు? నిన్ను ఇక్కడే ఫినిష్ చేస్తే సింపుల్‌గా పనైపోతుంది" శోధన చేతులు రాసుకుంటూ తాపీగా అంది.

"వద్దు. నన్ను చంపొద్దు నీకేం కావాలో అడుగు" భయంగా అన్నాడు.

"రేపు ఇక్కడికి వచ్చే విఐపి ఎవరు? ఎందుకు వస్తున్నాడు? ఎక్కడికి వస్తున్నాడు?" సూటిగా అడిగేసింది శోధన.

"ఎందుకు వస్తున్నాడో తెలియదు. అ వస్తున్నది మాత్రం సి బి ఐ డిప్యూటీ చీఫ్. రేపు రాత్రి మన్మథరావ్ గెస్ట్ హౌస్‌కు వస్తున్నాడు అమ్మాయి కోసం" చెప్పాడు దుర్జనరావ్.

"వెరీ గుడ్" అంటూ దుర్జనరావ్ హోల్ స్టర్‌లో వున్న అతని సర్వీస్ రివాల్వర్ తీసింది శోధన. ఆమె చేతికి గ్లవుజ్లు వున్నాయి. రివాల్వర్‌ని పాయింట్ బ్లాక్ రేంజ్‌లో గురిపెట్టింది. చూపుడు వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకుంది.

"నన్ను వదిలిపెడతానని అన్నావు" దుర్జనరావ్ అన్నాడు.

"యస్ వదిలి పెడుతున్నాను. నిన్ను కాదు నీ సర్వీస్ రివాల్వర్‌లోని బుల్లెట్‌ని." ట్రిగ్గర్ నొక్కింది. బుల్లెట్ అతని గుండెలో నుంచి చొచ్చుకుపోయింది.

అతను సర్వీస్‌లో ఒక్క మంచి పని కూడా చేయలేదు. అందుకే ఆ సర్వీస్ రివాల్వరే దుర్జన్‌రావ్‌ని చంపేసింది.

❖ ❖ ❖

"ఇప్పుడు చెప్పు! నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు? శోభన ఎక్కడ? నాకు తెలుసు. మీరే ఎక్కడో దాచారు. నిన్ను చంపను. నీ ఒంట్లో వున్న ఒక్కో పార్ట్‌ని రోజుకు ఒకటి చొప్పున పందికొక్కులకు ఆహారంగా వేస్తాను" కర్కశంగా చెప్పింది శోధన.

"నిజమే చెబుతున్నాను. నాకు మీ అక్క ఎక్కడ వుందో తెలియదు. దేశ భద్రతకు సంబంధించిన కీలక పత్రాల చోరీలో నేనూ వున్నానని మీ అక్క శోభన పసిగట్టింది. మీ అక్క మీద చతుర్వేది ద్వారా ఎటాక్ చేయించాను. ఆ దాడిలో

మీ అక్క తప్పించుకుంది. నాకు వ్యతిరేకంగా సాక్ష్యాలు వెతకసాగింది. అందుకే మీ అక్క మిస్సయిందని ప్రచారం చేశాను. పోలీస్ ద్వారా మీ అక్కను అరెస్ట్ చేయించాలని అనుకున్నాను. షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ కూడా తీసుకున్నాను.

ఓ పక్క ఇక్కడ పోలీసుల ద్వారా మీ అక్కను పట్టుకోవడానికి ప్లాన్ చేశాను.

మరో పక్క మిలిటరీకి సంబంధించిన రహస్య స్థావరాల వివరాలు యాష్కీ ద్వారా ఉగ్రవాదులకు, పొరుగు రాష్ట్రానికి పంపే పని మీద ఇక్కడికి వచ్చాను” అంటూ చెప్పాడు వేదాచలం.

యాష్కీ ఆ పేరు వినగానే ఉలిక్కిపడింది శోధన.

ఆమె జర్నలిస్ట్ బుర్రకు ఆ పేరు కనెక్ట్ అయింది.

ఆమె మౌనంగా లేచింది. శామ్యూల్ వైపు తిరిగి “మీరు నాతో రండి” అంది. గీతిక వైపు తిరిగి “వీడు జాగ్రత్త” అని చెప్పింది.

“మేడం ఆ వేదాచలాన్ని గీతికకు వదిలేసి వచ్చారు” బయటకు వస్తూ అన్నాడు శామ్యూల్.

“కావాలనే వదిలేసాను. అతను మరి కాసేపటిలో తప్పించుకుంటాడు. మీరు చేయవలిసింది అతడిని ఫాలో అవ్వడమే. నాకు ఎప్పటికప్పుడు ఇన్‌ఫర్మేషన్ ఇవ్వండి, నేను మా అక్కను కాపాడుకోవాలి. హోమ్‌మినిస్టర్‌ని కలవాలి. యాష్కీకి సంబంధించిన వివరాలు కలెక్ట్ చేయాలి” అంది శోధన.

“ఓకే మేడం! మీరు చెప్పినట్టే నేను వేదాచలాన్ని ఫాలో అవుతాను” చెప్పాడు శామ్యూల్.

వాళ్ళు అనుకున్నట్టుగానే వేదాచలం అక్కడి నుండి పారిపోయాడు.

అతను సరాసరి చతుర్వేది దగ్గరికి వెళ్ళాడు.

సిద్దప్ప, చతుర్వేది ఇద్దరే వున్నారు ఆ గదిలో.

మొదటిసారి చతుర్వేది భయానికి గురయ్యాడు. ఆ భయం అతడిలోని రాక్షసుడిని నిద్ర లేపింది. శత్రువుకు బ్రతికే అవకాశం ఇస్తే తనకు చావు దగ్గరలోనే వుందని అర్థం.

తను బ్రతకాలంటే శత్రువు చావాలి.

ఇప్పటి వరకూ తన నేర సామ్రాజ్యంలో అడుగుపెట్టినవారు లేరు. అడుగు పెట్టి బ్రతికినవాళ్ళు లేరు. అలాంటిది ఓ ఆడది, ఆఫ్ట్రాల్ ఓ ఆడది తన సామ్రాజ్యానికే భయం పుట్టించింది. భయం అంటే ఎలా వుంటుందో చూపించింది.

సిటీలో వున్న గుండాలను తలో మూలకు పంపించాడు. శోధన ఎక్కడ కనిపించినా చంపేయమని చెప్పాడు. శోధనను చంపినవారికి పదికోట్ల నజరానా ప్రకటించాడు.

అదే సమయంలో వేదాచలం దగ్గరి నుంచి ఫోన్ వచ్చింది.

❖ ❖ ❖

అర్ధరాత్రి రెండు దాటింది... స్కూటీని వేగంగా డ్రైవ్ చేస్తోంది శోధన. సడెన్‌గా తన స్కూటీ ముందు విశ్వక్ బైక్ ఆగింది.

సడెన్ బ్రేక్‌తో ఆపి కోపంగా అతని వైపు చూసింది. తను చాలా ముఖ్యమైన పని మీద వెళ్తోంది. ఈ టైంలో ఇతను ఇలా ఎదురు రావడం చికాకుగా వుంది. ఇన్నాళ్ళ తన నిరీక్షణ ఫలించే వేళ అది.

"హలో అర్ధరాత్రి ఎవరి కోసం అన్వేషణ?" నవ్వుతూ అడిగాడు బైక్ స్టాండ్ వేసి ఆమె దగ్గరికి వచ్చి.

"నీకు అసలు సీరియస్‌నెస్ లేదా? ఎవరెట్లా పోతే నాకేమిటి అనుకుంటావా? నా దారికి అడ్డురాకు" కోపంలో ముక్కుపుటాలు అదిరిపడుతుండగా అంది శోధన.

"అరె! కోపంలో నువ్వు చాలా అందంగా వున్నావు. పోనీ ఓ పని చేయ్ నీకు ఏం కావాలో చెప్పు, నేను చేసి పెడతాను. నువ్వు నాకోసం పిల్లల్ని కనిపెట్టు చాలు. క్రికెట్ టీంలా అవసరం లేదు. జస్ట్ చెస్ గేమ్‌లోలా ఇద్దరు చాలు."

శోధన చుట్టూ చూసింది. ఎడమ వైపు రోడ్డుకు ఓ పక్కగా ఇనుప రాడ్ వుంది. తను ఇక్కడి నుంచి ఇంటికి వెళ్ళాలంటే విశ్వక్ నుంచి బయటపడాలి. ఇప్పుడు సెంటిమెంట్ ముఖ్యం కాదు. అక్కడికి వెళ్ళింది. ఆ రాడ్‌ని చేతిలోకి తీసుకుంది.

"ఏయ్ ఏం చేయబోతున్నావ్?" అడిగాడు కంగారుగా.

కానీ అప్పటికే ఆమె చేయి ఆ రాడ్‌ని చేతిలోకి తీసుకోవడం చేసింది. బలమంతా ఉపయోగించి అతని తల మీద కొట్టింది. రక్తం చిమ్మింది.

ఒక్క క్షణం బాధగా కళ్ళు మూసుకుంది. అలానే విరుచుకుపడ్డాడు విశ్వక్.

ఆమె గుండె తల్లడిల్లింది, ఆమెలోని ఆడతనం చెమ్మగిల్లింది.

చటుక్కున వెళ్లి అతని తలను తన ఒడిలోకి తీసుకుంది, తన చున్నీ చింపి అతని తలకు గట్టిగా కట్టింది.

వెంటనే 108కు ఫోన్ చేసింది.

అది వచ్చేవరకూ అక్కడే పచార్లు చేసింది. అతడి నుదురు మీద ముద్దు పెట్టుకుంది.

“నన్ను క్షమించు. నాకు మరో మార్గం లేదు” మనసులో అనుకుంది.

విశ్వక్ నేల మీద పడిపోతూ “జాగ్రత్త శోధనా!” అన్న మాటలు వినిపించాయి. అంత బాధలోనూ అతను తన రివాల్వర్ శోధన చేతిలో పెట్టడం మర్చిపోలేదు.

108 వెళ్ళిపోయింది. శామ్యూల్‌కు ఫోన్ చేసి విశ్వక్ గురించి చెప్పింది.

తర్వాత తన ఆలోచన మార్చుకుని వైదేహి వుండే ఆశ్రమం వైపు వెళ్ళింది. అక్కడైతే తనను విశ్వక్ డిస్ట్రబ్ చేయడు అనుకుంది.

అయితే విశ్వక్ వచ్చింది తనను డిస్ట్రబ్ చేయడానికి కాదని, తనను సేవ్ చేయడానికని ఆమెకు తెలిసేసరికి ఆలస్యమైంది. ఆమెను వెంటాడుతూ బయల్దేరారు చతుర్వేది నియమించిన కిరాయి హంతకులు.

తన స్కూటీని ఆగంతకులు ఫాలో అవుతోన్న విషయం అర్థమైంది. స్పీడ్ పెంచింది. సడెన్‌గా స్కూటీ స్లిప్ అయి కిందపడి చేయి గీరుకుపోయింది. అయినా అలాగే పరుగెత్తింది. ఇప్పుడు వాళ్లకు ఎదురు తిరగడం కన్నా తన లక్ష్యాన్ని చేరుకోవడం ముఖ్యం. ఆమె వగరుస్తోంది.

సడెన్‌గా గుర్తొచ్చింది విశ్వక్ తన చేతిలో పెట్టిన రివాల్వర్. అందరూ తనను రౌండప్ చేసారు. మెల్లిగా హ్యాండ్ బాగ్‌లో నుంచి రివాల్వర్ తీసింది.

శోధన చేతిలోని తుపాకీ ఒక్కసారిగా గర్జించింది. వరుసగా ఆరు బుల్లెట్స్ బయటకు వచ్చాయి, ఊహించని ఈ పరిణామానికి వాళ్ళు ఖంగు తిన్నారు. వాళ్ళు తెరుకునేలోపు శోధన పరుగుపెట్టింది. అయితే రివాల్వర్ పేలిన శబ్దానికి

పక్కనే దగ్గరలో వున్న ఆశ్రమంలోని వారు లేచారు. ముందుగా ప్రమాదాన్ని ఊహించి రెస్పాండ్ అయ్యింది వైదేహి.

అంతేకాదు అందరినీ ఎలర్ట్ చేసింది. పలుగులు, పారలు, అరుపులు.

కిరాయి హంతకుల్లో ముందు కంగారు పుట్టింది. ఎక్కడ అంతా మేలుకుంటారో అని భయం..

ఒక్కసారిగా ఆశ్రమంలో వున్నవాళ్ళంతా వచ్చేసరికి కిరాయి హంతకులకు ఏం చేయాలో తోచలేదు వెనక్కి తిరిగిపోవడం తప్ప గత్యంతరం కనిపించలేదు.

శోధనకు మెల్లి మెల్లిగా స్పృహ తప్పుతోంది.

❖ ❖ ❖

కాసేపటి తర్వాత మెల్లిగా కళ్ళు తెరిచింది శోధన. ఎదురుగా వైదేహి.

"ఇప్పుడు ఎలా వుంది తల్లీ!" ఆప్యాయంగా అడిగింది నుదురు మీద చేయి వేసి.

ఒక్క క్షణం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అక్క శోభన గుర్తొచ్చింది.

ఒక్క ఉదుటున లేచింది. టైం చూసుకుంది శోధన. ఉదయం ఏడు. రాత్రి జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

టైం లేదు. ఏ క్షణమైనా తన అక్కకు ప్రమాదం ఏర్పడవచ్చు.

ఏ క్షణమైనా మన దేశ రహస్యాలు యాష్కీ ద్వారా ఉగ్రవాదులకు చేరవచ్చు.

"మేడం మీ దగ్గర ల్యాప్‌టాప్ ఉందా?" అని అడిగింది.

క్షణాల్లో ల్యాప్‌టాప్ అక్కడికి వచ్చింది.

క్లుప్తంగా జరిగిన విషయాలు చెప్పింది.

యాష్కీకి సంబంధించిన విషయాలు చెక్ చేసింది. యాష్కీ మరణించిన వార్త, యాక్సిడెంట్ వార్తలు అన్నీ కలెక్ట్ చేసింది.

వెంటనే ఇన్‌స్పెక్టర్ శామ్యూల్‌కు ఫోన్ చేసింది.

యాష్కీకి సంబంధించిన ప్రత్యేక కథనం తయారు చేసింది.

యాష్కీకి సంబంధించిన వీడియో క్లిప్స్ అపుడు గుర్తొచ్చింది. అక్క యాష్కీ కేసు గురించి చెప్పిన విషయం... అప్పుడు తను అన్న మాటలు.

"ఏయ్ శోధన! నేను డీల్ చేస్తున్న ఈ కేసు ఎవరిదో తెలుసా? యాష్కీ అని సుపారీ తీసుకుని హత్యలు చేసేవాడిది. అతను చేయని చట్ట వ్యతిరేకమైన పనులు లేవు. రిస్క్ చేసి.. వీడి లావాదేవీలు షూట్ చేశాను. వీడికి సంబంధించిన మొత్తం డీటెయిల్స్" ఇంకా చెప్పబోతుంటే రెండు చేతులు జోడించి,

"అక్కా! నీకో దండం, ఈ కేసులు గొడవలూ వద్దు. నా మాట విని నువ్వు ఉద్యోగానికి రాజీనామా చేసేయ్"అంది.

"తప్పు శోధన! అలా అనకు. శోధన అంటే అర్థం ఏమిటో తెలుసా అసలు? నిరంతరం శోధిస్తూనే వుండాలి. నువ్వు మంచి జర్నలిస్ట్‌వి కావాలి. అందుకే నీకా పేరు పెట్టాను."

"అయితే నా పేరు నువ్వు తీసుకో, నీ పేరు నాకివ్వు. నేను సినిమా నటి శోభనలా హీరోయిన్‌ని అయిపోతా" అంది.

"నిన్ను మార్చాలంటే నేను కనిపించకుండా పోవాలి, పోనీలే ఈ యాష్కీ డిటెయిల్స్ నీ మెయిల్‌లో పెడుతున్నా. మంచి క్రైమ్ సినిమాలా వుంటుంది" నవ్వి చెప్పింది శోధన మెయిల్‌లో సేవ్ చేస్తూ.

ఒక్కసారిగా చిన్నపాటి ఉద్వేగం... శోధన చేతులు వణుకుతున్నాయి.

తన మెయిల్ ఐ డీ గుర్తుచేసుకుంది. ఇన్నాళ్ళూ ఆ అవసరమే రాలేదు. తను ఆ విషయమే మర్చిపోయింది. తను మరో మెయిల్‌ను క్రియేట్ చేసుకుంది.

పాస్ వర్డ్...

పాస్ వర్డ్...

శోభన...

ఎనిమిది అక్షరాల పాస్ వర్డ్.

కళ్ళు మూసుకుని దేముడిని ప్రార్థించింది.

మెయిల్ ఓపెన్ అయింది.

ఆమె కళ్ళు యాష్కీ మేటర్‌ని, వీడియో క్లిప్‌ను వెతుకుతున్నాయి.

"గాటిట్..." గట్టిగా అరిచింది.

వైదేహి నవ్వుతూ చూసింది. శోధన ఆనందం తెలుస్తోంది. ఆ పరిస్థితిలో ఎవరున్నా అలానే రియాక్ట్ అవుతారు.

“మేడం! అనుకున్నది సాధించాను” సంతోషంగా చెప్పింది.

వెంటనే శామ్యూల్‌కు ఫోన్ చేసింది.

అరగంటలో యాష్కీ చీకటి చరిత్ర వెలుగులోకి రావాలి.

వైదేహి వేడి వేడి ఇడ్లీ తీసుకు వచ్చి ఇచ్చింది. ఇలా తృప్తిగా తినక ఎంత కాలమైంది? ఎందుకో ఆ క్షణం ఆమెకు విశ్వక్ గుర్తొచ్చాడు, అతను ఇచ్చిన రివాల్వర్ తన ప్రాణాలు కాపాడింది. తను ఎంత నిర్దాక్షిణ్యంగా అతడిని గాయపరిచింది.

శోధన ఆలోచిస్తూ ఉండగానే శామ్యూల్ వచ్చాడు.

అతను రాగానే శోధన అడిగిన మొదటి ప్రశ్న “విశ్వక్ ఎలా వున్నారు?”

“సారీ మేడం! అతను నేను వెళ్లేసరికి వెళ్ళిపోయారు” చెప్పాడు శామ్యూల్.

“తీవ్రమైన గాయంతోనా?” తనలో తనే గొణుక్కుంది శోధన.

“ఏంటి మేడం?” అడిగాడు శామ్యూల్.

“ఏమీ లేదు… ఈ రివల్వర్ అతనికి ఇద్దామని” అంది ఏం చెప్పాలో తోచక విశ్వక్ ఇచ్చిన రివాల్వర్ శామ్యూల్‌కు చూపిస్తూ.

ఆమె మనసంతా అతనే నిండి వున్నాడు.

ఒక గొప్ప భావం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

శామ్యూల్ ఆ రివాల్వర్ చూసి “ఈ రివాల్వర్ విశ్వక్‌గారిదేనా?” అడిగాడు.

“అవును అతనే ఇచ్చాడు. ఏం?” అడిగింది శోధన.

“అంటే విశ్వక్‌గారు సిబిఐ ఆఫీసర్ అన్నమాట” అన్నాడు కాసింత ఎగ్జయిట్ అవుతూ.

ఉలిక్కిపడింది శోధన “ఏమన్నారు?”

“యస్ మేడం! ఈ రివాల్వర్ కేవలం సిబిఐ మాత్రమే ఉపయోగిస్తుంది.”

చిన్నపాటి ప్రకంపనం కలిగింది ఆమెలో.

తన వెంట ఒక రోమియోలా పడ్డాడు.

తను తిడితే నవ్వేసాడు, తను గెటవుట్ అన్నా చిరునవ్వే.

చివరికి తను తెలివి తక్కువగా చావుదెబ్బ తీసినా తనను రక్షించడానికి ఈ రివాల్వర్ ఇచ్చాడు.

కాదు తన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాడు తన విశ్వక్. ఆ ఆలోచనే గొప్పగా వుంది.

శోధన కిటికీలో నుంచి ప్రపంచాన్ని చూస్తుంది. తను రోజూ చూస్తూనే వున్న ప్రపంచం అయినా కొత్తగా కనిపిస్తోంది ఇవ్వాళ. ఆ కొత్తదనం విశ్వక్ వల్ల వచ్చింది అన్న ఆలోచన రాగానే ఆమె మనసులో చిన్న ఉలికిపాటు, చిన్న భావోద్వేగ కెరటం సునామీలా చుట్టేసాయి. శరీరం రక్తాన్ని పంప్ చేసిన ఫీలింగ్ శరీరాన్ని, మనసును విశ్వక్ చుట్టేసిన అనుభూతి. అప్రయత్నంగా రెండు కన్నీటి చుక్కలు శోధనకు తెలీకుండానే బుగ్గల మీదినుండి జారిపడ్డాయి.

వి...శ్వ...క్...

ఆమె పెదవుల మీద ఆ పేరు హత్తుకుపోయినట్టు అనిపించింది. బయట వెన్నెల దట్టంగా కురుస్తోంది తనలో తడవమన్నట్టు. రాత్రి పదకొండు దాటింది. ఒక్కసారి అలా బయటకు వెళ్లిరావాలన్న కోరిక బలంగా ఆమెలో మొదలైంది. ఆలోచన వచ్చిందే ఆలస్యం ఆమె బయటకు నడిచింది.

వెన్నెల్లో ఆమ్మాయి ఇలానే ఉంటుందా అన్నంత అందంగా నడుస్తోంది. ఆమె నడుస్తోంటే ఒయ్యారం ఈర్ష్యగా చూస్తోంది. నిర్మానుష్యమైన రోడ్డు. దూరంగా ఐస్‌క్రీం అమ్మే బండి వుంది. బటర్ స్కాచ్ తినాలనిపించింది. తను, శోభన ఇష్టంగా తినే ఫ్లేవర్ అది. ఢిల్లీ వీధుల్లో అల్లరి చేస్తూ, గంతులు వేస్తూ తిరిగిన దృశ్యాలు కనిపించి మనసు హిమపాతాన్ని వర్షించింది.

ఆ రోజు బాగా గుర్తు తనకు...

ఢిల్లీ...

రాత్రి పదకొండు దాటిన సమయం...

"ప్లీజ్ అక్కా! మనం స్కూటీమీద వెళ్దాం?" శోధన అక్కను బ్రతిమి లాడుతోంది.

"ఏయ్! నీ అల్లరి ఎక్కువవుతోంది. ఈ టైంలో స్కూటీ మీద ఢిల్లీ రోడ్ల మీద, అదీ చలికాలం, పైగా ఐస్‌క్రీం కోసం వెళ్ళాలా? అయినా చలికాలం చల్లగా ఐస్‌క్రీం ఏమిటే?" ముద్దుగా కోప్పడింది శోభన.

వెంటనే అక్కడి నుంచి లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

రెండు నిమిషాల తర్వాత కింది నుంచి శోభన గొంతు.

"నేను బటర్ స్కాచ్ కోసం బయటకు స్కూటీ మీద వెళ్తున్నాను. ఎవరైనా రావాలనుకుంటే రావచ్చు" అంటోంటే వెంటనే పరుగెత్తుకు వచ్చింది శోధన. అలానే నైట్ డ్రెస్‌లో వస్తూనే అక్కను గట్టిగా పట్టేసుకుంది. ఏడుపు వచ్చేసింది "సారీ" అంది.

"ఏయ్ పిచ్చీ! సారీ ఎందుకు?"

"నేను అలిగి పైకి వెళ్ళిన రెండు నిమిషాల్లో నువ్వు పడ్డ బాధకు" అంది.

"కన్నీళ్లు దాచుకో నా కోసం ఎప్పుడైనా ఏడవడానికి పనికి రావచ్చు" శోభన అంది.

ఆ జ్ఞాపకం మదిలో ఒక్క క్షణం మనసు భారంగా మారింది.

ఆ రోజు అక్క అన్న మాటలు నిజమయ్యాయి కదా అనీ.

"చిన్నపిల్లలు మాత్రమే ఏడుస్తారు?" అన్న మాటలు వినిపించి పక్కకు తిరిగి చూసింది.

విశ్వక్.

"నువ్వా? మీరా?" ఆశ్చర్యంగా అంది.

"నువ్వా? మీరా? ఏదో ఒకటి కన్‌ఫర్మ్ చేసుకోవాలి" అదే నవ్వు విశ్వక్‌లో.

"మీరా? అంది.

"నేనే... నీ నేనే" అనాలని ఉన్నా అనలేకపోయాడు. కానీ ఎందుకో ఆ రాత్రి అతనికి అందంగా కనిపిస్తోంది. ఆనందంగా అనిపిస్తోంది.

"మీరేమిటి ఇక్కడ?" కాసింత విస్మయం.

"హాయిగా చలిలో బటర్ స్కాచ్ తిందామని, అదీ అందమైన నీలాంటి

అమ్మయితో అయితే ఇంకా రొమాంటిక్‌గా వుంటుందని” ఆమె వంకే చూస్తూ అన్నాడు.

“నాతోనా...నో నెవ్వర్” బెట్టుగా అంది.

“ఐస్‌క్రీంను, లవ్ ఫ్లేవర్‌ను ఎప్పుడూ మిస్ చేసుకోకూడదు. ముఖ్యంగా నీ లాంటి మిస్‌లు అందులోనూ ఓ మిస్టర్ ఇండియా లాంటి జెంటిల్‌మేన్ ఆఫర్ చేస్తున్నప్పుడు” ఆమె వంకే కొంటెగా చూస్తూ అన్నాడు విశ్వక్.

“దిసీజ్ టూ మచ్. నా గురించి మీకు తెలియదు నేను...”

“ఆ నువ్వు సివంగివా? ఆడపులివా? ఏం... సివంగి, ఆడపులి ఐస్‌క్రీంలు తినవా?” అదే నవ్వు.

కోపం కన్నా ఉక్రోషం ఎక్కువ కనిపిస్తోంది శోధనలో ఇష్టం కాసింత బెట్టుతో కలిసి.

“శోధనా! వెన్నెల చూడు ఎంతందంగా వుంది అచ్చు నీలా!”

ఒక్క క్షణం శోధన మొహం ఎర్రబడింది.

“చూసావా సిగ్గులో మరింత అందంగా వున్నావు. అయినా హాయిగా ఈ చలిలో ఈ వెదర్‌ని, నీ ప్రజెన్స్‌ని బటర్ స్కాచ్‌తో సెలబ్రేట్ చేసుకుందాం” బ్రతిమిలాడుతూ అన్నాడు విశ్వక్.

చిత్రంగా ఆమెకు అక్క గుర్తొచ్చింది... ఇలానే మాట్లాడే అక్క.

ఆ క్షణం అతడిని ఆట పట్టించాలని, అందంగా ఇబ్బంది పెట్టాలని అనిపించింది.

విశ్వక్ వైపు చూసి... “నాకు బటర్ స్కాచ్ తినిపించాలని ఉందా?” అడిగింది.

“అఫ్‌కోర్స్” అన్నాడు విశ్వక్.

“అయితే ఒక కండిషన్! డబ్బులతో కాకుండా కొట్టుకొచ్చిన బట్టర్ స్కాచ్ కావాలి, ఎందుకంటే కొట్టుకొచ్చిన కాయలు రుచిగా వుంటాయి కదా అలానే బటర్ స్కాచ్ కూడా అన్నమాట. మరో విషయం ఐస్‌క్రీం బండివాడికి డబ్బులు ఇవ్వకూడదు. ఏం చేస్తారో, ఎలా చేస్తారో మీ ఇష్టం” అంది క్రీగంట చూస్తూ.

‘‘సరే’’ అన్నాడు విశ్వక్ ఏ మాత్రం ఆలోచించకుండానే. మళ్ళీ

అనుమానంగా ఆమె వంక చూస్తూ "నన్ను జనంతో కొట్టించే మాస్టర్ ప్లాన్ ఏమైనా వేశావా ఏంటీ?" శోధన వైపు చూసి నవ్వుతూ అడిగాడు.

శోధన మాట్లాడలేదు.

❖ ❖ ❖

విశ్వక్ ఐస్‌క్రీం బండి వైపు వెళ్ళాడు.

ఆ క్షణం ఒక పెద్ద ప్రమాదం ఐస్‌క్రీం బండివాడి రూపంలో ఉంటుందని ఆ ఇద్దరికీ తెలియదు.

ఐస్‌క్రీం బండి ముందు నిలబడి వున్న కుర్రవాడు తల వంచుకొని లోపల ఐస్‌క్రీంలు సర్దుకుంటున్నట్లు నటిస్తూ మధ్య మధ్య అటు ఇటూ తనని ఎవరైనా గమనిస్తున్నారా అని చూస్తున్నాడు. లోపల ఐస్‌క్రీమ్స్ వున్నాయి, వాటి పక్కన రివాల్వర్ వుంది. అతను విశ్వక్, శోధనల వైపే చూస్తున్నాడు.

విశ్వక్ అటూ ఇటూ చూసాడు.

ఐస్‌క్రీం బండివాడి దగ్గరికి వెళ్ళి "రెండు బటర్ స్కాచ్" అని చెప్పాడు.

ఐస్‌క్రీం బండివాడు లోపలికి వంగి ఐస్‌క్రీమ్స్ తీస్తున్నాడు. విశ్వక్ తన గాగుల్స్ తుడుచుకుంటూ ఆగిపోయాడు. ఐస్‌క్రీం తీయడానికి చిన్న డోర్‌ని ఓపెన్ చేసాడు బండివాడు. గాగుల్స్ జేబులో పెట్టుకోబోతున్న విశ్వక్ ఆగాడు. గాగుల్స్ నుంచి ఐస్‌క్రీం తీయడానికి ఓపెన్ చేసిన డోర్ కనిపిస్తోంది. అందులో నుంచి రివాల్వర్ పొజిషన్ కనిపించింది.


క్యాజువల్‌గా బటర్ స్కాచ్ తీసుకుంటూ అతని వైపు చూసాడు. విశ్వక్ మెమరీ పని చేయడం ప్రారంభించింది.

అతనో ప్రొఫెషనల్ కిల్లర్. ఆ చూపులు అతన్ని పట్టిస్తున్నాయి.

విశ్వక్ దూరంగా వున్న శోధన వైపు చూసి చేత్తో సైగ చేసాడు రమ్మన్నట్టు.

'అదేమిటి... పారిపోయి ఐస్‌క్రీం తెస్తాడనుకుంటే తనను రమ్మంటున్నాడు. కొంపదీసి తనను ఇరికిస్తాడా?' అనుకుంటూనే అటువైపు నడిచింది.

శోధన దగ్గరికి రాగానే బటర్ స్కాచ్‌లు రెండు ఆమె చేతిలో పెట్టి మెల్లగా ఆమెకు మాత్రమే వినిపించేలా "నువ్వు ఈ రెండు కప్పుల్లో వున్న బట్టర్ స్కాచ్



తినుకుంటూ ఇంటికి వెళ్ళిపో మన ఐస్‌క్రీం బండీ ఫ్రెండ్‌కు ఒక చిన్న ఫినిషింగ్ టచ్ ఇచ్చి వస్తాను" చెప్పాడు.

ఒక్క క్షణం ఆమెకు అర్థం కాలేదు. అప్పటికే ఆ బండివాడు లోపల వున్న రివాల్వర్ బయటకు తీసాడు. క్షణంలో వెయ్యో వంతు కాలంలో విశ్వక్ శోధన వంటి మీద వున్న చున్నీని లాగాడు.

కోపంగా శోధన ఏదో అనబోయింది. అప్పటికే బండివాడి చేతిలోని రివాల్వర్ శోధన వైపు తిరిగింది. ట్రిగ్గర్ మీద చేతులు బిగుసుకోకముందే విశ్వక్ చేతిలో వున్న శోధన చున్నీ అతడిని తాకింది. మొహం మీద పడ్డ చున్నీ అతని గురిని మార్చింది.

పెద్ద శబ్దంతో బులెట్ మరో వైపు దూసుకు వెళ్ళింది.

"క్విక్ నువ్వు ఇంటికి వెళ్ళిపో" అంటూ ఆమెను ముందుకు నెట్టి ఐస్‌క్రీం బండివాడిని ఒడిసి పట్టుకున్నాడు. అప్పటికే మరో నలుగురు వచ్చి చేరారు.

విశ్వక్ చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది.

క్షణాల్లో ఆ ప్రాంతం బులెట్ శబ్దాలతో దద్దరిల్లింది.

అప్పుడే ఆమె ముందు ఓ వ్యాన్ ఆగింది. అందులో నుంచి ఓ వ్యక్తి వచ్చి ఆమెను వ్యాన్‌లోకి తోసాడు.

ఆ వ్యాన్ ఆమె ఇంటి ముందు ఆగింది. అక్కడ శోధనను వదిలి వ్యాన్ వెళ్ళిపోయింది.

అంతా ఒక కలలా అనిపించింది. తన మీద హత్య ప్రయత్నం జరిగింది.

కానీ విశ్వక్ వల్ల తను సేవ్ అయింది. తన చేతిలో వున్న బటర్ స్కాచ్‌ని అపురూపంగా చూసుకుంది.

❖ ❖ ❖

జర్దార్, యాష్కీ ఇద్దరూ పాతబస్తీలోని పాడుబడిన ఆ ఇంట్లో సమావేశం అయ్యారు.

"యాష్కీ భయ్యా! చాలా జాగ్రత్త! మా పోలీసులను తక్కువ అంచనా వేయొద్దు. పైగా నువ్వు రికార్డ్స్‌లో చచ్చిపోయావు. నీ ఐడెంటిటీ బయటపడకుండా జాగ్రత్తగా వుండు. ఆ శోభన బ్రతికి ఉన్నంతవరకూ ఎప్పటికైనా మనకు ప్రమాదమే! పైగా మా ప్రాణానికి మరొకర్తి తయారయింది అంటూ శోధన ఫోటో బయటకు తీసాడు. "ఫికర్ మత్ కరో... దాని ఫోటో ఇవ్వు.. అరగంటలో ఖతం చేస్తాను..." అన్నాడు.

జర్దార్ శోధన ఫోటో యాష్కీకి ఇచ్చాడు.

ఆ ఫోటో చూసి కంగారుపడిపోయాడు యాష్కీ.

"ఏమైంది భయ్యా!" అడిగాడు జర్దార్.

"ఈమె శోభన. నన్ను ముప్పుతిప్పలు పెట్టిన సిబిఐ ఆఫీసర్!"

"కాదు శోధన అని ఈ మధ్య మాకు న్యూసెన్స్‌గా తయారైంది. మనం చేస్తున్న ప్రతి పనీ వీడియో తీయడం, దాన్ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం చేస్తుంది. ట్యాంక్‌బండ్ దగ్గర మనవాళ్ళను తెలివిగా జనం చేత మర్డర్ చేయించింది కూడా ఈమే. సి ఐ దుర్జనరావ్‌ని కూడా ఘోరంగా చంపేసింది" జర్దార్ చెప్పుకు పోతున్నాడు.

యాష్కీలో ఒక చిన్న అనుమానం పెరిగి పెద్దవ్వసాగింది.

అతను వెంటనే సిబిఐ డిప్యూటీ చీఫ్‌కు ఫోన్ చేసాడు.

అప్పటికే టీవీ చానెల్స్‌లో బ్రేకింగ్ న్యూస్...

"యాక్సిడెంట్‌లో చనిపోయిన యాష్కీ బ్రతికే ఉన్నాడా? వుంటే ఎక్కడ?" యూట్యూబ్‌లో శోధన సంచలనం.

శోభన ఆ వార్తను చూసి చతుర్వేది వున్న గ్రీన్ హిల్స్ వైపు కదిలింది. అక్కడే అతడిని ఎదుర్కోవాలి.

శివ వచ్చాడు, శోధన కెమెరా ముందుకు వచ్చింది. వెనుక గ్రీన్ మ్యాట్.

యాష్కీకి సంబంధించిన వివరాలు చెబుతోంది. వెనుక క్లిప్స్, శోభన సంపాదించిన సాక్ష్యాలు.

అరగంటలో షూటింగ్ పూర్తయింది.

"మేడం మనం అర్జెంట్‌గా హోమ్‌మినిస్టర్‌ని కలవాలి." అంది.

"అలాగే వెంటనే వెళ్దాం" అంది వైదేహి.

❖ ❖ ❖

సిబిఐ చీఫ్ వేదాచలం సెల్ రింగ్ అవుతోంటే ఎత్తి "హల్లో" అన్నాడు. అవతలి వైపు యాష్కీ.

"సార్... శోభనకు చెల్లెలు ఉందా?"

"వుంది. ఇప్పుడా వంశ చరిత్ర పక్కకు పెట్టు శోభన, శోధన కవలలు. ఇద్దరూ చూడ్డానికి ఒకేలా వుంటారు. మన మనుష్యులను పోలీస్ డ్రెస్‌లో సిటీ మొత్తం నింపు. శోభన అనుకునే శోధనను కాల్చినట్టు వుండాలి. మొత్తానికి ఇద్దరూ ఫినిష్ అవ్వాలి, నా దగ్గర వున్న మిలిటరీ రహస్య స్థావరాల వివరాలు వున్న పేపర్స్ నీకు అందిస్తాను. ఈలోగా ఇక్కడ హోమ్‌మినిస్టర్‌తో మాట్లాడి శోభన డెడ్ బాడీని ఢిల్లీ తరలిస్తాను" అని చెప్పేసి సెల్ ఆఫ్ చేసాడు.

అదే సమయంలో శోభన ఆ పరిసరాల్లోకి వచ్చింది.

❖ ❖ ❖

హోమ్‌మినిస్టర్ రెసిడెన్సీ...

శోధనతో కలిసి వచ్చిన వైదేహికి ఎదురెళ్ళి ఆహ్వానం పలికాడు హోమ్‌మినిస్టర్.

ఒక క్షణం అక్కడ నిశ్శబ్దం... శోధన చెప్పింది అంతా విన్నాడు.

ఒక్కో విషయం వింటున్న కొద్దీ అతను తీవ్ర ఉద్రేకానికి లోనయ్యాడు. ఒక సస్పెన్స్ థ్రిల్లర్‌లా వుంది. ఒక క్రైమ్ సినిమా కళ్ళ ముందు కనిపిస్తున్నట్టు వుంది.

అతనికి శోధన అంటే గౌరవం. ఆ రోజు అతను మర్చిపోలేదు.

"ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు? నిజానికి శోభన మీ అక్కయ్య అని, తను నిర్దోషి అని తెలియదు. మీ అక్కయ్య మీద షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ ఉన్నాయి."

"అవును సర్! కొంత మంది పోలీసులు డబ్బుకు అమ్ముడుపోయారు. ఈ టైంలో అక్కయ్యకు రక్షణ కావాలి."

"కానీ సరైన ఎవిడెన్స్ లేకుండా...?" హెూమ్‌మినిస్టర్ సందిగ్ధంలో పడ్డాడు.

"ఈ ఎవిడెన్స్ సరిపోతుందా సర్?"

ఆ మాటలు వినిపించిన వైపు తలలు తిప్పారు అంతా.

తలకు కట్టుతో విశ్వక్.

"మీరు? మీరిక్కడికి ఎలా వచ్చారు?"

"సిటీ ఆఫీసర్‌గా శోభనలాంటి సిన్సియర్ అధికారిని కాపాడుకోవడానికి ప్రత్యేకంగా నియమించబడిన అధికారిని" తన ఐడెంటిటీ చూపించాడు. తన దగ్గర వున్న పేపర్స్ హెూమ్‌మినిస్టర్‌కు ఇచ్చాడు.

శోభన నిర్దోషి అని చెప్పడానికి సాక్ష్యాలు. మీరు వెంటనే మీ పోలీసులను ఆదేశించండి. అంతేకాదు పోలీసుల రూపంలో వున్న యాష్కీ మనుష్యులను షూట్ చేయమని చెప్పండి. ఇట్స్ మై రిక్వెస్ట్ సర్" అన్నాడు విశ్వక్.

"థాంక్యూ విశ్వక్! మీలాంటివారు చెప్పేది ఆర్డర్. నేను వెంటనే ఇన్‌ఫామ్ చేస్తాను" అని శామ్యూల్‌ని పిలిచాడు.

"శామ్యూల్ నీకు స్పెషల్ పవర్స్ ఇస్తున్నాను. మొదటి నుంచి ఈ కేసులో వున్నావు కాబట్టి ఏం చేయాలో అది చెయ్" చెప్పాడు.

శోధన విశ్వక్ వైపే చూస్తోంది.

తలకు తన చున్నీతో కట్టిన కట్టు తన వైపే చూస్తున్నట్టు.

వెళ్లి గట్టిగా హత్తుకోవాలని అనిపించింది. “మనం అర్జెంట్‌గా గ్రీన్ హిల్స్‌కు వెళ్ళాలి. అక్కడ విష సర్పాలు అన్నీ వుంటాయి” అంటూనే ముందుకు నడిచాడు విశ్వక్.

శత్రు సంహారం మొదలైంది.

పోలీసుల వేషంలో వున్న యాష్కీ మనుష్యులను శామ్యూల్ ఊచకోత కోస్తున్నాడు.

అక్కడ గ్రీన్ హిల్స్‌లో...

శోధన ప్రత్యేక కథనం యూట్యూబ్‌లో మొదలైన మొదటి అరగంటలోనే పదివేల మంది చూసారు. కేంద్ర హెూం శాఖ కదిలింది. మరో అరగంటలో సిబిఐ డిప్యూటీ చీఫ్ మన్మథరావ్ ఇంట్లో చేసిన నిర్వాకం తాలూకు వీడియో యూట్యూబ్‌లో అప్‌లోడ్ అయింది.

ఆ సంచలనాలు దేశాన్ని కుదిపేసాయి. సిబిఐలోని డొల్లతనాన్ని చూపిస్తున్నాయి ఆ వీడియోలు.

యూట్యూబ్‌లో ట్రాఫిక్ పెరిగింది.

సిబిఐ లో శోభన లాంటి నిజాయితీపరురాలైన అధికారి గురించి బిబిసి హైలైట్ చేసింది. యాష్కీ ఎక్కడ కనిపించినా షూట్ చేయడానికి ఉత్తర్వులు వచ్చాయి. దేశభద్రత కోసం శోభన చేసిన సాహసం, శోధన చేసిన పరిశోధన ఒక గొప్ప సంచలనానికి నాంది పలికింది.

గ్రీన్ హిల్స్‌లో యాష్కీ, జర్దార్, చతుర్వేది అంతా ఒకే దగ్గర దొరికారు. పోలీసులు ఆ బిల్డింగ్‌ను చుట్టుముట్టారు. యాష్కీ పారిపోయే ప్రయత్నం చేసాడు.

శోధన అతడిని పట్టుకునే ప్రయత్నం చేసింది. విశ్వక్ వారించాడు.

“వాడికి శిక్ష విధించాల్సింది ది గ్రేట్ సి బి ఐ ఆఫీసర్ శోభన” అన్నాడు.

విభ్రాంతిగా చూసింది శోధన, యాష్కీ గుండెల్లో బుల్లెట్ దిగింది.

యుగాల నిరీక్షణ కాలంతో పాటు అలిసిన అలసట.

అక్కా...

అక్కడ ఆ దృశ్యం సప్తవర్ణాల సమ్మిళితంగా కనిపించిన ఎనిమిదవ వర్ణం శోభన.

అక్కడ ఆ దృశ్యాన్ని చూసిన వైదేహి కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి.

❖ ❖ ❖

విశ్వక్ కారు పార్క్ చేసి ముందుకు నడుస్తున్నాడు. అతని తలను చిన్న రాయి వచ్చి ముద్దాడింది.

కోపంగా వెనక్కి తిరిగి చూసాడు. ఎదురుగా శోధన.

“ఏయ్ ఎవర్నువ్వు?” అడిగాడు.

“లవ్వు.”

“ఏంటీ?

“ఏం... అంత పెద్ద రాడ్‌తో తల మీద కొట్టేసరికి మైండ్ దొబ్బిందా?

“ఏయ్ ఏంటా భాష?” కంగారుగా అన్నాడు.

“పెళ్లి చేసుకుందామా.. కబడ్డీ టీంని తయారుచేద్దాం!”

“షటప్” అన్నాడు చిరుకోపంగా.

“అంటే?” అడిగింది శోధన.

“నోర్మూయ్.”

“ఓకే!”

అతడిని గట్టిగా పట్టుకుని మునివేళ్ళమీద నిలబడి అతని పెదవులను మూసేసింది.

“రాక్షసి” అన్నాడు చుట్టూ ఎవరైనా తనను గమనిస్తున్నారేమోనని.

“కాదు వాంపయిర్‌ని” అంది అతడి వైపే చూస్తూ.

ఆ ఇద్దరినీ చూసిన విధాత తను రాయని రాతని వారే రాసుకున్నారని మురిసిపోయాడు.

– అయిపోయింది –



"డెబ్బై ఏళ్ల స్వాతంత్ర్యం, నూట ఇరవై
అయిదు కోట్ల జనాభా... ఎన్నో చట్టాలు,
న్యాయశాస్త్రాలు .
అశేష ప్రజానీకాన్ని నడిపేందుకు
విశేషమైన ప్రజాస్వామ్యం గల మన దేశంలో...
ఆరు గజాల చీర, చిటికెడు బొట్టు, నాలుగు
గాజులు, వగైరా, వగైరా ఇవే ఆడదంటే...
నక్షత్రానికి, నక్షత్రానికి మధ్య ఉండే కాస్త
ఖాళీ ప్రదేశమే తన ఆకాశం... రెండడుగుల
మధ్య ఉండే కొద్దిపాటి దూరమే తనతో
సహవాసం అని అనుకునే పరిస్థితి ఇంకా
సజీవంగా ఉన్న ఈ సమాజంలో...
తన నవ్వుల వెనకున్న కన్నీటి చెమ్మలను,
తన గుండె శబ్ధంలో బద్ధలవుతున్న
అగ్నిపర్వతాలను, తన ఇరుపొద్దుల్లో
శాసిస్తున్న శ్వాసల్లో విస్ఫోటాలను తానే
సమాధి చేసేస్తూ ...
తనది కాదంటున్న సమాజంలో తన
ఉనికిని తానే చాటుకోవటానికి, తానే
న్యాయదేవతై...స్త్రీ ఇప్పుడిప్పుడే ఒక్కో అడుగు
ముందుకేస్తోంది... అన్యాయాన్ని
ఎదుర్కోవాలనే ధీరత్వాన్ని కలిగిన అలాంటి
స్త్రీల అంతరంగమే ఈ

## శోధన...!

JV

పుస్తకం వెల: రూ. 100/-